రెండు మహానగరాలు
రూ॥250/-
పేజీలు:245




నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



మే 15న గ్రామీణ పేదల దేశవ్యాప్త సమ్మె
పెట్రో బాదుడుకు మోదీ సర్కార్ రంగం సిద్ధం 02
అకాల వర్షంతో యుపి అతలాకుతలం 07



సంపుటి 09, సంచిక: 165 | శుక్రవారం | 15-05-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




నీట్ రద్దు

## నియంతృత్వ నిర్ణయం

- కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష రద్దుతో యువత భవితవ్యంపై ప్రభావం
- మోదీ హయాంలోనే 93 పేపర్లు లీక్
- ఆందోళనలో రెండు కోట్ల మంది విద్యార్థులు
- కేంద్రం తీరుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్

నీట్–యుజి 2026 రద్దు మోదీ ప్రభుత్వ నియంతృత్వ, నిరంకుశ నిర్ణయమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష రద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. గత పదేండ్లుగా ప్రధాని మోడీ హయాంలో 93 పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని సిఎం విమర్శించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా, విద్యార్థులకు, తల్లిదండ్రులకు సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక హామీ ఇచ్చారు. నీట్ రద్దు నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తరువాయి 12లో

తెలంగాణ, ఎపి సహా 16 రాష్ట్రాల్లో

# 3వ దశ 'సర్' 30 నుంచి షురూ

- మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో కూడా ప్రక్రియ
- 3.94 లక్షల మందికి పైగా బూత్ స్థాయి అధికారులు నిమగ్నం
- 36.73 కోట్ల మంది ఓటర్ల వద్దకు ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ



**న్యూఢిల్లీ:** భారత్‌లో మూడవ దశ ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్)ను నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో ఈనెల 30వ తేదీ నుంచి దశల వారీగా ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ గురువారం ప్రకటించారు. ఈ ప్రక్రియలో ఓటర్లందరూ ఉత్సాహంగా పాల్గొని, తమ గణన పత్రాలను నింపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అర్హత లేని వారి పేర్లను మినహాయించి, కేవలం అర్హులైన ఓటర్లను మాత్రమే ఓటర్ల జాబితాలో చేర్చడమే ఈ సవరణ లక్ష్యమని ఆయన అన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించేందుకు, కొనసాగుతున్న జనాభా లెక్కల ప్రక్రియలోని ఇంటింటి జాబితా విభాగానికి అనుగుణంగా, మూడవ దశ ప్రక్రియను దశలవారీగా దాదాపు 36 కోట్ల మంది ఓటర్లను కవర్ చేస్తామని భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, లడాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు మినహా ఈ దశలో దేశవ్యాప్తంగా సవరణ జరుగుతుందని, మంచుతో కప్పబడిన ప్రాంతాలలో వాతావరణ పరిస్థితులు, ప్రస్తుతం కొనసాగుతున్న జనాభా లెక్కల కార్యకలాపాల కారణంగా ఆయా ప్రాంతాల షెడ్యూల్‌ను విడిగా ప్రకటిస్తామని కమిషన్ పేర్కొంది. మూడవ దశ సర్‌ను చేపట్టనున్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఢిల్లీ, ఒడిశా, మిజోరం, సిక్కిం, మణిపూర్, ఉత్తరాఖండ్, ఆంధ్ర ప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, తరువాయి 12లో

## తెలంగాణలో జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే

జులై 31న ముసాయిదా ఓటర్ జాబితా

అక్టోబర్ 1న తుది జాబితా విడుదల

03

అమెరికా–చైనా సంబంధాలలో

# సరికొత్త దృక్పథం



ట్రంప్‌తో మొదటి విడత సమావేశం తర్వాత జిన్‌పింగ్ ప్రకటన

- శత్రువులుగా కాదు,భాగస్వాములుగా ఉందామని వ్యాఖ్య
- ఇరు దేశాల సుస్థిర సంబంధాలకు తైవాన్ జలసంధే కేంద్ర బిందువు
- తైవాన్ సమస్యను సరిగ్గా పరిష్కరించకపోతే సంఘర్షణే
- విందు సమావేశంలో ట్రంప్‌ను హెచ్చరించిన జిన్‌పింగ్
- హోర్ముజ్–ఇరాన్ అణ్వాయుధంపై ఏకాభిప్రాయం : వైట్‌హౌస్ ప్రకటన
- అమెరికా చమురు కొనుగోలుకు జిన్‌పింగ్ ఆసక్తి
- ప్రపంచ వారసత్వ 'టెంపుల్ ఆఫ్ హెవెన్'ను సందర్శించిన ట్రంప్–జిన్‌పింగ్
- సెప్టెంబరులో జిన్‌పింగ్ అమెరికా పర్యటన

**బీజింగ్:** అమెరికా–చైనా మధ్య సంబంధాల్లో ఒక సరికొత్త దృక్పథం అనుసరించాలని అంగీకరించినట్లు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ప్రకటించారు. నిర్మాణాత్మకమైన ద్వైపాక్షిక సంబంధాలను అభివృద్ధి చేసుకోవడానికి ఒక సరికొత్త దృక్పథం అనుసరించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయని చెప్పారు. ఇరు దేశాలమధ్యా శాంతి–సుస్థిరతకు, సంబంధాలకు తైవాన్ జలసంధే కేంద్ర బిందువుగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ అంగీకృత చట్రం కేవలం ఒక నినాదంగా మిగిలిపోకూడదని, ఇరు దేశాలూ దీనిని ఆచరణాత్మకాంశంగా మార్చాలని కోరారు. అమెరికా కంపెనీలకు తరువాయి 8లో

## నాలుగు రెడ్‌లైన్స్‌లో తైవాన్ మొదటిది

### పరిష్కారం కాకపోతే ఘర్షణకు అవకాశం

అమెరికా–చైనా మధ్య నాలుగు రెడ్ లైన్స్ ఉన్నాయి. దీనిలో తైవాన్ సమస్య మొదటిది. ట్రంప్ చైనా పర్యటనకు ముందుగానే అమెరికాలోని చైనా దౌత్యకార్యాలయం ఈ విషయాలను సోషల్ మీడియా ద్వారా తెలియజేసింది. తైవాన్ సమస్య, ప్రజాస్వామ్యం–మానవ హక్కులు, రాజకీయ వ్యవస్థ, చైనా అభివృద్ధి హక్కులు ఈ నాలుగు అంశాలు చైనా–అమెరికా మధ్య సంబంధాల్లో ''రెడ్‌లైన్స్''గా ఉన్నాయని, వాటిని సవాలు చేయకూడదని స్పష్టం చేసింది. వ్యూహాత్మక, నిర్మాణాత్మక,స్థిరమైన అమెరికా–చైనా సంబంధాల అభివృద్ధికి మార్గాలను అన్వేషించాలని పేర్కొంది. తైవాన్ సమస్య సరిగ్గా పరిష్కారం కాకపోతే ఈ రెండు ప్రపంచశక్తులూ ఘర్షణ పడే అవకాశాలు ఉంటాయని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు హెచ్చరించారు. చైనా–అమెరికా మధ్య చర్చల్లో తైవాన్ సమస్య అగ్రస్థాన సమస్యగా రూపుదిద్దుకుందని అమెరికా వార్తా సంస్థ 'సిఎన్ఎన్' పేర్కొంది. పశ్చిమాసియాలో యుద్ధం, వాణిజ్యం, కృత్రిమ మేధ,అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో రెండు దేశాలమధ్యా పోటీ, తైవాన్‌కు అమెరికా ఆయుధాల సమస్య ప్రధాన ఎజెండాగా ఉన్నాయని కూడా పేర్కొంది. కాగా చైనా–అమెరికా సంబంధాల్లో తైవాన్ చాలా కీలకమైన సమస్య అని జీ జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. నాయకులు ఇద్దరూ మొదటిరోజు ఇరాన్ విషయం మీదే సుదీర్ఘంగా చర్చలు జరపాల్సి ఉన్నప్పటికీ కూడా అమెరికా–చైనా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యంపైనే వారిద్దరూ దృష్టి పెట్టారని అల్‌జజీరా వార్తాసంస్థ ప్రకటించింది.



భగీరథ మధ్యంతర బెయిల్‌పై

## హైకోర్టులో నేడు తీర్పు

- వాడివేడిగా సాగిన వాదనలు..
- బాధితురాలి తరపున మళ్లీ వాదనలు

ప్రజాపక్షం/హైదరాబాద్

పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బిజెపి నేత బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ దాఖలు చేసిన మధ్యంతర ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం తీర్పు ఇవ్వనుంది. ప్రధాన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను వచ్చే వారానికి వాయిదా వేసిన కోర్టు, ప్రస్తుతం అరెస్టు నుంచి తాత్కాలిక రక్షణ కల్పించాలనే అభ్యర్థనపైనే విచారణ చేస్తున్నట్లు స్పష్టం చేసింది. దీనిపైనే ఇరుపక్షాల వాదనలు పూర్తి చేసి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేస్తామని జస్టిస్ మాధవీదేవి గురువారం ప్రకటించారు. పేట్ బషీరాబాద్ పీఎస్‌లో నమోదైన పోక్సో కేసులో అరెస్టు తరువాయి 12లో



చివరి గింజ వరకూ

# మద్దతు చెల్లిస్తాం

- రబీలో రైతులు పండించిన పంట మొత్తం కొంటాం
- 140 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడి
- ఖమ్మం కలెక్టరేట్‌లో సమీక్ష
- బోనస్‌తో గణనీయంగా పెరిగిన వరిసాగు : మంత్రి పొంగులేటి
- కాంటాలు వేసి తక్షణమే ధాన్యం తరలించాలి
- ఇష్టారాజ్యంగా మిల్లర్ల దోపిడీ : సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని

ప్రజాపక్షం/ ఖమ్మం

కొనుగోలు కేంద్రాల ద్వారా చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు చేస్తామని వీలైనంత త్వరలో కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పడుతున్న సమస్యలను అధిగమిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మిల్లర్లు రైతులను దోపిడీ చేసే క్రమంలో తరుగు తీస్తే తగు చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, రాందాస్ నాయక్, ఎంఎల్‌సి శంకర్ నాయక్ లతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 8575 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని ఈ ఏడాది యాసంగిలో 65 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా 140 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇందులో 90 లక్షల మెట్రిక్ టన్నుల తరువాయి 8లో

## రైతులను మోసం

- పంట మద్దతు ధర పెంపులో కేంద్ర ప్రభుత్వానిది అశాస్త్రీయ వైఖరి
- గిట్టుబాటు ధర, కౌలును పరిగణనలోకి తీసుకోరా?
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నిలదీత



ప్రజాపక్షం/హైదరాబాద్

పంటలకు మద్దతు ధర పెంపు విషయంలో కేంద్ర ప్రభుత్వం అశాస్త్రీయంగా వ్యవహరించి రైతులను నిట్ట నిలువునా మోసం చేసిందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖరీఫ్ పంటల మద్దతు ధర పెంపునకు సంబంధించి వ్యవసాయ పెట్టుబడి గిట్టుబాటు ధర, కౌలు ధరలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా తరువాయి 12లో

## ఢిల్లీలో మరో నిర్భయ ఘటన

- బస్సులో మహిళపై డ్రైవర్, కండక్టర్ సామూహిక అత్యాచారం
- ప్రజలకు భద్రత లేకుండా పోయిందని బిజెపి ప్రభుత్వంపై ఆప్ తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో నిర్భయ తరహా ఘోరం వెలుగుచూసింది. ఓ ప్రైవేట్ బస్సులో మహిళపై డ్రైవర్, కండక్టర్ సామూహిక అత్యాచారానికి తెగబడ్డారు. సోమవారం ఈ ఘటన జరగ్గా బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బస్సు డ్రైవర్, కండక్టర్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు వర్గాలు గురువారం వెల్లడించాయి. ఢిల్లీలో నిర్భయ తరహా ఘటన పునరావృతమైందని సిఎం రేఖాగుప్తా ప్రభుత్వంపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్ర విమర్శలు చేసింది. బిజెపి ప్రభుత్వంలో ప్రజలకు భద్రత లేకుండాపోయిందని మండిపడింది. కాగా, ఘటనపై పోలీసు వర్గాలు తెలిపిన వివరాలు ప్రకారం, ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి సమయంలో జరిగింది. పితాంపురా స్లమ్ ప్రాంతంలో నివసిస్తున్న బాధితురాలు మంగోల్‌పురిలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. విధులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా రాణిబాగ్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. సరస్వతి విహార్‌లోని బిబ్లాక్ బస్ స్టాండ్‌కు చేరుకున్న సమయంలో ఓ స్లీపర్ బస్సు అక్కడ ఆగింది. బస్సు తలుపు వద్ద నిలబడి ఉన్న వ్యక్తిని సమయం ఎంతైందని మహిళ అడగగా, అతడు సహాయం చేయకుండా ఆమెను బలవంతంగా బస్సులోకి లాగినట్లు పోలీసులు తెలిపారు.

**రెండు గంటల పాటు బస్సులోనే దారుణం**

ఆమెను లోపలికి లాగిన వెంటనే బస్సు తలుపులు మూసివేశారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. అనంతరం బస్సు నాంగ్లోయ్ మెట్రో స్టేషన్ సమీపంలో దాదాపు 7 కిలోమీటర్ల పరిధిలో రెండు గంటల పాటు తిరిగిందని తెలిపింది. ఈ సమయంలో డ్రైవర్, కండక్టర్ కలిసి ఆమెపై అత్యాచారం తరువాయి 12లో

ఫార్ములా ఇ-కార్ రేస్ కేసులో

## కెటిఆర్‌కు సమన్లు

- మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ సహా మరో ఇద్దరికి
- జులై 31న కోర్టుకు హాజరుకావాలని ఆదేశాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపుతున్న ఫార్ములా ఇ– కార్ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) కోర్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావుతో పాటు మరో నలుగురికి సమన్లు జారీ చేసింది. ఈ కేసులో జూలై 31న కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ కేసులో మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, మాజీ హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బిఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ గోవెంద కిరణ్ మల్లేశ్వరరావు, అలాగే ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థ గ్రీన్‌కో ఎండి చెలమశెట్టి అనీల్‌కుమార్ కూడా సమన్లు జారీ అయ్యాయి.వీరందరిని చార్జ్‌షీట్‌లో నిందితులుగా చేర్చినట్లు ఎసిబి పేర్కొంది. ఈ వ్యవహారం గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తరువాయి 12లో

# కేరళ సిఎంగా వి.డి. సతీషన్



**న్యూఢిల్లీ :** కేరళలో ముఖ్యమంత్రి అభ్యర్థిపై ప్రతిష్టంభన వీడింది. అసెంబ్లీ ఎన్నికలు ఫలితాలు వెలువడిన 10 రోజుల తరువాత ఎట్టకేలకు కాంగ్రెస్ అధిష్ఠానం ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించింది. రాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా పార్టీ సీనియర్‌నేత వి.డి. సతీషన్‌ను ఎంపిక చేసింది. కేరళ ఎఐసిసి ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షి, రాష్ట్రానికి చెందిన పార్టీ కేంద్ర పరిశీలకులు అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్, అలాగే కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్‌లు గురువారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. చర్చలు, అనేకమందితో సంప్రదింపుల అనంతరం వి.డి. సతీసన్‌ను సిఎల్‌పి నాయకుడిగా నియమించాలని నిర్ణయించినట్లు దాస్‌మున్షి విలేకరులతో అన్నారు. ముఖ్యమంత్రి పదవికి సతీషన్, తరువాయి 8లో

# సంక్షోభంలో తల్లడిల్లుతున్నాం..

మాకు ఇంధనం విక్రయించండి
క్యూబా ఇంధనశాఖ మంత్రి విసెంట్ డీ లా ఓ లెవీ విజ్ఞప్తి



**హవానా:** క్యూబా చమురు సంక్షోభంలో చిక్కుకుంది. అంతర్జాతీయ చట్టాలకు, నిబంధనలకు విరుద్ధంగా అమెరికా విధించిన దిగ్బంధనం కారణంగా క్యూబాలో చమురు నిల్వలు పూర్తిగా అడుగంటిపోయాయని, క్యూబాకు ఇంధనం విక్రయించే దేశాలకు తాము స్వాగతం పలుకుతున్నామని ఆ దేశ ఇంధనశాఖా మంత్రి విసెంట్ డీ లా ఓ లెవీ చెప్పారు. అమెరికా దిగ్బంధనం వల్ల క్యూబా ద్వీపానికి ఇంధన సరఫరా నిలిచిపోయింది. గడచిన 70 సంవత్సరాలలో ఎన్నడూలేనంత దారుణమైన విద్యుత్ కోతలు, స్వచ్ఛంధ హాలీ డేలు క్యూబాలో అమలులో ఉన్నాయి. అమెరికా అనుసరిస్తున్న కుట్రపూరిత విధానాలను ప్రపంచదేశాలు ఇప్పటికే తీవ్రంగా ఖండించాయి. అమెరికా దిగ్బంధనం అమలు చేస్తున్నప్పటికీ ఇంధనం దిగుమతి చేసుకోవడానికి వివిధ దేశాలతో తమ ప్రభుత్వం చర్చలు జరుపుతోందని మంత్రి అన్నారు. మాకు ఇంధనం విక్రయించాలనుకునే ఏ దేశానికైనాసరే తాము స్వాగతం పలుకుతున్నామన్నారు. ఒకప్పుడు క్యూబాకు మెక్సికో, వెనిజులా దేశాలు పుష్కలంగా ఇంధనం సరఫరా చేసేవి. కానీ క్యూబాకు ఇంధన సరఫరా చేస్తే భారీగా ఆ దేశాలపై సుంకాలు విధిస్తామని ఈ ఏడాది జనవరిలో ట్రంప్ హెచ్చరిక జారీ తరువాయి 8లో

# సైనిక బలప్రయోగం శాశ్వత పరిష్కారం కాదు

అంతర్జాతీయ వివాదాలకు సైనిక బలప్రయోగం శాశ్వత పరిష్కారం కాదని అమెరికా–ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం స్పష్టంగా తెలియజేస్తున్నదని, వాటిని అనుసరించి రాజకీయ చర్యలు అవసరమని ఐక్యరాజ్యసమితి (న్యూయార్క్)లో భారత మాజీ రాయబారి, శాశ్వత ప్రతినిధి టి.ఎస్.తిరుమూర్తి బుధవారం నాడు చెన్నైలో ఒక చర్చాగోష్టిలో చెప్పారు. ఉక్రేన్, గాజాల్లో కూడా ఇదే పరిస్థితి. గాజాపై దాదాపు మూడేళ్లుగా (2023 అక్టోబరు 7నుంచి) ఇజ్రాయెల్ ఏకపక్షంగా బాంబుదాడులతో విధ్వంసానికి పాల్పడుతున్నది. దాదాపు 80వేలమంది పాలస్తీనియన్‌లు హతులైనారు. అధ్యక్షుడు ట్రంప్ విధించిన కాల్పుల విరమణ ఇజ్రాయెల్ నుంచి తరచూ ఉల్లంఘనకు గురవుతున్నది. ఆయన ఏర్పాటు చేసిన గాజా పునర్నిర్మాణ కమిటీ ఆరంభం దగ్గరే ఆగిపోయింది. శాంతికోసం చిత్తశుద్ధి పూర్వక కృషి లోపించటమే కారణం. పాలస్తీనియన్‌లను పారద్రోలి గాజాను అంతర్జాతీయ విహారయాత్రలకు సుందర నందనోద్యానంగా పునర్నిర్మించాలన్న ట్రంప్ దురాశాపూరిత పథకం హమస్ తదితర పాలస్తీనియన్ గ్రూపులనుంచి ప్రతిఘటనకు గురవుతూనే ఉంటుంది. ఏకపక్ష యుద్ధం సాధించలేని సమస్యలకు చర్చలు తప్ప మరో పరిష్కార మార్గం లేదు. ఆ చర్చలు అరకొర అంశాలపైగాక పాలస్తీనియన్‌లకు శాశ్వత పితృభూమి ఏర్పాటుతోపాటు ఇజ్రాయెల్– అరబ్ ప్రపంచం సహజీవనం చేసే విధంగా రెండు రాజ్యాల(ఇజ్రాయెల్, పాలస్తీనా) ఏర్పాటు, పరస్పర గుర్తింపు ప్రాతిపదికగా జరగాలి. అమెరికా తన స్వార్థ రాజకీయ ప్రయోజనాలు పక్కనబెట్టి పశ్చిమాసియాలో శాంతిస్థాపన దృష్టితో ఆలోచించి, చొరవ తీసుకున్నప్పుడే ఇది సాధ్యం. అరబ్ రాజ్యాలు కూడా తమ అంతర్గత వైరుధ్యాలను పక్కనబెట్టి ఉమ్మడిగా వ్యవహరించటం అటువంటి పరిష్కారాన్ని వేగవంతం చేయగలుగుతుంది, శాశ్వత శాంతి స్థాపనకు దోహదం చేయగలదు.

ఉక్రేన్– రష్యా యుద్ధం నాలుగేళ్లు దాటి ఐదవ సంవత్సరంలో ప్రవేశించింది. కొద్ది మాసాల్లో ముగుస్తుందని రష్యా తలపెట్టిన యుద్ధం ఉక్రేన్ పక్షాన యూరోపియన్ యూనియన్ ప్రత్యక్షంగా, అమెరికా పరోక్షంగా చేరటంతో యుద్ధ క్షేత్రంలో ఉక్రేన్ ధీటుగా నిలబడగలిగింది. 20 శాతంపైగా ఉక్రేన్ భూభాగం రష్యా వశమైనప్పటికీ ఇరుదేశాలు డ్రోన్‌లు, మిస్సిలీల దాడులతో ఆస్తుల విధ్వంసం కొనసాగిస్తున్నాయి. ఉక్రేన్–రష్యా యుద్ధ విమరణకు ట్రంప్ చేసిన ప్రయత్నాలు యూరప్ దన్నుతో ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ మొండివైఖరితో భగ్నమైనాయి. రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా తమ మౌలిక కోర్కెలు నెరవేర్చకపోవడంతో జెలెన్‌స్కీతో ప్రత్యక్ష చర్చలను నిరాకరించారు. ఈ యుద్ధం ఇరుపక్షాలను సైనికంగా పరీక్షిస్తున్నది. ఆర్థికంగా యావత్ దేశ ప్రజలు నలిగిపోతున్నారు. సైనిక పరిష్కారం కనుచూపుమేర కనిపించటం లేదు. ఈ పరిస్థితుల్లో మే 9న మాస్కోలో 'ఫాసిజంపై విజయ దినం సైనిక పెరేడ్' అనంతరం అధ్యక్షుడు పుతిన్ విలేకరులతో, ''ఉక్రేన్‌తో యుద్ధం ముగింపునకు వస్తున్నది'' అని చెప్పిన మాటలకు విలువ వుంది. 2022 ఫిబ్రవరిలో యుద్ధం ప్రారంభం అనంతరం ఆయన నోట ఇటువంటి మాటరావటం ఇదే ప్రథమం. దీర్ఘకాల శాంతి ఒడంబడికకు తుదిరూపమివ్వటమే చర్చల ఉద్దేశ్యమైతే, అధ్యక్షుడు జెలెన్‌స్కీని కలుసుకోవటానికి కూడా తాను సుముఖంగా ఉన్నానని చెప్పారు. 'సాధ్యమైనంత త్వరలో యుద్ధం ముగించటానికి తమ శక్తికొలది కృషి చేస్తామని కూడా ఆయన చెప్పటం ప్రాముఖ్యత గలది. అయితే – ''ఉక్రేన్ నాటోలో చేరకుండా తటస్థంగా ఉండాలి, డాన్‌బాస్ రీజియన్‌ను రష్యాకు అప్పగించాలి, రష్యాపై ఇయు ఆంక్షలు ఎత్తివేయాలి, మాస్కో–నాటో మధ్య సరికొత్త భద్రతా ఒప్పందం రష్యా ప్రాథమిక డిమాండ్‌లు. తమ సరిహద్దులకు నాటో బలగాలు చేరకుండా ఉక్రేన్ బఫర్‌జోన్‌గా ఉండే పాత భద్రతా ఒప్పందాన్ని ఉక్రేన్ ఉల్లంఘించి నాటోలో సభ్యత్వం కోరటం రష్యా – ఉక్రేన్ యుద్ధానికి మూలం.

ఉక్రేన్‌ను పావుగా ఉపయోగించుకుని రష్యాను లోబరుచుకోవాలనే దురాశను ఇయు విడనాడి, రష్యా భద్రతకు హామీ ఇవ్వటం చర్చలు సఫలం కావటానికి దోహదం చేస్తుంది. ఈ యుద్ధం వల్ల తాము బలహీనపడి అమెరికాపై ఎక్కువగా ఆధారపడవలసిన స్థితి ఇయుకు ఏర్పడింది. భూమిపై వాస్తవాలను, రష్యా భద్రత ఆందోళనలను పరిగణనలోకి తీసుకునే బహుముఖ చర్చలు మాత్రమే ఈ వివాదాన్ని పరిష్కరించగలవు.

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ఇరాన్‌కు భౌతికంగా అపారనష్టం కలుగజేసినా యుద్ధోన్మాదుల ఆశలు నెరవేరలేదు. ఇరాన్ సైనిక శక్తిని (అణుకార్యక్రమం, క్షిపణుల టెక్నాలజీ) ధ్వంసం చేసే లక్ష్యంతో అమెరికా, ఇజ్రాయెల్‌లు గత సంవత్సరం జూన్‌లో ఇరాన్ అణుశక్తి పరిశోధన వసతులపై 12 రోజులపాటు దాడులు చేశాయి. ఈ సంవత్సరం ఆరంభంలో చర్చలు ఒప్పందానికి చేరువైన దశలో అమెరికా, ఇజ్రాయెల్‌లు ఫిబ్రవరి 28న ఇరాన్‌పై విమానాలతో బందిపోటు దాడి చేశాయి. దాని సర్వోన్నత నేతను హతమార్చాయి. ఆరోజునుంచి ఇరాన్‌పై అమెరికా, గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ డ్రోన్, క్షిపణిదాడులు జరుగుతూనే ఉన్నాయి. మరోవైపున హోర్ముజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించటంతో చమురు ఓడల ప్రయాణాలు నిలిచిపోయి ప్రపంచ దేశాలు ఆయిలు, క్రూడ్ కొరతతో సంక్షోభం ఎదుర్కొంటున్నాయి. కాంగ్రెస్ అనుమతి లేకుండా 60 రోజులపైన యుద్ధం కొనసాగించే అధికారం అధ్యక్షునికి లేనందున – ఆ గడువు సమీపిస్తుండగా ట్రంప్ కాల్పుల విరమణ ప్రకటించి, ఒప్పందం కోసం ఇరాన్‌పై ఒత్తిడి తెస్తున్నారు.

హోర్ముజ్ జలసంధిని అంతర్జాతీయ నౌకాయానానికి స్వేచ్ఛాయుత ప్రాంతంగా ఇరాన్ అంగీకరించాలని, శుద్ధిచేసిన ఆయుధ గ్రేడ్ యురేనియంను అంతర్జాతీయ సంస్థకు అప్పగించాలని ట్రంప్ పెట్టిన షరతులను ఇరాన్ తిరస్కరించటంతో చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. ఇరాన్ దారికి రాకుంటే మళ్లీ దాడులు మొదలుపెడతామనే ట్రంప్ హెచ్చరికలు ఇరాన్‌ను కాళ్లబేరానికి తీసుకురాలేవని గత ఐదు దశాబ్దాల చరిత్ర తెలుపుతోంది.

కాబట్టి ఇరాన్ సార్వభౌమత్వాన్ని గౌరవించే ఒప్పందం ద్వారానే శాంతిస్థాపన సాధ్యం. యుద్ధం పరిష్కారం కాదని తేలిపోయినందున ట్రంప్ బెదిరింపులు కట్టిపెట్టి న్యాయమైన పరిష్కారానికి చొరవ చేయకపోతే ఇంట, బయట మరింతగా అప్రదిష్ట పాలవుతారు.

## డిఎంకె కూటమి బలహీనపడలే



**తమిళనాడులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సంపూర్ణ విజయాన్ని సాధించలేకపోయినప్పటికీ, డిఎంకె నేతృత్వంలోని కూటమి ఏమాత్రం బలహీనపడలేదు. ఎన్నికల్లో 1.54 కోట్ల ఓట్లను సాధించగలగడం తమిళనాడు ప్రజలు ఈ కూటమిపై ఉంచిన నమ్మకాన్ని చాటిచెబుతోంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత, కూటమిలోని మిత్రపక్షాలన్నీ తమ అనుబంధాన్ని మార్చుకోకుండా, డిఎంకెతోనే తమ రాజకీయ ప్రయాణాన్ని కొనసాగిస్తామని బహిరంగంగా ప్రకటించాయి. ఈ చర్య డిఎంకె పట్ల మిత్రపక్షాల నాయకులకు ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది.తదనుగుణంగా సూత్రబద్ధమైన రాజకీయ పార్టీలుగా ఏక తాటిపై నిలిచి, ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం ఎప్పటిలాగే తమ ప్రయాణాన్ని కొనసాగిస్తాం.**

- డిఎంకె పార్టీ అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్

## కుటుంబ శ్రేయస్సుతో దేశ ఉజ్వల భవిష్యత్తు

శాస్త్రసాంకేతిక విప్లవం ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చి వేసింది. అరచేతిలో స్మార్ట్ వైకుంఠం తిష్ట వేసింది. మరమనుషులు పుట్టుకొచ్చారు. విశాల భావనలు కురుచనైపోయాయి. ఉమ్మడి కుటుంబాలు అంతరించిపోయి, చిట్టి న్యూక్లియర్ కుటుంబాలు మొలుచుకొస్తున్నాయి. అమ్మమ్మ, నాన్నమ్మ, తాతలు, పెద్ద నాన్న, పెద్దమ్మ, పిన్ని, బాబాయ్‌ల బంధాలు బలహీనపడుతున్నాయి. 'వన్ ఆర్ నన్' సూత్రాన్ని కుటుంబ నియంత్రణ యంత్రాంగం నేర్పింది. కుటుంబం చిన్నదై, మనసులు కురుచనైపోయాయి. నేటితరం నెట్టిట్లో ఒంటరి సంసారాలు చేస్తున్నది. ఒక్కగానొక్క సంతానమని అతి ముద్దుచేసి గారాబం చేస్తూ, ఒంటరి పక్షుల వలె పంజరంలో పెట్టి పెంచుతున్నాం. ప్రేమానురాగాలు, ఆత్మీయ అనుబంధాలు, త్యాగాలు, కలిమిలేముల భావనలు, పరస్పర సహకార భావనలు, దయ కరుణలు బిత్తరపోయా చూస్తున్నాయి. కుటుంబ విలువలు తగ్గి అరాచక పోకడలు పెరుగుతున్నాయి. జీవనశైలిలో అనూహ్య మార్పులు వస్తున్నాయి. అమ్మనాన్నలు, పిల్లల మధ్య కూడా వాణిజ్య బంధాలు పుట్టుకొస్తున్నాయి. జీవన గమనం వేగం పుంజుకుంది. తెలియని దానిని పొందడానికి ప్రయాసలు పెరుగుతున్నాయి. విలువలకు తూట్లు పొడుస్తూ కొత్త పోకడలు మొలుస్తున్నాయి. కుటుంబ భావనలు తరిగిపోయి అశాంతి జనిస్తున్నది.

**కుటుంబమే ప్రథమ పాఠశాల:**

కుటుంబమే ప్రథమ పాఠశాల, అమ్మనాన్నలే తొలి గురువులుగా లేత వయస్సు నుంచే వ్యక్తిత్వ వికాస పాఠాలు నేర్పాలి. జాతి నిర్మాణంలో కుటుంబ విలువలే పునాదులు. సామాజిక, ఆర్థిక ప్రగతిలో కుటుంబ సభ్యుల భూమిక ప్రధానమైంది. కష్టనష్టాలను అధిగమించే 'షాక్ అబ్జార్బర్'లుగా కుటుంబాలు నిలవాలి. సంపదలతో మాత్రమే సంతోషాలు రావని, త్యాగాలతో కూడిన ప్రేమానురాగాలే అసలైన ఆనందాల నిధులని తెలుసుకోవాలి. మానవాళి మనుగడకు కుటుంబమే ప్రధాన యూనిట్. పౌర సమాజానికి కేంద్ర బిందువు కుటుంబం మాత్రమే. కుటుంబ భావనలకు భారత్ ప్రధాన కేంద్రం అయ్యింది. భార్యాభర్తలు, తమ సంతానం, నాన్నమ్మ, తాతలతో కూడిన కుటుంబం ఓ అద్భుత విశ్వవిద్యాలయం. దైనందిన జీవితంలో కుటుంబం మాత్రమే సుఖదుఃఖాలను తట్టుకోవడం నేర్పుతుంది. కుటుంబ విలువలే జాతికి ఊపిరిగా నిలుస్తాయి. జాతి సంస్కృతి వారసత్వాలకు పునాదులు కుటుంబాలు అని తెలుసుకొని కుటుంబ వ్యవస్థలను గౌరవిద్దాం.

**అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం:**

పౌర సమాజ క్రమశిక్షణకు పూనాదులుగా నిలుస్తున్న కుటుంబాల ప్రాధాన్యాలను వివరించడాని కి 1993లో ఐరాస నిర్ణయాన్ని ఆధారంగా సాలీనా ప్రతి ఏట 15 మే రోజున అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం లేదా ఇంటర్నేషనల్ ఫ్యామిలీ డే పాటించుట 1994 నుంచి ఆనవాయితీగా మారింది. కుటుంబ బంధాలు పటిష్టమైనపుడు విశ్వశాంతి నెలకొంటూ, సమాజాభివృద్ధి వేగం పుంజుకుంటుంది. సఖ్యత కొరవడిన కుటుంబాల ప్రభావం పౌర సమాజ సంక్షేమంపై నేరుగా పడుతుంది. పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగాలు కుటుంబ శాంతిని హరించి వేస్తాయి.

మన ఆశ, శ్వాస, ఉనికి, ఊపిరి కుటుంబమే. మన జీవిత ప్రారంభం, అనంత ఆనందాల దేవాలయం కుటుంబమే అని తెలుసుకొని కుటుంబ పునాదులను పటిష్ట పరుచుకుందాం, బాధ్యత కలిగిన రేపటి తరాన్ని బహుకరిద్దాం.

**(15 మే అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం సందర్భంగా)**

# పెట్రో బాదుడుకు మోదీ సర్కార్ రంగం సిద్ధం



ఎం.కోటేశ్వరరావు

బుధవారం నాడు జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రధాని మోదీ తన మంత్రులకు పొదుపు ఉపదేశించారు. ఇంకేముంది పొలోమంటూ కాన్వాయ్‌లను తగ్గించుకుంటున్నట్లు అనేకమంది ప్రకటిస్తున్నారు. చంద్రబాబు నాయుడి వంటి వారు సరేసరి. విదేశీ మారకద్రవ్యం, ఇతర అంశాల సమస్యలు ఇప్పటికిప్పుడు తలెత్తాయా? నిజం అయితే దేశం క్లిష్ట పరిస్థితిలో ఉందని ఎందుకు ప్రకటించటం లేదు. ముందు జాగ్రత్త అని బిజెపి నేతల ముక్తాయింపు. జనాల్లో అదెప్పుడూ ఉంటుంది. విద్దూరం గాకపోతే వారు చెబితేనే జాగ్రత్తపడతారా! ఇక చమురు ధరలను పెంచకతప్పదని కేంద్ర చమురుశాఖ మంత్రి హరదీప్ సింగ్ పూరీ మంగళవారం నాడు చెప్పకనే చెప్పారు. బుధవారం నాడు మరో సారి మోదీ సందేశం. నిజానికి అది మంత్రులకు కాదు, జనానికే. అనివార్యమై ధరలను పెంచామని చెప్పబోతున్నారు. నిర్ణీత వంద కొరడా దెబ్బలను ఒకేసారి తింటారా దశలవారీనా అన్నది తేల్చుకోవాలని జనాలకు అవకాశం ఇస్తున్నారు తప్ప నూరు వాతలు తప్పవు. ఇప్పటికే ఆ మేరకు మీడియాకు తాజా లీకులు వదిలారు. పెట్రోలు మీద లీటరుకు రు.14, డీజిల్ మీద రు.42, గృహవినియోగ ఎల్‌పిజి సిలిండరు మీద రు.674 నష్టం వస్తున్నదన్నది వాటి సారం. చమురు, గ్యాస్ సబ్సిడీలను ఎత్తివేసినందున ఏదో ఒక రూపంలో జనాలు ఈ మేరకు భరించటానికి సిద్ధపడాలనే సందేశం ఇప్పటికే చేరవేశారు. వాణిజ్య అవసరాలకు వాడే గ్యాస్ ధరలను ఎలా పెంచిందీ చూశాము. రోజుకు వెయ్యి కోట్ల రూపాయలకు పైగా చమురు కంపెనీలకు నష్టం వస్తున్నదని పూరీ చెప్పారు. ధరల పెంపుదల గురించి అడగ్గా మీకు తెలియనిదేముంది ప్రధాని నరేంద్రమోదీ ''భవిష్యత్ దార్శనికుడు'' అన్నట్లుగా చెప్పారు. అంటే ఆదివారం నాడు (2026 మే 10) హైదరాబాదులో చేసిన ఒక విలక్షణ ప్రసంగంలో మోదీ యమలీలను గుర్తు చేశారు. ఎప్పుడూ చేసే రాజకీయాలను వదల్లేదు గానీ ఇతర విషయాలే మీడియాలో పతాకశీర్షికలయ్యాయి, విశ్లేషణలు వెలువడ్డాయి. మన్‌కీ బాత్ పేరుతో 2014 అక్టోబరు నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు రేడియోలో నెలకు ఒకసారి చొప్పున 113 సార్లు మోదీ ప్రసంగించారు. ఎంత మంది ఎన్నింటిని విన్నారో ఎవరికి వారు లెక్కవేసుకోవాల్సిందే. ఒక సర్వే ప్రకారం ఐదుశాతం మంది శ్రోతలు మాత్రమే ఆలకించినట్లు తేలింది. అలాంటి ప్రసంగమే హైదరాబాద్‌లో చేశారని చెప్పవచ్చు. దానిపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా చేసిన సమీక్షల సారం ఏమిటంటే ఇంధన ధరలను పెంచకతప్పదనే మహత్తర సందేశాన్ని ప్రధాని దేశానికి అందించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలైన వెంటనే పెంచుతారని ఊరూవాడా భావించారు. అయితే వెంటనే ఆ ప్రకటన వెలువడలేదు. కారణం ఏమిటంటే అమెరికా–ఇరాన్ మధ్య శాంతి కుదిరి సాధారణ పరిస్థితి ఏర్పడుతుందనే వార్తలు రావటం ఒకటి. నిజంగా అది జరిగితే ధరలు ఎందుకు పెంచారని జనం ప్రశ్నిస్తారు. రెండవది ప్రతిపక్షాలు చెప్పింది వాస్తవమే అని నిర్ధారించుకుంటారు. ఇప్పుడు ఏ పేరుతో పెంచాలా అని మధనపడుతున్నారు. ఊహించని విధంగా పశ్చిమాసియా సంక్షోభం కొనసాగటం మోదీ పరివారానికి అవకాశమిస్తున్నదని చెప్పవచ్చు.

ఇజ్రాయెల్ నెతన్యాహు, అమెరికా డోనాల్డ్ ట్రంప్ మాటలను నమ్మి వారం రోజుల్లో ఇరాన్ పని అయిపోతుంది లెమ్మని కేంద్రంలోని పెద్దలు తడిబట్ట వేసుకొని పడుకున్నారని సంక్షోభ ప్రారంభంలో వారి తీరుతెన్నులే స్పష్టం చేశాయి. ఏ రోజు తిరిగి దాడులు మొదలౌతాయో తెలియని స్థితి. ఆందోళనలో ఉన్న వారికి బిపి పెరుగుతూ తగ్గుతూ ఉండే మాదిరి యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తూ ప్రపంచ మార్కెట్ చమురు ధరలు ఉన్నాయి. సోమ, మంగళవారాల్లో మన స్టాక్ మార్కెట్ ఈ కారణంగానే భారీగా పతనమైంది. ఇప్పటికే చమురు కంపెనీలకు లక్ష కోట్ల రూపాయల నష్టం వచ్చిందంటూ వార్తలను రాయిస్తున్నారు. గతంలో ప్రత్యేక పన్నులు, సెస్‌ల రూపంలో బాదిన బాదుడుకు కేంద్ర ప్రభుత్వ ఖజానాకు లక్ష కోట్లలో రాబడి పెరిగినపుడు ఏ మీడియా కూడా ఆ వార్తలను ప్రముఖంగా రాయలేదు గతంలో లాల్‌బహదూర్ శాస్త్రి పాక్‌తో యుద్ధం వచ్చినపుడు ఇచ్చిన పిలుపు మాదిరే ఇప్పుడు తమ మోదీ దేశ పౌరులకు పొదుపు విజ్ఞప్తి చేశారు తప్ప బలవంతం చేయటం లేదని బిజెపి నేతలు చెప్పుకుంటున్నారు. నాడు యుద్ధం వచ్చింది గనుక శాస్త్రి ఆ పిలుపు ఇచ్చారు, ఇప్పుడు సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కూడా లేవు, అంతా సజావుగానే ఉందని చెబుతూ ఆ పిలుపు ఇవ్వటం ఏమిటి? మచ్చుకు మోదీ ప్రవచించిన పది సుభాషితాల్లో కొన్నింటిని చూద్దాం.

''దేశం కోసం ప్రాణాలు ఇవ్వటమే కాదు, దేశం కోసం బతకడం, దేశ కర్తవ్యం కోసం పాటు పడటమూ దేశభక్తే '' అని మోదీ చెప్పారు. పొదుపును కూడా దేశభక్తికి ముడిపెట్టారు. ఇదే ప్రమాదకరం. పొదుపు పాటించనివారు దేశభక్తులు కాదనే భావాన్ని చెప్పకనే చెప్పారు. కడుపునిండా తినటానికి తిండిలేదనే కదా ఎనభై కోట్లమందికి కేంద్ర ప్రభుత్వం ఐదేసి కిలోల ఉచిత బియ్యం లేదా గోధుమలను ఇస్తోంది. వారిని పొదుపు చేయమంటే ఆ ఉచితాన్ని వదులుకోవాలి మరి. వంటనూనె వాడకం తగ్గించటం కూడా దేశభక్తే అన్నారు. పొదుపు గురించి దేశ పౌరులకు మోదీ చెప్పాల్సిన పని లేదు. మన జీన్స్‌లోనే ఉంది. అవసరమైన మేరకే వస్తువులను వాడతారు. ''సాధ్యమైన మేరకు ఇంటి నుంచే పని చేసే పద్ధతి అనుసరించండి, అనవసరంగా ప్రయాణాలు చేయవద్దు, ఇంధనాన్ని పొదుపుగా వాడండి'' మోదీ సుభాషితాల్లో ఒకటి. ఈ చర్యకు ప్రధానే స్వయంగా శ్రీకారం చుట్టి ఉంటే బాగుండేది. హైదరాబాదు వచ్చి ఎక్కడో జరిగే పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసే బదులు అదేదో ఢిల్లీ నుంచే చేయవచ్చు, గతంలో అనేకసార్లు అలా చేశారు. వేలాది మంది పోలీసులు, ఇతర ఏర్పాట్లకు అనవసర ఖర్చు, ఆయాసమూ తప్పేది, ట్రాఫిక్ ఆంక్షల వలన అదనపు దూరం ప్రయాణించిన వాహనదారులకు అదనపు పెట్రోలు, డీజిలు కలసి వచ్చేది. మోదీ స్వయంగా చెప్పినట్లు దేశం ఇంతటి ఇబ్బందుల్లో ఉన్నపుడు లక్షల మంది జనాన్ని తెలంగాణా అంతటి నుంచి ఎండల్లో రప్పించటానికి వాహనాలకు పెద్దమొత్తంలో ఇంధనం ఖర్చు చేయటం అవసరమా? అందువలన పొదుపు గురించి ఇతరులకు చెప్పేముందు ఇవన్నీ ఆలోచించాల్సిన అవసరం లేదా?

మధ్యప్రదేశ్‌లో బిజెపి రాజకీయ నిరుద్యోగి సౌభాగ్య సింగ్ ఠాకూర్‌కు పాఠ్యపుస్తకాల కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. దానికి ప్రమాణస్వీకారం కోసం డజన్లకొద్దీ వాహనాలతో ఉజ్జయిని నుంచి భోపాల్‌కు రెండు వందల కిలోమీటర్ల దూరం అనుయాయులతో అట్టహాసంగా వెళ్లారు. బిజెపి నేతల పొదుపు ఇలా ఉంటుంది.



ఏడాదిపాటు బంగారం కొనవద్దంటూ మరో సలహా! తరువాత కొనుగోలు చేయవచ్చా? ధరలు ఇప్పటికిప్పుడే పెరగలేదే! ఏడాది పాటు మారటోరియం ఎందుకు సూచించారు. రూపాయి విలువను కాపాడలేని కేంద్ర ప్రభుత్వ అసమర్థత కారణంగా డాలర్లకు కొరత ఏర్పడుతోంది. మన స్టాక్ మార్కెట్లో మదుపు చేసిన విదేశీయులందరూ వాటాలను అమ్మివేసి డాలర్లలో తమ దేశాలకు తరలించుకుపోతున్నారు. 2025 ఏడాది మొత్తంలో 2.4లక్షల కోట్ల రూపాయల విలువైన డాలర్లు తరలిస్తే ఈ ఏడాది మే 11వ తేదీ నాటికే రూ.2.28లక్షల కోట్లు విలువ దాటాయని వార్తలు. మేకిన్ ఇండియా, మేడిన్ ఇండియా, ఆత్మనిర్భరత, ఎగుమతి ప్రోత్సాహ పథకాల వంటి ఎన్ని కబుర్లు చెప్పినా, రాయితీలు ఇచ్చినా దిగుమతులు పెరుగుతున్నాయి తప్ప ఎగుమతులు పెరగటం లేదు. అయినా విదేశీ వస్తువులు వాడవద్దని ప్రధాని చెబుతారు, దిగుమతులకు ఎందుకు అనుమతిస్తున్నట్లు? ఏటా మన దేశం 700 నుంచి 800 టన్నుల బంగారం దిగుమతి చేసుకుంటున్నది. ముడి చమురు తరువాత బంగారానికే ఎక్కువగా విదేశీమారక ద్రవ్యం ఖర్చు చేయాల్సి వస్తోంది. బంగారంతో నగలు చేయించేందుకు కొంతమంది కి పని కల్పించవచ్చు తప్ప నిజానికి అది ఉత్పాదతకు పనికి వచ్చేది కాదు. గత కొద్ది సంవత్సరాలుగా పసిడి ధర పెరుగుతూనే ఉన్నప్పటికీ మోడీ మాట్లాడ లేదు. గతంలో బంగారం దిగుమతులపై పన్ను ఎక్కువగా ఉన్న కారణంగా దొంగ రవాణా పెరిగిందని తగ్గించారు. తాజాగా దిగుమతి పన్ను, సెస్‌లు కలిపి ఆరు నుంచి 15శాతానికి పెంచారు. నిరంతరం దిగుమతులు తప్ప ఎగుమతులు పెరగటం లేదు. ఒకదశ దాటిన తరువాత చెల్లింపుల సంక్షోభం వచ్చే అవకాశం ఉంది. విదేశీ ప్రయాణాలు చేయవద్దని, వివాహాలు విదేశాల్లో చేయవద్దని చెప్పారు. విదేశాలు లేదా పొరుగు రాష్ట్రాల్లోని విలాసవంతమైన ప్రాంతాల్లో వివాహాలు చేసేవారందరూ శతకోటీశ్వరులు తప్ప సామాన్యులు కాదు. మోదీ తన పాలనాకాలంలో కోటీశ్వరులు, శతకోటీశ్వరులను పెంచారు తప్ప తగ్గించలేదు. తాను అధికారానికి వచ్చినపుడు కేవలం 70 మంది బిలియనీర్లు ఉంటే 2026నాటికి 308పెరిగారు. కోటీశ్వరుల గురించి చెప్పాల్సిందేముంది! వారంతా సొమ్మును విచ్చలవిడిగా విలాసాలకు ఖర్చు చేయక ఏం చేస్తారు! అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గితే వినియోగదారులకు తగ్గిస్తాం, పెరిగితే పెంచుతాం అని చెప్పిన వారు 2022 ఏప్రిల్ మొదటి వారం నుంచి ధరలను సవరించటం నిలిపివేశారు. గణనీయంగా తగ్గించాల్సిందిపోయి పెంచకపోవటం తమ ఘనత అని చెప్పుకుంటున్నారు. ఇది గోబెల్స్ పద్ధతి. ఆ ఏడాది ఏప్రిల్, మే, జూన్, జూలై నాలుగు నెలల్లో మనం దిగుమతి చేసుకున్న ముడి చమురు ధర సగటున బ్యారెల్ 108.5 డాలర్లు. ఆ తరువాత క్రమంగా తగ్గుతూ వచ్చింది.

2022–23 ఏడాది సగటు ధర 93 డాలర్లు. ఇక 2025 ఏప్రిల్ నుంచి 2026 ఫిబ్రవరి వరకు పదకొండు నెలల సగటు ధర 66.53 డాలర్లు, అంటే నాలుగేండ్లలో ఇంతగా తగ్గినప్పటికీ వినియోగదారులకు పైసా తగ్గించలేదు. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైన తరువాత ధర పెరుగుతున్నది. మనం కొనుగోలు చేసే ముడి చమురు ధర మార్చినెల 25వ తేదీ వరకు సగటు ధర 123 డాలర్లకు చేరింది.

ఏప్రిల్‌లో 114.48, మే పన్నెండవ తేదీవరకు 105.09 డాలర్లు, అంటే నాలుగేండ్ల క్రితం నాటి స్థాయికి చేరుకున్నది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పెట్రోలియం ప్లానింగ్ మరియు అనాలిసిస్(పిపిఏసి) వెబ్‌సైట్ వెల్లడించిన సమాచారం ఇది. ఆయిల్ ప్రైస్ డాట్‌కామ్ సమాచారం ప్రకారం ఇరాన్‌పై దాడులు ప్రారంభం ఫిబ్రవరి 28న కాగా అంతకు ముందు 25న మనదేశం కొనుగోలు చేసిన ముడి చమురు ధర70.25 డాలర్లు ఉంటే మార్చినెల 23న 157డాలర్లకు చేరింది. ఈ కారణంగానే ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ధరలను సమీక్షిస్తామని కేంద్రం చెప్పింది. కేంద్రానికి సెగ తగలగానే మళ్లీ మొదలు పెడతారన్నమాట!

# మే 15న గ్రామీణ పేదల దేశవ్యాప్త సమ్మె

గ్రామీణ ప్రాంత పేదలకు కొంగు బంగారంలా ఉన్న ఉపాధి హామీ (కొత్త చట్టం (విబి–జి రామ్–జీ మిషన్ 2025)తో తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుంది. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ పనులు లేని సమయాలలో పూర్తిగా వ్యవసాయ కూలీపనులపైన ఆధారపడే పేదలకు సంవత్సరానికి కనీసం 100 రోజులు పని కల్పించాలని 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఆనాటి యుపిఎ ప్రభుత్వం రూపొందించడం జరిగింది. గ్రామీణ పేద కుటుంబాలకు నైపుణ్యం లేని కార్మికులకు వంద రోజులు ఉపాధి కల్పించుటకు చట్టపరమైన హామీని కల్పించింది. గత 20 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్రాలు 10 శాతం చొప్పున తమ బడ్జెట్లో నిధులను కేటాయిస్తూ గ్రామీణ పేదలకు సరాసరిగా 50 నుండి 60 రోజులు పని కల్పిస్తూ వచ్చారు. ఈ పథకం వలన గత రెండు దశాబ్దాలుగా గ్రామీణ పేదలు ఆర్థికంగా బలపడినారనే చెప్పవచ్చు.

2014 నుంచి శ్రీ నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం క్రమంగా ఉపాధికి నిధులు తగ్గిస్తూ వస్తుంది. 2013లో రూ.1.05 లక్షల కోట్లు కేటాయించగా అది 2024 వచ్చేసరికి రూ.81వేలకోట్లకు తగ్గింది. దీనివలన పని దినాలు తగ్గుతూ కూలీలకు 100 రోజులకుగాను సరాసరి 40 శాతం వరకు పడిపోయింది. చివరకు కేంద్ర ప్రభుత్వము ఈ పథకానికి ఇచ్చే నిధులను 2026 నుండి తగ్గిస్తూ కేంద్రం రాష్ట్రాలు 60:40 శాతంగా భరించాలని కొత్త చట్టంలో పేర్కొన్నది. నిబంధనలు, రూల్స్,పెత్తనం మాత్రం కేంద్రం చేతిలో పెట్టుకుంది.

కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం(ఎంజిఎన్ఆర్జిఏ)లో కొన్ని మార్పులను తీసుకొస్తూ 'భారతదేశ అభివృద్ధి ఉపాధి, జీవనోపాధి హామీ మిషన్– 2025' (వీబీ–జీఆర్ఏఎం–జీ)గా పేరు మార్చి, 2025 డిసెంబర్19న పార్లమెంటు ఆమోదించింది. ఈ నూతన చట్టంలో ఆర్థిక సంవత్సరానికి 100 నుండి 125 రోజులు ఉపాధి కల్పిస్తామని చెప్తుతుంది. వికసిత్ భారత్ 2047 దార్శనికతలో భాగంగా ఉపాధి కల్పనను మౌలిక సదుపాయాల కల్పన,అభివృద్ధి, జీవనోపాధి పెరుగుదలతో అనుసంధానించడానికి ఈ బిల్లు తీసుకొస్తున్నట్లు ప్రకటించారు.

**'విబి గ్రామ్ జి' గ్రామీణ పేదలపై దాడి**

ఈ బిల్లుపై పార్లమెంటులో చర్చల సందర్భంగా వామపక్షాలు, కాంగ్రెస్ తో పాటు ప్రతిపక్షాలు మొత్తం వికసిత్ భారత్ గ్రామీణ ఉపాధి, జీవనోపాదుల పథకం ఒక బూటకమని, ఇది గ్రామీణ పేదలపై మోడీ సర్కార్ సాగిస్తున్న ప్రత్యక్ష దాడి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికుల పొట్టగొట్టే ఈ పథకాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు కొనసాగాలని డిమాండు చేసారు. నిధులను కేంద్రమే యధావిధిగా 90% భరించాలని, పనిదినాలను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలపై 40 శాతం భారం మోపుటమంటే ఈ పథకాన్నికీ నీరు కార్చినట్టే అవుతుందని కోరారు.

పాత చట్టంలో అనేక అంశాలను తొలగించి కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఉపాధి హామీ చట్టంలో ఉన్న హక్కులను తగ్గించడం, పని దినాల గ్యారెంటీని దెబ్బతీయడం, నిరుద్యోగ భృతి హక్కును నిర్వీర్యం చేయడం, గ్రామీణ పేదల జీవనాధారంపై నేరుగాదాడి జరుగుతుందని, కనీస వేతన విధానం లేకపోవడంతో గ్రామీణులకు పనిదినాలు భారీగా తగ్గిపోతున్నాయి. ఫలితంగా కూలీలు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారు. కొత్త పథకం అమలులోకి వచ్చాక క్రమంగా పని దినాల కల్పన గ్రాఫ్ పడిపోతున్న విషయం గమనార్హం.

ఉపాధిహామీ పథకాన్ని పరిరక్షించాలని డిమాండు చేస్తూ వికసిత్ భారత్ గ్రామీణ ఉపాధి, జీవనోపాదుల పథకం ఒక బూటకమని, ఇది గ్రామీణ పేదలపై మోడీ సర్కార్ సాగిస్తున్న ప్రత్యక్ష దాడి అని నిరసిస్తూ మే 15న దేశవ్యాపితంగా సమ్మెకు గ్రామీణ కార్మిక సంఘాలు, రైతు కూలీ సంఘాలతో ఏర్పడిన ఎన్ఆర్ఇజిఎ సంఘర్ష్ మోర్చా ఐక్య వేదిక పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా ఉపాధి కార్మికులను ఏకతాటిపైకి తీసుకువచ్చి, మే 15న సమ్మెతో పాటు పంచాయతీ కార్యాలయాల ఎదుట ఆందోళనలు, ముట్టడులు నిర్వహించాలని పిలుపునిచ్చాయి. 160 మంది ఎంపీల సంతకాలతో ప్రధాన మంత్రికి వినతి, పార్లమెంట్లో నిరసన చేపట్టడం వంటి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించింది.

**తగ్గుతున్న పనిదినాలు, ఉపాధి కోల్పోతున్న కార్మికులు**

మహబూబాబాద్ జిల్లాలో అధికారిక గణాంకాలను విశ్లేషిస్తే.. 2023–24 ఆర్థిక సంవత్సరములో 55.88 లక్షల పని దినాలు కల్పించగా, 2024–25 నాటికి 45.79 లక్షల పని దినాలకు పడిపోయింది. 2025–26 లో పని దినాలు సంఖ్య మరింత తగ్గి 29.27 లక్షలకు పరిమితమైంది. అంటే రెండేళ్లలో సుమారు 26 లక్షలకు పైగా పని దినాల కోతకు గురయ్యాయి. ఒక కుటుంబానికి సగటున ఇచ్చే పని దినాలు 2023–24లో 50 రోజులు ఉండగా, 2025–26 నాటికి 31 రోజులకు తగ్గిపోయాయి.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నమోదు జాబు కార్డులు 1,05,817 ఉండగా యాక్టివ్ జాబ్ కార్డులు 69,764ఉన్నాయి. మొత్తం 11,31,048 పని దినాలు కల్పించారు. 12 మండలాల్లో కలిపి 11 లక్షలకు పైగా పని దినాలను కల్పించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఈ చట్టం ఊతమిస్తుంది.. జిల్లా పలిమెల(17,191), కొత్తపెల్లి గోరి (49, 519) వంటి మండలాల్లో లక్ష్యానికి తక్కువగా నమోదు కావడం ఆందోళన కలిగిస్తుంది. ఒకప్పుడు లక్షకు పైగా పనిదినాలు ఉన్న ప్రాంతాల్లో ఎప్పుడూ కూలీలకు పూర్తిస్థాయిలో పని దొరకని పరిస్థితి. మొత్తం 1,05,817 కార్డులు ఉన్నప్పటికీ, 69,746 కార్డులు మాత్రమే యాక్టివ్ గా ఉండటం చట్టం అమల్లో ఉన్న మందగమనానికి నిదర్శనం. నల్లగొండ జిల్లాలో జాబ్‌కార్డ్స్ 2,10,420 ఉండగా, యాక్టివ్ జాబ్ కార్డ్స్ వారు 83,400 మాత్రమే. కల్పించిన పని దినాలు సరాసరి 39 మాత్రమే.

దీనితో కూలీలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు. పని దినాల కోత వల్ల జిల్లాలోని అత్యధిక జనాభా కలిగిన ఎస్సీ ఎస్టీ వర్గాలే ఎక్కువగా నష్టపోతున్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరల దృష్ట్యా వేతన రేటు కొంత పెరిగినప్పటికీ పని దినాలు సంఖ్య తగ్గడం వల్ల కూలీల వార్షిక ఆదాయం పడిపోతుంది. ప్రభుత్వము ఈ సంవత్సరం దినకూలీ రూ.281 లనుండి రూ.307 లకు పెంచినది. అయితే పని దినాలను పెంచాలని, దినసరి వేతనం కనీసం రూ. 500 లకు పెంచాలని, పని ప్రదేశాలలో కనీస వసతులు కల్పించాలని, వలసలను అరికట్టాలని కోరుతున్నారు.

**ఉపాధికి సాంకేతిక చిక్కు :** పని ప్రదేశంలో ఎన్ఎంఎస్ యాప్ కూలీలకు శాపంగా మారింది. మొబైల్ లో ఫేస్ రికగ్నిషన్ కాకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్కసారి స్కాన్ కావడం లేదు. పలుమార్లు పని దగ్గరికి వచ్చి వెళ్లి పోవాల్సిన పరిస్థితి ఉంది. అటు ఫీల్ అసిస్టెంట్లు, ఇటు ఉపాధి కూలీలు తర్జనభర్జన పడుతున్నారు.వేసవి ఎండలు మండుతున్న పని ప్రదేశంలో కనీసం మెడికల్ కిట్లు, నీడ వంటి సదుపాయాలు లేకపోవడంతో కూలీలు బయటకు రాలేని పరిస్థితి.

**చట్టం మార్పుతో నిధుల కోత :**

ఉపాధి హామీ చట్టంలో మారుతున్న నిబంధనలు, బడ్జెట్ కేటాయింపులు అనిశ్చితి వల్ల క్షేత్రస్థాయిలో మెటీరియల్ కాంపోనెంటు పనులు నిలిచిపోయాయి. దీనివల్ల గ్రామాల అభివృద్ధి పనులు కుంటుపడుటమే కాకుండా కూలీలు మట్టి పనులకే పరిమిత మవుతున్నారు.

2014 కంటే ముందు కూలీలకు గడ్డపారలు, పారలు, తట్టలు ఇచ్చేవారు. ఇప్పుడు కూలీలే కొనుక్కోవాల్సి వస్తున్నది.

వేతనాలు చెల్లింపులో జరుగుతున్న జాప్యం కూలీల నడ్డి విరుస్తుంది. గతంలో15 రోజుల్లోపే అందే కూలి, ప్రస్తుతం మూడు నాలుగు నెలలకు కూడా చేతికందడం లేదు. దీనికి తోడు ఆధార్ ఆధారిత చెల్లింపులు (ఎంబిపిఎస్ ) గందరగోళం మరో సమస్యగా మారింది.వారం రోజులు చేసిన పనికి వెంటనే పోస్టాఫీసు/బ్యాంకులో జమ చేయాలని కోరుతున్నా రు.

**పాత చట్టాన్ని అమలు చేయాలి :**

ఉపాధి హామీలు ఐరిష్ క్యాప్చర్ విధానంతో ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్కసారి స్కాన్ కావడం లేదు. పలుమార్లు పని దగ్గరకు వచ్చి వెళ్ళిపోవాల్సిన పరిస్థితి ఉంది. అటు ఫీల్డ్ అసిస్టెంట్లు ఇటు ఉపాధి కూలీలు తర్జనభజన పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విబిజిఆర్ ఏఎంజీ పథకాన్ని పూర్తిగా రద్దు చేసి పాత చట్టాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.

ఉజ్జిని రత్నాకర్ రావు , 9490952646



# బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలి

### డిజిపిని కలిసిన విద్యార్థి, మహిళా సంఘాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోక్సో కేసు ఎదుర్కొంటున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, మహిళా సంఘాల నాయకులు రాష్ట్ర డిజిపి సివి ఆనంద్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కేసు నమోదై ఆరు రోజులు గడిచినా నిందితుడిని అదుపులోకి తీసుకోకపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 8న మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో మైనర్ బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా, పోలీసులు పోక్సో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుపై ప్రభుత్వం సిట్ విచారణకు ఆదేశించినప్పటికీ, బండి భగీరథ విచారణకు హాజరుకాకుండా పరారీలో ఉన్నారని సంఘాల నాయకులు ఆరోపించారు. మైనర్ బాధితురాలి ఫోటోలను సోషల్ మీడియాలో ప్రచారం చేయడం చట్టవిరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిజిపిని కోరారు. సామాన్యులకు ఒక న్యాయం, అధికార పార్టీలోని నేతల కుటుంబ సభ్యులకు మరో న్యాయమా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. బండి భగీరథపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేసి, వెంటనే కస్టడీలోకి తీసుకోవాలని విద్యార్థి, మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి.డిజిపిని కలిసిన వారిలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, బిఆర్ఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, పిడిఎస్‌యు జాతీయ నాయకుడు మహేష్, రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి సుమంత్, పిఒడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్య, రాష్ట్ర కార్యదర్శి అనురాధ, ఎన్ఎఫ్‌డబ్ల్యూ నాయకురాలు ఫాహీమా తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలను చుట్టాలుగా మార్చుకుంటున్న పాలకులు

- పేదలు తప్పు చేస్తే ఎన్‌కౌంటర్లు, పెద్దలకు నోటీసులతో సరి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కు రాజకీయాలు
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- హనుమకొండ రాజకీయ శిక్షణ తరగతుల ప్రారంభం




**ప్రజాపక్షం/హనుమకొండ :** చట్టాలను పాలకులు చుట్టాలుగా మార్చుకుంటూ పేదలపై ప్రతాపం చూపుతున్నారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో హనుమకొండ మండల శాఖ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ శిబిరం గురువారం ప్రారంభం అయింది. మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు తప్పు చేస్తే ఎన్ కౌంటర్‌లు చేసే ప్రభుత్వాలు పెద్దలకు మాత్రం నోటీసులతో సరి పెడుతున్నారని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ విషయములో ఇదే జరుగుతున్నదని అన్నారు.ఆ కేసు విషయములో సిట్ వేయడమే ఇందుకు నిదర్శనం అని, అదే సామాన్యుడి విషయములో ఇది జరుగుతుందా అని ప్రశ్నించారు.బండీ భగీరథ్‌ను రాష్ట్ర ప్రభుత్వం కాపాడే ప్రయత్నం చేస్తున్నదన్నారు. ప్రస్తుతం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్ముక్కు రాజకీయాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. బండి భగీరథపై తక్షణమే విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ భారత్ అని, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నానని గొప్పలు చెప్పుకున్న ప్రధాని మోడీ, నేడు ప్రజలకు బంగారం కొనొద్దు, పెట్రోల్ డీజిల్ వాడకం తక్కువ చేయా లి, విదేశీ ప్రయాణాలు తగ్గించాలనే నీతి సూక్తులు వల్లే వేస్తు, తమ 12 సంవత్సరాల పాలన వైఫల్యాలను, దివాళ కోరు విధానాలను కప్పిపుచ్చుకోవడానికి నాటకాలు మొదలుపెట్టాడని తీవ్రంగా విమర్శించారు. ఆర్థిక సంక్షోభం నెలకొన్నప్పుడు పేద, మధ్య తరగతి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయకుండా కోటీశ్వరులపై రెండు నుంచి ఐదు శాతం పన్నులు వేయాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నా పట్టించుకోకుండా కార్పొరేట్లతో కుమ్మక్కై ఆర్థిక వ్యవస్థను దిగజార్చుతూ డీజిల్, పెట్రోల్ ఇతర వస్తువుల ధరలు భారీగా పెంచడానికి కుయుక్తులు పన్నుతున్నారని అన్నారు. కేంద్ర ప్ర భుత్వం చేస్తున్న కుయుక్తులను తిప్పి కొట్టాలని ఆయన పిలుపు నిచ్చారు. అనునిత్యం పేదల కోసం పోరాటాలు నిర్వహించే కమ్యూనిస్టు పార్టీని ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు. ఈ శిక్షణా తరగతులలో హనుమకొండ సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి,మద్దెల ఎల్లేష్, ప్రొఫెసర్ మార్క శంకర్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### బిసి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో

# కష్టపడి చదవాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి విద్యార్థులు యుపిఎస్‌సి వంటి ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని కష్టపడి చదవాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. బంజారాహిల్స్‌లోని కొమురంభీం భవన్‌లో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం బిసి గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, బిసి సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమాయదేవి, ఎంజెపి సెక్రటరీ సైదులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికిగాను మొత్తం 508 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానిస్తున్నట్లు తెలిపారు. బిసి గురుకులాలు, హాస్టళ్ల విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలు పదో తరగతిలో 98.99 శాతం ఉత్తీర్ణత సాధించాయని, రాష్ట్ర సగటు కంటే మెరుగైన ఫలితాలు నమోదు చేశాయని చెప్పారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ విద్య ఎవరి సొత్తు కాదని, సరస్వతి దేవికి రంగు, రూపు తేడాలు ఉండవని అన్నారు. విద్యపై విద్యార్థులు చూపే ఏకాగ్రతే వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని పేర్కొన్నారు.అవకాశాలను సృష్టించుకున్న వారే సమర్థులవుతారని, రాజకీయాలంటే ఒకే విధమైన ధోరణి అన్న భావనను విడనాడాలని సూచించారు. భవిష్యత్తులో విద్యార్థులు అసెం బ్లీ, పార్లమెంట్‌కు ఎన్నికై చట్టాలు చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాజకీయ నాయకులు చేసే చట్టాలు దేశ భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని పేర్కొన్నారు.

## కేరళం సిఎంగా ఎంపికైన సతీశన్‌కు సిఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేరళ ముఖ్యమంత్రిగా ఎంపికైన వి.డి.సతీశన్‌కు తెలంగాణ సిఎం ఎ.రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కేరళ ప్రజలకు దశాబ్దాలుగా సేవ చేస్తూ విలువలతో కూడిన రాజకీయాలు చేసే సతీశన్‌కు ఈ పదవి రావడం సముచిత గుర్తింపు అని సిఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడిఎఫ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని అన్నారు. విద్య, వైద్యం, అక్షరాస్యతలో కేరళ దేశానికి ఆదర్శంగా నిలిచిందని రేవంత్ రెడ్డి తెలిపారు. సతీశన్ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్య క్తం చేశారు. పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, పరస్పర సహకారం వంటి రంగాల్లో కేరళ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. కేరళ మరింత ప్రగతి, సుసంపన్నత దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్టు రేవంత్ రెడ్డి తెలిపారు.

# ‘సర్’ షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం


- ఇంటింటి సర్వే 25 జూన్ నుంచి
- జూలై 31 న ముసాయిదా ఓటరు జాబితా
- జూలై 31 నుంచి అగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ
- సెప్టెంబర్ 28 లోపు అభ్యంతరాల పరిష్కారం
- అక్టోబర్ 1 న తుది ఓటరు జాబితా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన తాజా షెడ్యూల్ ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ‘ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ’ (స్పెషల్ ఇటెన్సివ్ రివిజన్–ఎస్ఐఆర్) ఫేజ్3 కార్యక్రమం జూన్ 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నదని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. రాష్ట్రంలో జూన్ 15 24 వరకూ సన్నాహక కార్యక్రమాలు, శిక్షణ, ప్రింటింగ్ ప్రక్రియ కొనసాగనుంది. అనంతరం జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. జూలై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేయనున్నారు. అనంతరం జులై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తారు. జూలై 31 నుంచి అగస్టు 30 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ సెప్టెంబర్ 28 వరకు జరుగుతుంది. అనంతరం తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటనలో వివరించింది. తెలంగాణ రాష్ట్రంలో ఈ ప్రక్రియలో మొత్తం 35,985 మంది బూత్ లెవల్ ఆఫీసర్లు , 25,886 మంది బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొననున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 3,39,20,705 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ బూత్‌కు తప్పనిసరిగా నియమించాలని ఎన్నికల సంఘం సూచించింది. ఈ ప్రక్రియను పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ఓటర్లు సహకరించాలని ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేసింది.



## బిసి సంక్షేమ శాఖ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన విహెచ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం నియమించిన బిసి సంక్షేమ శాఖ సలహాదారుగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి.హనుమంతరావు (విహెచ్) గురువారం రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఓబిసి సెల్ చైర్మన్ ఈర్లపల్లి శంకర్, మాజీ మంత్రి జానారెడ్డి, మెట్టు సాయికుమార్ తదితర కాంగ్రెస్ నేతలు, బిసి సంఘాల ప్రతినిధులు ఆయనకు శుభాకాంక్ష లు తెలిపారు. బిసిల సంక్షే మం, విద్య, ఉపాధి అవకాశాల అభివృద్ధికి కృషి చేస్తానని విహెచ్ తెలిపా రు. బిసిలకు ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా చేరేలా పనిచేస్తానని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.



# దేశం గర్వించదగ్గ ఫొటో జర్నలిస్ట్ ‘రఘు రాయ్’

### తెలంగాణ రాష్ట మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతదేశం గర్వించదగ్గ ఫొటో జర్నలిస్ట్ ‘రఘు రాయ్’ అని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రముఖ ఫొటో జర్నలిస్ట్, పద్మశ్రీ రఘు రాయ్ సంస్మరణ సభ తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం (టిఎస్‌పిజెఎ) ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో జరిగింది. కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఐజెయు సెక్రటరీ జనరల్ డి.సోమసుందర్, ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు కె.సత్యనారాయణ, టియుడబ్ల్యుజె అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, ఉప ప్రధాన కార్యదర్శి కె.రాములు, ప్రముఖ ఫొటో జర్నలిస్ట్ డి.రవీందర్ రెడ్డి, టిఎస్‌పిజెఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నరహరి తదితరులు పాల్గొన్నారు. తొలుత రఘు రాయ్ చిత్రపటానికి ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సభకు టిఎస్‌పిజెఎ అధ్యక్షులు అనుమల్ల గంగాధర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తన ఫొటోలతో భారతదేశాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప ఫొటో జర్నలిస్ట్ రఘు రాయ్ అని కొనియాడారు. ఫొటోలు భవిష్యత్తు తరాలకు మంచి ఆలోచనలు కల్పిస్తాయని అన్నారు. కల్చర్, లైఫ్, బంగ్లాదేశ్ యుద్ధం, భోపాల్ గ్యాస్, దలైలామా, మదర్ థెరెసా, ఇందిరాగాంధీ తదితర సంఘటనలు, గొప్ప వ్యక్తులకు సంబంధించి తీసిన ఫోటోలు రఘు రాయ్‌కు గొప్ప పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చాయని చెప్పారు. ఫోటో జర్నలిస్టులు ఫొటోలను చిత్రించే క్రమంలో చేసే సాహసాలు వారికి వృత్తిలో సంతృప్తినిస్తాయన్నారు. సోమసుందర్ మాట్లాడుతూ రఘు రాయ్ తీసిన ఫోటోలు ప్రపంచవ్యాప్తంగా అనేక పత్రికలు సందర్భనుసారం ప్రచురితం చేశాయని గుర్తుచేశారు. ఆయన ఫోటోల్లో సహజత్వం ఉట్టి పడుతుందని, సందర్భాన్ని కళ్లకు కట్టినట్లు ఫొటో రూపంలో చూపించడం రఘు రాయ్ సొంతమని కొనియాడారు. విరాహత్ అలీ మాట్లాడుతూ భారతదేశ ఫోటో జర్నలిస్టులకు కొత్త దిశ చూపిన ఏకైక ఫొటో జర్నలిస్ట్ రఘు రాయ్ అని అన్నారు. రాంనారాయణ మాట్లాడుతూ దేశంలోని ఫోటో జర్నలిస్టులందరికీ రఘు రాయ్ ఒక మార్గదర్శి అని, ఆయన ఫోటోలు తీసే క్రమంలో చూపించిన తెగువ, సందర్భం ఆయనను ఉన్నత స్థాయిలో నిలిపాయని కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం ఉపాధ్యక్షులు టి.కిషోర్ సింగ్, పి.రామ్మూర్తి, సంయుక్త కార్యదర్శి బిహెచ్ఎం కె.గాంధీ, కోశాధికారి కె.అనిల్ కుమార్, కార్యవర్గ సభ్యులు పి.మోహన చారి, ఎండి.అలీ ముద్దీన్, జి.వసంత్ కుమార్, నక్క శ్రీనివాస్, ఎ.మహేష్ కుమార్, పి.హరి కృష్ణ, ఎన్.శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సివరేజ్

## కార్మికుల సమస్యలపై పోరాడుదాం

### ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా




**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ సివరేజ్ బోర్డులో పనిచేయుచున్న ఉద్యోగుల దీర్ఘ కాలిక సమస్యలు, నూతన పోస్టుల నియామకాల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.నర్సింహ్మ పిలుపునిచ్చారు. హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సివరేజ్ బోర్డ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ బి 1934 ఎఐటియుసి అనుబంధం సమావేశం గురువారం హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ అధ్యక్షులు కె.రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎం.నర్సింహ్మ మాట్లాడుతూ వాటర్ వర్క్స్‌లో అనేక సంవత్సరాలుగా నూతన నియామకాలు లేకపోవడం వలన ఉన్నటువంటి ఉద్యోగుల పైన పని భారం పడుతున్నదని, హెచ్ఆర్ఎంఎంఆర్ కార్మికులను పర్మనెంట్ చేయాలని ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేయుచున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. యూనియన్ గతంలో చేసిన అనేక పోరాటాల వలన కొంతమంది ఉద్యోగులు గతంలో పర్మినెంట్ కావడం జరిగిందని దానికి ఎఐటియుసి పోరాట ఫలితమే అని వారు తెలియజేశారు. జలమండలిలో జరగబోయే యూనియన్ ఎన్నికల్లో ఎఐటియుసి కార్మికుల సమస్యల పరిష్కారానికి ముందు వరుసలో ఉండనున్నదని వారు తెలియజేశారు. ఈ సమావేశానికి యూనియన్ సలహాదారు బి. వెంకట స్వామి, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.నరసింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. సత్యనారాయణ, ఉప ప్రధాన కార్యదర్శి జిబి సర్వేశ్వరరావు, నాయకులు ఇ.జంగయ్య, కె.అశోక్, జి.అనిల్ కుమార్, ఎల్.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## దుగ్గొండి తహసీల్దార్ కార్యాలయంలో ఎసిబి దాడులు

### రూ.10 వేల లంచం తీసుకుంటున్న ఆర్ఐ పట్టివేత

**ప్రజాపక్షం / దుగ్గొండి :** తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. వారసత్వ భూమికి సంబంధిత ఫైల్ పరిష్కారం కోసం రూ.10 వేల లంచం తీసుకుంటున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ని ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని మధిర గ్రామానికి చెందిన లొల్లా టి రాజు తన తండ్రి నర్సయ్య మరణంతో తన తండ్రి పేరు మీద ఉన్న 27 గుంటల వ్య వసాయ భూమి పట్టా చేసుకునేందుకు వారసత్వ భూమి నమోదు ప్రక్రియ కోసం దరఖాస్తు చేసుకోగా, సంబంధిత ఫైల్‌ను ముందుకు జరిపేందుకు ఆర్ఐ రూ.10వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. బాధితుడు ఈ విషయాన్ని ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు పక్కా ప్రణాళికతో దాడి నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలోనే లంచం తీసుకుంటున్న సమయంలో అధికారులు ఆర్ఐను అదుపులోకి తీసుకుని, నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించి, సంబంధిత పత్రాలను సీజ్ చేసినట్లు తెలిసింది. ఎసిబి అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# గ్రేహౌండ్స్ బలగాలు అనుక్షణం అప్రమత్తం



### డిజిపి సి.వి. ఆనంద్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర పోలీస్ శాఖలో కీలకమైన గ్రేహౌండ్స్ బలగాలు ఎప్పటికప్పుడు ఆధునిక శిక్షణతో సిద్ధంగా ఉండాలని డిజిపి సివి ఆనంద్ సూచించారు. గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయాన్ని గురువారం సందర్శించిన ఆయన, మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లు, శిక్షణా విధానాలు, పరిపాలనా అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా శిక్షణా ప్రమాణాలు, మాడ్యూల్స్‌ను నిరంతరం నవీకరించాలని డిజిపి అధికారులకు ఆదేశించారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కొనే స్థాయిలో బలగాల పోరాట సామర్థ్యాన్ని పెంపొందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సిబ్బందికి క్రమం తప్పకుండా ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహిస్తూ, కఠినమైన శిక్షణతో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంచాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో గ్రేహౌండ్స్ బలగాల పునర్వ్యవస్థీకరణ అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. గ్రేహౌండ్స్‌కు సంబంధించిన 708 సరెండర్డ్ పోస్టుల ప్రతిపాదన ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని డిజిపి తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చిన తరువాతే సిబ్బందిని మాతృ విభాగాలకు పంపే ప్రక్రియ చేపడతామని పేర్కొన్నారు. గ్రేహౌండ్స్ సిబ్బంది అంకితభావం, వృత్తి నైపుణ్యాన్ని ఈ సందర్భంగా డిజిపి అభినందించారు. దేశంలోనే అత్యుత్తమ మావోయిస్టు వ్యతిరేక దళంగా ఉన్న గ్రేహౌండ్స్ ప్రత్యేక గుర్తింపును క్రమశిక్షణ, ముందస్తు సన్నద్ధతతో కొనసాగించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో గ్రేహౌండ్స్ డిజి ఆపరేషన్స్ డాక్టర్ అనిల్ కుమార్, గ్రూప్ కమాండర్ రాఘవేందర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

#### అక్టోపస్ కమాండో శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన డిజిపి

ఇబ్రహీంపట్నంలోని అక్టోపస్ కమాండో శిక్షణ కేంద్రాన్ని డిజిపి సివి ఆనంద్ గురువారం సందర్శించారు. క్యాంపస్‌లోని అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, శిక్షణ విభాగం, ఆపరేషనల్ కమాండక్షలు, అధికారులతో ముఖాముఖి మాట్లాడారు. ఏవైనా అవాంఛనీయ ఉగ్రవాద సంఘటనలు ఎదురైతే వాటిని తిప్పికొట్టేందుకు సన్నద్ధత గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ బృందాల పనితీరు, శిక్షణ విభాగాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. సిబ్బంది, అధికారులతో ఆయన సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి ఎం.వెంకటేశ్వర్లు, అదనపు ఎస్‌పి సిహెచ్ రఘునందన్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## శనివారం నాటికి అండమాన్‌కు నైరుతి పవనాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతులు, ప్రజలకు భారత వాతావరణ విభాగం (ఐఎండి) తీపు కబురు అందించింది. ఈ ఏడాది నైరుతి పవనాలు త్వరలోనే పలకరించనున్నాయని ప్రకటించింది. నైరుతి రుతుపవనాలు శనివారం నాటికి అండమాన్‌ను తాకనున్నాయని వెల్లడించింది. దీంతో తీవ్ర ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించనుందని తెలిపింది. తుపాను వలయం సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల వరకు విస్తరించిందని, రానున్న 48 గంటల్లో మరింత బలపడే అవకాశముందని పేర్కొంది. ఈ నేపథ్యంలో రెండు రోజుల్లో నైరుతీ రుతుపవనాలు రానున్నయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ ఏడాది ఎల్‌నినో ఏర్పడే అవకాశం ఉందని, ఈ కారణంగా వర్షాభావం పరిస్థితులు నెలకొననున్నాయని వాతావరణ నిపుణులు వెల్లడించారు. ముందస్తుగానే నైరుతి రుతు పవనాల రాక కొంత ఊరట ఇస్తోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
**సాగునీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ**
“2026-27 ఆర్థిక సంవత్సరానికి హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లోని జలసౌధ బిల్డింగ్ కాంప్లెక్స్‌లో సివిల్ పనుల నిర్వహణ, హౌస్ కీపింగ్ మరియు టాయిలెట్ క్లీనింగ్ మెటీరియల్స్ సరఫరా, ఎలుకల నియంత్రణ చికిత్సలు మరియు శానిటైజేషన్ కోసం వార్షిక నిర్వహణ అంచనా. టెండర్ నోటీసు నెం. 03/2026-27, తేదీ: 02.05.2026 ECVతో: **రూ.54,34,530/-**. బిడ్ల స్వీకరణకు చివరి తేదీ & సమయం తేదీ: 29.05.2026 మధ్యాహ్నం 3.00 గంటల వరకు. **గమనిక:** మిగతా వివరముల కొరకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.
V.Srinivas Sd/-13.05.2026
పర్యవేక్షక అభియంత, I&CADD
ఇరిగేషన్ సర్కిల్, హైదరాబాద్, రెడ్‌హిల్స్, హైదరాబాద్.
DIPR R.O. No. : 2418-PP/CL/ADVT/2026-27, Date: 14-05-2026
ఫోన్: 040-23394218



## నిరుపేద గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్యే ప్రభుత్వ లక్ష్యం

### బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ప్రవేశాలకు లక్కీ డిప్ నిర్వహణ

**ప్రజాపక్షం/మెదక్ :** నిరుపేద గిరిజన విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. గురువారం గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 202627 విద్యాసంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బిఎఎస్) ప్రవేశాల కోసం లక్కీ డిప్ నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో పూర్తిస్థాయి ఉచిత విద్యతో పాటు భోజనం, వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తున్నాట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. లక్కీ డిప్‌లో మూడో తరగతికి 10 మంది, ఐదో తరగతికి 5 మంది. ఎనిమిదో తరగతికి 5 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి వి. నీలిమ, గిరిజన వసతి గృహ అధికారి డి. లింగమూర్తి, సిబ్బంది శ్రీకాంత్, సమీర్, శ్రీకాంత్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.




## కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వాలి

### డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రైతు భరోసాను చెల్లించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. గురువారం నాడు మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో కౌలు రైతుల సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడి ఓదాలో అప్పటి ప్రభుత్వానికి కౌలు రైతులకు రైతు భరోసా నష్టపరిహారం చెల్లించాలని ఉత్తరం రాశాడని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కౌలు రైతులకు రైతు భరోసా పంట నష్టపరిహారం వ్యవసాయ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం విస్మరించిందన్నారు. ముఖ్యమంత్రి మూడేళ్ల పాలనలో కౌలు రైతులకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించలేదని ఆరోపించారు. కౌలు రైతులను ప్రభుత్వము గుర్తించకపోవడంతో పంట నష్టపోయిన సమయంలో పరిహారము అందక కౌలు రైతులు మరింత అప్పులపాలవుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం కౌలు రైతుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. భరోసాతోపాటు సన్న వడ్లకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్, నిజాంపేట గ్రామ మాజీ ఉప సర్పంచ్ కొమ్మాట బాబు, మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బొమ్మల మైసయ్య, సీనియర్ దళిత నాయకులు మాసాయిపేట మల్లేశం, సత్యం, సరిత, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద శంకరంపేట గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

**ప్రజాపక్షం/పెద్దశంకరంపేట :** ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా పెద్ద శంకరంపేట ప్రభుత్వ గ్రంథాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ వి. సుజాత తెలిపారు. విద్యార్థులు, యువత, పాఠకుల్లో పఠనాసక్తిని పెంపొందించడం, గ్రంథాలయ వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రదర్శనలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతో పాటు సాహిత్యం, చరిత్ర, విజ్ఞాన శాస్త్రం, వ్యవసాయం, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పలు గ్రంథాలను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను ప్రత్యేకంగా ప్రదర్శించనున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుపై ఆసక్తి పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని, విద్యార్థులు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. పాఠకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బడిబాట

### విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం

**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజ్ గౌడ్, ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్‌లు అన్నారు. మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజు గౌడ్, ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్ లు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు పాలకవర్గ సభ్యులతో కలిసి ఇంటింటికి వెళ్లి విద్యార్థుల నమోదుపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులను తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. అలాగే విద్యార్థులకు పౌష్టిక ఆహారంతో పాటు ఉచిత యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను కూడా అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాలకవర్గ సభ్యులు, విద్యార్థులు, నాయకులు నేతికుంట సత్యనారాయణ, బంటు శ్రీశైలం, జొన్నోజి రామాచారి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

**ప్రజాపక్షం/నేరడిగొండ :** మండలంలోని తేజాపూర్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బద్దం పోతారెడ్డి, ప్రధానోపాధ్యాయులు మణిలత, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.



బడీడు పిల్లలను బడిలో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే నేరడిగొండ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్వైజర్ సంతోష్ కుమార్ వడదెబ్బపై జాగ్రత్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# సింగరేణికి మళ్లీ స్వర్ణయుగం తీసుకొస్తాం

### కొత్త గనులు- వేలాది ఉద్యోగాలే లక్ష్యం

### మంత్రి డా. వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/మందమర్రి :** సింగరేణి సంస్థకు పూర్వ వైభవం తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జి.వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. సింగరేణి అభివృద్ధికి కార్మికులు,అధికారులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.మందమర్రి సింగరేణి ఏరియాలోని కెకె5 గనిపై నిర్వహించిన శ్రమశక్తి అవార్డు గ్రహీత ఏడుకోల పవన్ కుమార్ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ "సింగరేణి కార్మికులతో కాకా కుటుంబానికి విడదీయరాని అనుబంధం ఉంది. కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి కోసం కాకా వెంకటస్వామి చేసిన సేవలు చిరస్మరణీయాలు" అని పేర్కొన్నారు. సింగరేణి సంస్థకు రూ.400కోట్ల నిధులు సమకూర్చి లక్ష ఉద్యోగాలను కాపాడిన ఘనత కాకా వెంకటస్వామిదేనని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కోల్ బ్లాక్ టెండర్లలో సింగరేణి సంస్థ పాల్గొనేలా చర్యలు చేపడుతోందని తెలిపారు. కొత్త గనుల ప్రారంభంతో యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి వెల్లడించారు. ఆర్‌కెపి ఓపెన్‌కాస్ట్ ఫేజ్2 ప్రాజెక్టు ద్వారా సుమారు ఐదు వేల మందికి ఉపాధి కలుగుతుందని, ఫారెస్ట్ అనుమతులు వచ్చిన వెంటనే గని ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెర్క్స్ పై ఇన్‌కమ్‌ట్యాక్స్ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించిన మంత్రి, రిటైర్డ్ కార్మికులకు రూ.10 వేల పెన్షన్ అందేలా ఎంపి వంశీకృష్ణ పార్లమెంట్‌లో కృషి చేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాల పెంపు అంశాన్ని కూడా త్వరలోనే ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగే సమావేశంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా శ్రమశక్తి అవార్డు గ్రహీతలు ఏడుకోల పవన్ కుమార్, పుల్లూరి లక్ష్మణ్‌లను మంత్రి శాలువాలతో సన్మానించి అభినందించారు. అనంతరం కార్మికులతో కలిసి రక్షణ ప్రతిజ్ఞలో పాల్గొన్నారు.కార్యక్రమంలో మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ,కార్మిక సంఘాల నాయకులు,అధికారులు,పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



## కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** నిజాంసాగర్ మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీముభారక్ చెక్కులను ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు, డిసిసి చైర్మెన్ ఏలే మల్లిఖార్జున్‌తో కలిసి లబ్దిదారులకు పంపిణీ చేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం అచ్చంపేట్ గ్రామపంచాయతీ పరిధిలోని లింగంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు. తమ స్వంతింటి కలను సాకారం చేసిన ఎమ్మెల్యేకు, డిసిసి చైర్మెన్‌లకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై సమరభేరి

### ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ధర్నా



**ప్రజాపక్షం/నిర్మల్ :** రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ భారతీయ జనతా పార్టీ శాసనసభాపక్ష, బిజెఎల్‌పి నాయకులు, నిర్మల్ ఎం.ఎల్.ఏ. ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్మల్ ఆర్.డి.ఓ. కార్యాలయం ఎదుట భారీ ధర్నా కార్యక్రమం ప్రారంభమైంది. ఆర్డీ, కార్యాలయానికి చేరుకున్న ఎం.ఎల్.ఏ. ముందుగా ప్రకటించిన కార్యాచరణ ప్రకారం, ఎం.ఎల్.ఏ. మహేశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు రైతులతో కలిసి భారీ ర్యాలీగా తరలివచ్చి ఆర్డీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వం రైతుల పట్ల అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ ఆయన ఈ ధర్నాకు దిగారు వరి కొనుగోళ్ళు, మద్దతు ధర, రైతు భరోసా వంటి పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**ఉద్రిక్తల మధ్య నిరసన :** ఎమ్మెల్యే రాకతో ఆర్డీ కార్యాలయ ప్రాంగణం బిజేపి శ్రేణులు రైతులతో కిక్కిరిసిపోయింది. రైతు వ్యతిరేక విధానాలు నశించాలి అంటూ నినాదాలతో హోరెత్తించారు. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు భారీగా మోహరించారు. నిరసన కొనసాగుతుండటంతో ఆర్డీ కార్యాలయం వద్ద ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఈ ధర్నాలో జిల్లా బిజేపి నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




**ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్ :** నిర్మల్ మున్సిపాలిటీ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్మల్ మున్సిపాలిటీకి సంబందించి పలు అంశాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలో ప్రతీరోజు మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అన్నారు. ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా ముదస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఉక్కడా కూడా నీరు నిల్వ ఉంచకుండా తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. త్రాగునీరు నిల్వ ఉంచే నీటి ట్యాంకులను శుభ్రపరచాలని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా త్రాగునీరు అందించాలని వివరించారు. పట్టణంలో పచ్చదనం పెంపుపై దృష్టి సారించాలని తెలిపారు. పెండింగ్ పన్నుల విసూలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పట్టణ ఆదాయం పెంపుపై దృష్టి పెట్టాలని చెప్పారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలిగితే వెంటనే స్పందించి ఆ సమస్యను తొలగించాలని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు మున్సిపల్ కమీషనర్ రవి బాబు ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన తండాలకు మహర్దశ

### రోడ్ల నిర్మాణానికి రూ.15కోట్లు నిధులు మంజూరు

### ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్



**ప్రజాపక్షం /భైంసా :** ముథోల్ నియోజకవర్గంలో గిరిజన తండాల్లో బి.టి. రోడ్ల నిర్మాణానికి 15 కోట్ల 25 లక్షల రూపాయల నిధులు మంజూరు కావడం జరిగిందని ఎం.ఎల్.ఏ. పవార్ రామారావు పటేల్ తెలియజేశారు. గురువారం ఎస్.ఎస్. జిన్నింగ్ ఫ్యాక్టరీ లోని ఆయన నివాసంలో మాట్లాడారు. తండాలు వెలిసినప్పటినుండి. బిటి. రోడ్లు లేక గిరిజన ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని 14.20 కిలోమీటర్లు, పొడవునా తండాలు కలుపుతూ 7 రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. జి.ఓ.నెం.65 ప్రకారం ఐటిడిఏ ద్వారా ప్రభుత్వం పాలన పరమైన అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. నర్సాపూర్ మండలంలో నందన్‌టు నందన్ తండా రోడ్డుకు కోటి రూపాయలు, బామ్ని టు బామ్ని తాండరోడ్‌కు 2 కోట్ల రూపాయలు, కుబీర్ మండలంలో నిగ్వ టు పల్సి తండాకు 7 కోట్ల రూపాయలు, చాత టు చాత తండా 1కోట్ల 25 లక్షల రూపాయలు, కుంటాల మండలంలో దౌనెల్లి టు గంపూర్ తండాకు కోటి రూపాయలు, అంబకంటి టు హనుమాన్‌తండా రోడు వంతెన నిర్మాణానికి 30 లక్షలు, మెదన్‌పూర్ టు మహాదేవ్ తండాకు 2 కోట్ల 70 లక్షలు రూపాయల నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు చెప్పారు.

## అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

### ఎస్పి నితిక పంత్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ఆవులు, దూడల అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, వ్యక్తిగత దాడులకు పాల్పడడం చట్టరీత్యా నేరమని జిల్లా ఎస్పీ నితిక పంత్ అన్నారు. పశువుల రవాణాకు సంబంధించిన నిబంధనలు, చట్టపరమైన అంశాలపై గో రక్షణ కమిటీ తో జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశం నిర్వహంచారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... గో రక్షకుల పేరుతో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోని దాడులు చేయడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని అన్నారు. పశువుల అక్రమ రవాణాను గమనిస్తే, వెంటనే 8712670505, 8712670557కు, స్థానిక పోలీసులకు, డయల్ 100కు సమాచారం అందించి సహకరించాలన్నారు.ఇప్పటికే జిల్లా సరిహద్దులో 14 చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆవులు,దూడల అక్రమ రవాణా, అమ్మకం లేదా వధకు వ్యతిరేకంగా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని అన్నారు. చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా జంతువుల కదలికలను పర్యవేక్షించడానికి అధికారులు మూడు షిఫ్టులలో చెక్‌పాయింట్‌లను ఏర్పాటు చేశామని, ఏవైనా సమస్యలు ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సతీష్ పాల్గొన్నారు.


## నకిలీ విత్తనాలు, గడ్డి మందుపై కఠిన చర్యలు : ఎస్పి అఖిల్ మహాజన్

**ప్రజాపక్షం/మావల :** జిల్లాలో నకిలీ విత్తనాలు, నిషేధిత గడ్డి మందు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అధికారులను ఆదేశించారు. గురువారం పోలీస్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బక్రీద్ పండుగ సందర్భంగా చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలని, గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో వర్టికల్స్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిరంతర నిఘా ఉంచాలని, రాత్రి గస్తీని బలోపేతం చేయాలన్నారు. గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సురేందర్ రావు, ఏఎస్పీ రుత్విక్ సాయి, శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్, డీఎస్పీలు శ్రీనివాస్, జీవన్ రెడ్డి, ఇంద్రవర్ధన్, సిఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

## తండ్రిని చంపేందుకు ప్రయత్నించిన కుమారుడు అరెస్ట్

**ప్రజాపక్షం/భైంసా :** దహేగాం గ్రామానికి చెందిన రోహిత్, 19 గత కొంత కాలంగా మద్యం, చెడు అలవాట్లకు బానిసై ఇంట్లో కుటుంబ సభ్యులతో తరచూ గొడవలు పడుతున్నారు. ఈ రోజు ఉదయం సుమారు 10.30 గంటలకు తండ్రితో గొడవపడుతూ కొడవలితో దాడి చేయగా, బాధితుడికి చేతివేళ్ళకు తీవ్ర గాయాలు అయ్యాయి. డయల్ 100 సమాచారం మేరకు వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. ఘటన అనంతరం పరారైన నిందుతుడు రోహిత్‌ను అదుపులోకి తీసుకుని, నేరస్థలం నుండి కొడవలి స్వాదీనం చేసుకున్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించడమైనది. ఈ సందర్భంగా ఎస్పీ, ఏఎస్పీ, సిఐ, ఆధ్వర్యంలో ఎస్.ఐ. సుప్రియ తెలియజేస్తూ ఇటువంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బాల్కొండలో బడిబాట ర్యాలీ




**ప్రజాపక్షం/బాల్కొండ :** విద్యా వారోత్సవాల్లో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట పురస్కరించుకుని జడ్పీహెచ్ఎస్ బాల్కొండలో విద్యార్థులు, ఉపాధ్యాయులచే బడిబాట ర్యాలీ గురువారం నిర్వహించామని ఎంఈఓ బట్టు రాజేశ్వర్ తెలిపారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించిన అనంతరం పాఠశాలకు 100 శాతం హాజరున్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్‌కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతి



**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు ప్రధానం చేశారు. మండలంలోని పాలెం గ్రామంలో గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాలెంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా బడిబాట ర్యాలీ, తల్లిదండ్రుల సమావేశం పాలెం గ్రామ సర్పంచ్ పలిగిరి రాధ అధ్యక్షతన జరిగింది. 2026–27 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన జాయినబీ, ఫాతిమా అస్తబేగం, రాణిలను డాక్టర్ గంగాధర్ ఫిజియోథెరపిస్ట్ విద్యార్థులకు మెమోంటో శాలువాతో పాటు 2000, 1000, 500 నగదు బహుమతి అందించడం జరిగింది. అదేవిధంగా ఉమేష్ మహారాజ్ బిసి, ఎస్సి, ఎస్టీ జేఏసీ మోర్తాడ్ అధ్యక్షులు బోడ అలేఖ్య మహారాణి ధర్మ మహిళా జాగృతి మోర్తాడ్ మండల కన్వీనర్ పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ సావిత్రిబాయి పూలే జ్యోతిబాపూలే డాక్టర్ బిఆర్ అంబేద్కర్, భారత రాజ్యాంగం పుస్తకాలను అందించారు. విద్యార్థులను ప్రోత్సహించిన డాక్టర్ గంగాధర్, అశోక్ సామ్రాట్, అలేఖ్య లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణు గోపాలరావు, ఉపాధ్యాయులు మహేష్ కుమార్, చంద్రశేఖర్, నరసింహ స్వామి, రాజేందర్, జయశ్రీ, రాజేశ్వరి, నచ్చయ్య తదితరులు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు ముందు ముందు ఇంకా మంచిగా చదువుకొని గ్రామస్తులకు, తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు పేరు తీసుకరావాలని పాలెం గ్రామ సర్పంచ్ పలిగిరి రాధ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు జహీర్, రాజేశ్వర్, లత తదితరులు పాల్గొన్నారు.

## నేరడిగొండ మండల కాంగ్రెస్ కన్వీనర్‌గా రాజశేఖర్ రెడ్డి

**ప్రజాపక్షం/నేరడిగొండ :** కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డా.నరేష్ జాదవ్ ఆదేశాల మేరకు నేరడిగొండ మండల నూతన కన్వీనర్‌గా ఏలేటి రాజశేఖర్ రెడ్డిని నియమించారు. పార్టీ బలోపేతానికి చేసిన కృషిని గుర్తిస్తూ తనకు ఈ బాధ్యత అప్పగించారని రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు రాజశేఖర్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు.

## 'బడే' భవిష్యత్తుకు బాట

**ప్రజాపక్షం/బైసా :** భైంసా మండలం మహాగాం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాడు కృష్ణ ఆధ్వర్యంలో గ్రామ ప్రజల భాగస్వామ్యంతో విద్య ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ప్రతి చిన్నారి బడికి రావాలి భవిష్యత్తు వెలుగులు నింపాలి అనే సందేశంతో స్వయం సహాయక సంఘాలు అధ్యక్షులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్ సభ్యులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హరీష్, రాగిణి, శ్రీలత, అభిషేక్, గ్రామ పెద్దలు కలిసి బడిబాటలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

### జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించబడుతున్న విద్యా వారోత్సవాలలో గురువారం రోజున నిర్వహించిన జయశంకర్ బడిబాట, మెగా తల్లిదండ్రుల సమావేశం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుండంపల్లిలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం ఉపాధి హామీలో భాగస్వాములైన తల్లిదండ్రులు పనిచేస్తున్న ప్రదేశానికి వెళ్ళి నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి దర్శనం భోజన్న హాజరై విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై విద్యార్థుల తల్లిదండ్రులందరూ దృష్టి పెట్టాలని ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల సకల అభివృద్ధికి దోహదం చేస్తాయని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని తెలియజేస్తూ గుండంపల్లి పాఠశాల అన్ని రంగులతో ముందు ఉందని తెలియజేశారు. గ్రామ సర్పంచ్ తక్కల రమణారెడ్డి, పాఠశాలకు ఏ అవసరం వచ్చినా తాను ముందు ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పి.సదానందం, సెక్టోరల్ అధికారి ప్రవీణ్, గ్రామ ఉప సర్పంచ్ మద్ది విలాస్, పంచాయతీ సెక్రెటరీ స్వామి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధు సిలారి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.మోహన్‌రెడ్డి, ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఉపాధి హామీ స్బింది , తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎఐకెయుఎస్ జాతీయ ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** అంచలంచెలలుగా ఎదగి ఎఐయుకెఎస్ జాతీయ ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన వి.ప్రభాకర్‌కు విప్లవ అభినందనలు తెలుపుతున్నామని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పి.రామకృష్ణ, బి.భాజన్న, పి.రమ అన్నారు. గడ్కోల్ ప్రభాకర్‌గా సుమారు 5 దశాబ్ధాలుగా నిజామాబాద్ జిల్లాలో ముఖ్యంగా సిరికొండ, భీమ్‌గల్, ఆర్మూర్ ప్రాంతాల్లో పరిచయం అవసరం లేని ప్రజల మనిషిగా పేరొందారని ఎఐయుకెఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, సిపిఐ(ఎంఎల్ మాస్‌లైన్) (ప్రజాపంథా) రాష్ట్ర సెక్రటరియల్ సభ్యుడు ఉప్పల ప్రభాకర్, ఎఐయుకెఎస్ జాతీయ స్థాయి ఉపాధ్యక్షుడుగా కావటం గడ్కోల్ ప్రాంత ఉద్యమ రథ సారథికి జాతీయ రైతు పోరాటాలకు నాయకత్వం వహించే బాధ్యతనివ్వటం ఈ ప్రాంత ఉద్యమానికి గర్వకారణమన్నారు.

## 8 మంది వ్యక్తులపై కేసు నమోదు

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామానికి చెందిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం మాగి గ్రామానికి చెందిన 8 మంది వ్యక్తులు త ట్రాక్టర్ల ద్వారా గురువారం ఉదయం అచ్చంపేట మాగి గ్రామాల శివారులో గల మాంజీరా వాగు నుండి బంజేపల్లి వైపు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా మార్గమధ్యలో ట్రాక్టర్లను అడ్డుకుని అట్టి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని 8 గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎంతటివారైనా అక్రమంగా మాంజీరా నుండి ఇసుక రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అధికతూకంతో మోసం చేస్తే చర్యలు



ప్రజాపక్షం/మల్లాపూర్ : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అధికతూకం పేరుతో రైతులను మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎమ్మార్వో రామచందర్ నిర్వాహకులను హెచ్చరించారు. రాఘవపేట ఐకెపి కొనుగోలు కేంద్రంలో 42 కిలోలకు బదులు 43 కిలోలు తూకం వేస్తామని నిర్వాహకులు చెప్పడంతో ఆగ్రహానికి గురైన రైతులు రోడ్డెక్కి మెట్‌పల్లి ఖానాపూర్ రహదారిపై నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎమ్మార్వో రామచందర్, ఎస్ఐ అనిల్ సంఘటన స్థలానికి వచ్చి రైతులతో మాట్లాడి 42 కిలోల కంటే ఎక్కువ తూకం వేసే ప్రసక్తే లేదని, అలాంటి వాటిపై ఉపేక్షించమని కఠిన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. కేంద్రాలలో రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తక్షణమే పరిష్కరిస్తామని ఎమ్మార్వో రైతులకు సూచించారు. ఎమ్మార్వో హామీతో రైతులు వెనుతిరిగి వెళ్లిపోయారు.

## త్వరితగతిన ధాన్యం తరలించాలి

### కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్, గంభీరావుపేట మండల కేంద్రం, మండలంలోని మల్లారెడ్డిపేట, ముస్తాఫానగర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం తనిఖీ చేశారు. లారీల కొరత లేకుండా వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. అలాగే గంభీరావుపేట మండలం లింగన్నపేటలోని శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్, లక్ష్మీ నారాయణ ఇండస్ట్రీస్, కొత్తపల్లిలోని వాయుపుత్ర ఇండస్ట్రీస్ లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తనిఖీ చేసి.. ధాన్యం లారీలను వెంట వెంటనే అన్ లోడింగ్ చేయించాలని ఆదేశించారు. హమాలీల సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ పరిశీలనలో గంభీరావుపేట తహసీల్దార్ మారుతి రెడ్డి, అధికారులు, కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎస్‌పి సందర్శన



ప్రజాపక్షం/ కొనరావుపేట / వేములవాడ: కొనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, రైస్ మిల్లును జిల్లా ఎస్‌పి సందర్శించి విధుల్లో ఉన్న అధికారులను కొనుగోలు ప్రక్రియను గురించి అడిగి తెలుసుకున్నారు.ధాన్యం లోడింగ్ సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని రైస్ మిల్ యాజమాన్యానికి సూచించారు. అనంతరం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతుల సమస్యలు అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులదృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని మాయమాటలు చెప్పే దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.ఎస్‌పివెంటసి.ఐ రవీందర్, ఎస్.ఐ ప్రశాంత్ రెడ్డి సిబ్బంది ఉన్నారు.

## నాణ్యమైన విద్యకు చిరునామా శాతవాహన కావాలి: ఆచార్య

ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విద్యా వారోత్సవాల సందర్భంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శాతవాహన విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో శాతవాహన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ బోర్డు మీటింగ్ జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ ఎడ్యుకేషనల్ ట్రస్టు బోర్డు విశ్వవిద్యాలయ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలని, దీనికి ప్రెసిడెంట్‌గా ఉపకులపతి వ్యవహరిస్తారని తెలియజేశారు. విశ్వవిద్యాలయానికి మౌలిక వసతులు కల్పించడంలో నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడంలో నైపుణ్య అభివృద్ధికార్యక్రమాలు నిర్వహించడంలో ఈ ట్రస్టు ముఖ్యపాత్ర పోషిస్తుందని తెలియజేస్తూ ట్రస్టుకు సంబంధించిన రిజిస్టర్ కాపీని వెల్లడి చేశారు. ట్రస్టు సెక్రటరీ రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో విద్యా వారోత్సవాల సందర్భంగా చేయాల్సిన కార్యక్రమాలపై వర్సిటీ అభివృద్ధి పథంలో నడవడానికి కావాల్సిన మౌలిక వసతుల గురించి క్షుణ్ణంగా పరిశీలించామని, వీటిని దృష్టిలో పెట్టుకుని నూతన విద్యా సంవత్సరంలో ప్రణాళికలు వేసి విద్యార్థులకు అన్ని రకాల వసతులు ఏర్పాట్లకై ప్రయత్నాలు చేస్తామన్నారు. వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ బుర్ర మధుసూధన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ దీపిక, ఓఎస్‌డి టు విసి డా.హరికాంత్, సమన్వయ అ ధికారి డా.ఎస్.రమాకాంత్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు నిరంజనా చారి, ఎదుగంటి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## నూతన గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం: కలెక్టర్

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : జిల్లాలో నూతన గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ), స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (ఎస్ డబ్ల్యూసీ), నాబార్డ్, పరిశ్రమల శాఖ, ఎల్ డీ ఎం తహసీల్దార్లు, మార్క్ ఫెడ్, మార్కెటింగ్ శాఖ ఇతర శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఎఫ్ సీఐ, ఎస్ డబ్ల్యూసీ, మార్క్ ఫెడ్ తదితర శాఖల ఆధ్వర్యంలో పంట ఉత్పత్తుల నిల్వ కోసం గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. స్థలాలు గుర్తించాలని, నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. త్వరితగతిన పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, మార్క్ ఫెడ్ అధికారి హబీబ్, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ నరసింహ, నాబార్డ్ డీడీఎం దిలీప్, పరిశ్రమల శాఖ అధికారి హనుమంతు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు, ఎస్ డబ్ల్యూసీ, ఎఫ్ సీ ఐ అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టొద్దు

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



ప్రజాపక్షం/జగిత్యాల : బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపట్టవద్దని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని నాలుగవ వార్డులో రూ.3.14 కోట్లతో మోతే చెరువు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు.ప్రజలు లే అవుట్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని ఎట్టి పరిస్థితుల్లోబఫర్ జోన్ లలో నిర్మాణాలు చేపట్టవద్దన్నారు. జగిత్యాలకు మరో హైడ్రా రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు ,ప్రజలు అందరిపై ఉందన్నారు.నేడు ముప్పారవు చెరువు పూర్తి గా కలుషితం అవడం మన కళ్ళకు సాక్ష్యంగా కనబడుతోందన్నారు.చెరువు బాగుంటే ఊరు బాగుంటుందని,కాంగ్రెస్ ప్రభుత్వంలో చెరువులు కలుషితం కాకుండా పక్కనుండి డ్రైనేజీలు నిర్మిస్తామన్నారు.చెరువు సుందరీకరణ ,కంచె ఏర్పాటుకు నిధులు వినియోగిస్తామన్నారు.రాష్ట్రంలో ఎక్కడాలే ని విధంగా జగిత్యాల లో 4500 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించామన్నారు.అసాధ్యాన్ని సుసాధ్యం చేశామని,230 కోట్లతో ఆసుపత్రి నిర్మాణం తో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు.ప్రజల సహకారం తో పట్టణంఅభివృద్ధి సాధ్యం అవుతుందని,జగిత్యాల జిల్లా కేంద్రం త్వరిత గతిన విస్తరిస్తుందన్నారు. చుట్టూ పక్కల గ్రామాల శివారు ప్రాంతాలను కలిపి విస్తరణ చేయటం జరిగిందన్నారు.ముఖ్యమంత్రి మంజూరు చేసిన 62 కోట్ల తో జగిత్యాల పట్టణం మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య,కమిషనర్ సత్య ప్రణవ్,ఎఎంసిచైర్మన్ గడ్డం నారాయణరెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్‌లు గిరి నాగభూషణం గోలి శ్రీనివాస్ స్థానిక కౌన్సిలర్‌లు క్యాదసు నవీన్ వేముల శ్రీనివాస్,చీటి లక్ష్మీ నారాయణ సర్పంచ్ సంగేపు మహేష్ కో ఆ ప్షన్ సభ్యులు గట్టు సతీష్ టిపిసిసి సెక్రటరీ బండ శంకర్ డిఇ లు వరుణ్ ఆనంద్ ఎఇ అనిల్ పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్ అడువల లక్ష్మ ణ్ క్యా దసు నాగయ్య జిల్లా యూత్ అధ్యక్షులు బీరం రాజేష్ మాజీ సర్పంచ్ సు రేందర్ రావు రాజేశ్వర్ రెడ్డి మాజీ ఎమ్‌పిటిసి రాజశేఖర్ రెడ్డికౌన్సిలర్లు, నా యకులు, మహిళలు యువత మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు

## వ్యవసాయ అవసరాలకే చెరువు మట్టిని వినియోగించాలి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువులలోని సారవంతమైన చెరువు మట్టిని తమ వ్యవసాయ భూములకు తరలించేందుకు ఆసక్తి గల రైతులు రేపటి నుంచి సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.నీరు లేని చెరువుల నుంచి చెరువు మట్టిని వ్యవసాయ భూములకు తరలించుకోవడానికి అనుమతులు మంజూరు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.దరఖాస్తులో రైతు వివరాలు, భూమి విస్తీర్ణం, పిపిబి వివరాలు, రవాణా వాహనం వివరాలు, వాహన నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు.సంబంధిత తహసీల్దార్ దరఖాస్తులను పరిశీలించి అనుమతులు జారీ చేస్తారని,అనంతరం రైతులు చెరువుల నుంచి చెరువు మట్టిని తరలించుకోవచ్చని కలెక్టర్ వివరించారు.రైతులకు ఈ సారవంతమైన చెరువు మట్టిని పూర్తిగా ఉచితంగా అందజేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ చెరువు మట్టిని కేవలం వ్యవసాయ అవసరాలకే వినియోగించాలని స్పష్టం చేశారు.చెరువు మట్టిని ఇతర అవసరాలకు మళ్లించినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధించి, కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ధాన్యం లిఫ్టింగ్‌లో జాప్యం లేకుండా చర్యలు

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ప్రజాపక్షం/పెద్దపల్లి: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, లిఫ్టింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు.గురువారం పెద్దపల్లి మండలం రంగాపూర్‌లోని ఐజి గోదాములను, మంథని మండలం పుట్టపాక గ్రామంలోని ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని , మంథని మార్కెట్ యార్డు సందర్శించి ధాన్యం కొనుగోలు, నిల్వలు, లిఫ్టింగ్ పరిస్థితులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద వేగవంతంగా కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎక్కువకాలం కేంద్రాల వద్ద నిల్వ ఉంచకుండా వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం స్టాక్ పెండింగ్‌లో లేకుండా చూడాలని తెలిపారు.ప్రస్తుతం రోజుకు సుమారు 70 లారీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, అదనంగా మరో 30 నుంచి 40 లారీలను వెంటనే ఏర్పాటు చేయాలని ఆర్‌టిఒ శాఖ, రవాణా ఏజెన్సీలకు సూచించారు. డిసిఎం వాహనాలను కూడా ధాన్యం రవాణాకు మళ్లించాలని ఆదేశించారు. అవసరమైతే కొద్ది రోజులపాటు ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను కూడా ధాన్యం రవాణాకు వినియోగించాలని తెలిపారు.కొనుగోలు కేంద్రానికి సమీపంలోనే రైస్ మిల్లులు ఉన్నచో ట్రాక్టర్ల ద్వారా కూడా ధాన్యాన్ని తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం మంథని మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు (దొంతులవాడ)లో జరుగుతున్న సెన్సెస్ (జనాభా లెక్కల) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. తరువాత మంథని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ పర్యటనలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, సయేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మనోహర్,తదితరులు జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు




ప్రజాపక్షం/ధర్మపురి : ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తున్నట్లు కమలాపూర్ గ్రామ సర్పంచ్ కుమ్మరి తిరుపతి తెలిపారు.ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం ధర్మపురి మండలం కమలాపూర్, దోనూర్ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు.ఈ సం దర్భంగా సర్పంచ్ తిరుపతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. విద్యార్థులు వివిధ ప్రవేశ పరీక్షలలో అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించి ప్రైవేటు కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నిలుస్తున్నాయని పేర్కొన్నారు.ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు అల్పాహారం పథకం,21 వస్తువుల కిట్ పాలు,రాగి జావా అందిస్తున్నట్లు విద్యార్థులు,తల్లిదండ్రులు వీటిని సద్వినియోగం చేసుకుని తపిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు.ఒడ్డెటి మంజుల,మిల్కురి సుజాత, పాటశాల హెచ్ ఎం ఎదుల మహేష్,ఉపాధ్యాయులు మ్యాన పవన్ కుమార్,శ్రీలత, సంజన,జిపి కార్యదర్శి కటకం లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు. దోనూర్ గ్రామంలోని జెడ్‌పి ఉన్నత,ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ధర్మపురి ఎఎంసి వైస్ చైర్మన్ సంగ నర్సింహులు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మౌళిక వసతుల కల్పనతోపాటు మధ్యాహ్న భోజనం అందిస్తూ ఉపాధ్యాయుల కొరత లేకుండా పూర్తి శ్రద్ధతో అన్ని ఏర్పాట్లు వున్నాయని తెలిపారు.అంతకుముందు గ్రామ సర్పంచ్ దాసరి పురుషోత్తం, ఎంఇఒ సీతాలక్ష్మి తదితరులు గ్రామంలో ఉపాధిహామీ పథకం కూలీల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న విద్య,సౌకర్యాలను వివరించారు. పాఠశాలలో ఎఫ్ ఆర్ ఎస్ ద్వారా అత్యధిక హాజరు నమోదైన ఉపాధ్యాయులు కాశెట్టి రమేష్ కు ప్రభుత్వ ప్రశంసా పత్రాన్ని అందించారు.

## దయనీయ పరిస్థితిలో అన్నదాత..

### లారీల కొరతతో రైతులు ఆగమాగం



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :లారీల కొరతతో ధాన్యం లోడింగ్ సరిగా కావడం లేదని సిపిఐ రాష్ట్రనాయకులు గుంటివేణు,జిల్లా నాయకులు మీసంలక్ష్మ ణ్ వరికొనుగోలు కేంద్రాలను సందర్శించారు.మండుటెండలో వరికాంటాల వద్ద నానా ఇబ్బందులకు గురవుతున్నారని ప్రభుత్వంపై మండిపడ్డారు.రెండునెలలుగా తరలించిన ధాన్యానికి ఒక్కరూపాయి కూడా చెల్లించడం లేదన్నారు.కాంట ఎగుమతి చేయడం పెనుభారంగా మారిందన్నారు.గురువారం ఎల్లారెడ్డిపేటలోని హరిదాస్‌నగర్,పదిర,రాగట్లపల్లి,వెంకటాపురం వరికొనుగోలు కేంద్రాలను సందర్శించి మాట్లాడారు.లోడింగ్ కోసం యాభై కేజిల బస్తాకు 50 రూపాయల నుండి 75 రూపాయలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు.రోజుల తరబడి దిగుమతి కాకపోవడం వలన ఈ విధంగా చేయాల్సిన దుస్థితి కల్పించుతున్నారని పేర్కొన్నారు.తూకంపట్టీ పంపిణీలోను తీవ్రజాప్యం జరుగుతుందని తెలిపారు.దీంతో గోనెసంచులు,హమాలీలు,వాహనాల సమస్య తీవ్రంగా మారుతోందని ఇప్పటికైన ప్రభుత్వం మేల్కొని త్వరితగతిన రైతన్నల గోస పట్టించుకుని లోడింగ్ చేసి మిల్లర్లకు పంపాలని సూచించారు.లేదంటే రైతన్నలతో రోడ్డు పైకి వచ్చి తీవ్ర నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు.

**ఆగని కోతలు...**

ధాన్యం రైతుల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు,కొనుగోలు కేంద్రాలలోనే తేమశాతం చూసి కాంటాలు వేసినప్పటికి మిల్లర్లు మాత్రం కోతలు ఆపడం లేదని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆరోపించారు.ఇదేమిటని ప్రశ్నిస్తే అసలు ధాన్యమే మాకు అవసరం లేదంటున్నారు,రైతులు మిల్లర్లను బ్రతిమిలాడుకోవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు.మొత్తంగా ప్రభుత్వ వైఫల్యం ఈ పరిస్థితికి కారణం అయిందని సిపిఐ నాయకులు అంజన్న,బాలరాజు,శంకర్,ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పిఎంజె జ్యువెలరీ దోపిడీ కేసు ఛేదించిన పోలీసులు

### అంతరాష్ట్ర ముఠా అరెస్ట్.. సూత్రదారి బీహార్ జైలులో ఉన్న గోల్డెన్ థీఫ్ సుభోద్ సింగ్




ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కరీంనగర్ పిఎంజె జ్యువెల్లరీ షాపులో జరిగిన భారీ దోపిడీ కేసును కరీంనగర్ పోలీసులు ఛేదించారు. ఈ నేరానికి పాల్పడిన కరుడుగట్టిన అంతరాష్ట్ర దోపిడీ ముఠాకు చెందిన ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, మొబైల్ ఫోన్లు, నకిలీ ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నా రు. గురువారం కరీంనగర్ పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల స మావేశంలో సిపి గౌష్ ఆలం వివరాలను వెల్లడించారు .ఈ నెల 3న కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిఎంజె జ్యువెల్లరీ షాపులోకి చొరబడిన దుండగు లు ఆయుధాలతో సిబ్బందిని బెదిరించి సుమారు రూ. 82,02, 000 విలువైన 16 1.4 తులాల బంగారు ఆభరణాలు, 112 క్యారెట్ల వజ్రాభరణాలను దోచుకెళ్లారు.

**జైలు నుంచే స్కెచ్..**

ప్రస్తుతం బీహార్ జైలులో ఉన్న అంతరాష్ట్ర గ్యాంగ్ హ్యాండ్లర్ ది గోల్డెన్ థీఫ్‌గా పేరొందిన సుభోద్ సింగ్ ఈ దోపిడీకి మాస్టర్ ప్లాన్ వేశాడు. అతని ఆదేశాల మేరకు రఘునాథ్ కర్మాకర్ బృందం రెండు నెలల క్రితమే తెలంగాణకు వచ్చి ఖమ్మం, సిద్దిపేట, పెద్దపల్లి, కరీంనగర్‌లలో రెక్కీ నిర్వహించింది. పశ్చిమ బెంగాల్ సరిహద్దులో మెహతాబ్ ఖాన్ వద్ద నకిలీ సిమ్ కార్డులు కొనుగోలు చేసి తప్పుడు పేర్లతో లాడ్జిలలో బస చేశారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ సమీపంలో తుపాకులు సేకరించి దోపిడీకి పాల్పడ్డారు. సాంకేతిక నిఘా ఆధారంగా ప్రత్యేక బృందం వెలిచాల ఎక్స్ రోడ్డు వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన రావిష్ కుమార్ అలియాస్ ప్రద్యుమన్ సిమ్ కార్డులు సరఫరా చేసిన మెహతాబ్ ఖాన్ ఉన్నారు. జగీరా సింగ్‌పై 7 కేసులు, రావిష్ కుమార్‌పై 15 కేసులు వివిధ రాష్ట్రాల్లో నమోదై ఉన్నాయి. ఈ కేసులో ఇంకా 10 మంది నిందితులు పరారీలో ఉండగా వారి కోసం ఐదు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి వ్యాపార సంస్థలు, బ్యాంకులు, జ్యువెలరీ షాపులు నాణ్యమైన సిసిటివి కెమెరాలు, పానిక్ బటన్లు ఏర్పాటు చేసుకోవాలని పోలీస్‌లు సూచించారు. లాడ్జ్ యజమానులు సరైన గుర్తింపు కార్డులు లేకుండా గదులు ఇవ్వకూడదని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న పోలీసు అధికారులను, సిబ్బందిని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

## నాణ్యమైన విద్యలో ప్రభుత్వ పాఠశాలలు భేష్




ప్రజాపక్షం/మద్దూరు/ధూళిమిట్ట: విద్యార్థుల విద్యా పురోగతి, ప్రవర్తనా అభివృద్ధి ,విద్యార్థుల పూర్తి శ్రేయస్సుకు శ్రమిస్తూ... విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దుతున్నా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల కృషి అభినందనీయం అని ఎపిసి సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులతో పాటుగా గ్రామస్తులు అభినందించారు. గురువారం ఉమ్మడి మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన ''ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక''లో భాగంగా బడిబాట ,తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ... నాణ్యమైన విద్యను అందించడంలో ప్రవేట్ విద్యాసంస్థలను మించి ప్రభుత్వ పాఠశాలలు ముందున్నాయని అన్నారు. 2025 నుండి 2026 విద్యా సంవత్సరంలో పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడంలో ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో చక్కని ప్రతిభను కనబరిచిన విద్యార్థులను ఆయా పాఠశాలల పరిధిలోని గ్రామ సర్పంచ్‌లతో పాటుగా గ్రామస్తులు అభినందించారు. ఈసందర్భంగా రాబోవు 2026 నుండి 2027వ విద్యా సంవత్సరంలో మరింత విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా తల్లిదండ్రుల సహకారం అందిచాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారి ఉపాధ్యాయ బృదం గ్రామస్తులతో పాటుగా విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. అంతకు ముందు బడిబాట కార్యక్రమంను ధూళిమిట్ట మండల పరిషత్ ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆర్. రేఖ, అనుముల కర్ణాకర్‌రెడ్డి వారి ఉపాధ్యాయ బృందంతో కలసి నిర్వహించారు. అలాగే బైరాన్‌పల్లిలో గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో సర్పంచ్ బర్మా రాజమల్లయ్య ఆధ్వర్యలో గ్రామ పంచాయితీలో నిర్వహించగా ధూళిమిట్ట మండల విద్యాశాఖ అధికారి మీనాంజనేయులు పాల్గొన్నారు. అలాగే మద్దూరు మండల కేంద్రంలో సర్పంచ్ దామర మల్లేశం, రేబర్తిలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు చంద్రబాను, గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించగా మద్దూరు మండల విద్యాశాఖ అధికారి వరదరాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ, నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వ పాఠశాలలు భేష్‌గా పనిచేస్తున్నాయని, గ్రామాల్లోని ప్రతి విద్యార్థినిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఎపిసి చైర్మన్లు, కమీటీ సభ్యులు పాఠశాలల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆదాయం ఫుల్... సౌకర్యాలు నిల్..

### సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్న అధికారులు

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యలయ దుస్థితి అధ్వాన్నంగా మారుతుంది, గత 30 సంవత్సరాలుగా ఎల్లారెడ్డిపేట గ్రామంలో కొనసాగుతున్న ఎక్సైజ్ శాఖ కార్యాలయం ప్రస్తుతం దయనీయ పరిస్థితుల్లో ఉంది. వర్షాకాలం వస్తే కార్యాలయంలో ఉండటమే కష్టసాధ్యంగా ఉంటుంది. కార్యాలయంలో ఐదు గదులు ఉన్న తాత్కాలికంగా మూడు గదులను మాత్రమే మరమ్మత్తులు చేసినప్పటికి, అవి కాస్త పూర్తిగా ధ్వంసం అయ్యాయి. మిగిలిన రెండు గదుల్లోనే సిఐ, ఎస్ఐలు, రికార్డు సిబ్బంది ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయంలో ఎక్కడ కూర్చోవాలి, ఎక్కడ పని చేయాలనే పరిస్థితి నెలకొనడంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోట్ల రూపాయల ఆదాయం ప్రభుత్వానికి అందిస్తున్న ఎక్సైజ్ శాఖకు సరైన భవనం లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని ప్రజలు విమర్శిస్తున్నారు. కొత్త భవనం నిర్మాణం లేదా తాత్కాలికంగా అనుకూల ప్రదేశానికి తరలింపు వంటి చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా రు. ప్రస్తుతం వేసవి కాలంలోనే పరిస్థితి ఇంత దా రుణంగా ఉంటే, వర్షాకాలంలో మరింత ఇబ్బందులు తలెత్తే అవకాశముందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. దీనిపై ప్రజాపక్షం ప్రతినిధి వివరణ కోరగా రెండు గదులు బాగానే ఉన్నాయని ప్రస్తుతం అందులోనే బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.అక్కడక్కడపైపెచ్చులుఊడిపోవడంతో మరమ్మత్తులు పూర్తిచేసి అవే గదులు అప్ప చెప్పి యాజమాన్యం ఇస్తారని మీడియాతో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి శ్రీనివాస్ మాట్లాడారు.

## గ్రంథాలయాల పురోభివృద్ధికి సహకరించాలి

### కలెక్టర్‌ను కలిసిన జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం

ప్రజాపక్షం/ సిద్దిపేట : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దరిపల్లి చంద్రం గురువారం జిల్లా కలెక్టర్ హైమావతిని కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలసి, పూలమొక్క, పుష్పగుచ్ఛం అందచేశారు. ఈసందర్భంగా జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధి, పాఠకులకు కల్పించాల్సిన సౌకర్యాలు. విద్యార్థులకు ఉపయోగపడేలా గ్రంథాలయాలను మరింత ఆధునికరించటంపై వారు చర్చించారు.జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దరిపల్లి చంద్రంను జిల్లా కలెక్టర్ అభినందించారు. గ్రంథాలయాలపురోభివృద్ధికిసహకరించాలనికోరారు.

## సిపిఐ సీనియర్ నేత, నెల్లూరు శేషయ్య మృతి

సంతాపం తెలిపిన సిపిఐ నాయకులు



ప్రజాపక్షం/మణుగూరు: సిపిఐ పార్టీ సీనియర్ నాయకుడు, పోరాటయోధుడు, పేద ప్రజల కోసం తన నమ్ముకున్న సిద్ధాంతం కోసం కమ్యూనిస్టు పార్టీలో పనిచేసే ఎంతో మందికి మంచి చేసిన మంచి వ్యక్తి నిరాడంబరుడు, నిజాయితీ గల వ్యక్తి నెల్లూరి శేషయ్య మరణించడం బాధాకరమని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్గ్యాల సుధాకర్ అన్నారు. గురువారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి, పూల మాలవేసి నెల్లూరు శేషయ్య అమరహే అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు, వారికి ఘనంగా నివాళులర్పించారు. సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి. జక్కుల రాజబాబు, సిపిఐ సీనియర్ నాయకులు ఎస్కే సర్వర్ మంగి వీరయ్య, ఎఐటియుసి మణుగూరు మండల గౌరవ అధ్యక్షుడు తోట రమేష్,. కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, కందిమల్ల రామయ్య హాజరై నివాళులర్పించారు.

# ప్రజా ప్రభుత్వాన్ని ప్రజల నుంచి దూరం చేయలేరు

జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత ప్రారంభం
75వేల ఉద్యోగాలు ఇచ్చాం
మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఎవరెన్ని కుట్రలు పన్నినా..ప్రజల నుంచి ప్రజా ప్రభుత్వాన్ని వేరు చేయలేరని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని టీసీవిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో 15వార్డులకు కలిపి క్లస్టర్ 1 ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. తొలుత కార్యక్రమాన్ని జయజయహే తెలంగాణ గేయంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ...పదేండ్లు అధికార దాహంలో పేదవాడిని విస్మరించి, నాడు రైతులు చేతులకు సంకెళ్ల వేసినవారు. నేడు రంగు రంగుల అవతారాలతో వచ్చే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. నాడు అధికారంలో ఉండి వరి వేస్తే ఉరి అని రైతులను భయపెట్టిన దొరవారు. నేడు రైతుల కోసం పోరాడుతన్నామంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. దోసిట్లో మొక్కలు పెట్టుకుని, కుండలకు పూతలు పూస్తూ ఫోటోలకు పోజులిస్తే ప్రజలు మోసపోరన్నారు. మీ పదేండ్ల పాలనలో అధికారులు ఏనాడూ పేదల వద్దకు రాలేదన్నారు. కానీ ఈనాడు మేమే స్వయంగా ప్రజల గడప వద్దకు వచ్చి అర్జీలను తీసుకుంటున్నామన్నారు. సొల్లు పురాణం చెప్పే ప్రభుత్వం కాదు.. మాది చేతల ప్రభుత్వం అన్నారు. ఇప్పటికే 73వేల ఉద్యోగాలు ఇచ్చాం అని నిరుద్యోగులకు త్వరలోనే మరిన్ని శుభవార్తలు చెబుతాం అన్నారు. గత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను కాగితాలకే పరిమితం చేస్తే మేము ఒక్క రూపాయి అవినీతి లేకుండా రూ.5లక్షల ఆర్థిక సాయం నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో వేస్తున్నామన్నారు. జూన్ రెండవ తేదీన ఆదిలాబాద్ కేంద్రంగా రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. అనంతరం స్వయంగా మంత్రి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టి.ఎస్.దివాకర, అదనపు సంస్థల కలెక్టర్ శ్రీజ, పలు శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, చైర్‌పర్సన్ పోకలతి అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, విద్యుత్‌శాఖ ఏడీ కోక్యానాయక్, ఏఈ జిల్లా ప్రభుకర్‌రావు, మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, ఖమ్మంరూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట వీరభద్రం, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిషోర్, మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు, సిపిఐ కౌన్సిలర్లు మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, దండి శ్రీజ, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య లోపంపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : వి. వెంకటాయపాలెం గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ లోపంపై కలెక్టరేట్‌లో పలువురు యువకులు గురువారం ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఎస్‌టి కాలనీ మెయిన్ రోడ్డు పక్కన ఉన్న నివాసాల నుంచి గత కొన్నేళ్లుగా మురుగు నీరు రహదారి పైకి వచ్చి నిల్వ ఉండి దుర్వాసన వస్తుందని దీనితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎస్సి కాలనీ మెయిన్ రోడ్డు నందు కూడా గత సంవత్సర కాలం నుండి ఒకే దగ్గర నీరు నిల్వ ఉండి ప్రజలు అనారోగ్యాల పాలు అవుతున్నారన్నారు. బిసి కాలనీలో రోడ్డు పక్కన చెత్తాచెదారం ఉన్న పట్టించుకోవడం లేదని తెలిపారు. దీనికి సంబంధించి పంచాయతీ అధికారులకు పలు మార్లు విజ్ఞప్తి చేసినా కారణాలు చెబుతున్నారు తప్ప సమస్య పరిష్కారం కావడం లేదని యువకులు తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

## మంత్రితో కలిసి దరఖాస్తులు స్వీకరణ



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 23వ వార్డు టిసివి రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి 30వ వార్డు కౌన్సిలర్ దండి శ్రీజ వార్డుకు సంబంధించిన ధరఖాస్తులను స్వీకరించారు. పలు సమస్యలపై మంత్రికి అర్జీ పెట్టుకున్న వారి సమస్యలను ఆమె స్వయంగా విన్న వించారు. అలాగే ఆటోనగర్ టూ మద్దులపల్లిమార్కెట్ వరకు 50 అడుగులతో ఏర్పాటు చేయదలచిన రోడ్డుతో ఇండ్లు పోతున్నట్లు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై పెద్ద మనుసు చేసుకుని నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. తొలుత అక్కడికి పలు సమస్యలపై వచ్చిన తన వార్డు ప్రజలకు స్వయంగా తానే అప్లికేషన్ నింపి ఇచ్చారు. ప్రజా సమస్యలపై తండ్రికి తగ్గ తనయగా శ్రీజ చూపిన చొరవకు స్థానికులు అభినందనలు తెలిపారు.

## రేపు వైరాలో మహిళా సమాఖ్య రాష్ట్ర సభ: ఏపూరి లతాదేవి




ప్రజాపక్షం/వైరా: రాష్ట్ర మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా 22వ మహాసభ రేపు వైరాలో జరుగనుంది. ఈ మహిళా సమాఖ్య సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని కార్యదర్శి ఏపూరి లతాదేవి అన్నారు. గురువారం వైరాలో సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏపూరి లతాదేవి మాట్లాడుతూ 16న వైరాలోని కమ్మవారి కల్యాణ మండపంలో జరిగే తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య 22వ జిల్లా మహాసభకు పెద్ద ఎత్తున మహిళలు తరలి వచ్చి విజయవంతం చేయాలని అన్నారు. ముఖ్య అతిథిగా నేదునూరి జ్యోతితో పాటు పలువురు మహిళా నాయకురాళ్లు పాల్గొననున్నారని తెలిపారు. మహిళల పట్ల నేటికి సమాజంలో వివక్ష కొనసాగుతూనే ఉంది. వేధింపులు హత్యా యత్నాలు దాడులు కొనసాగుతూనే ఉన్నాయని, మహిళల హక్కుల ఉల్లంఘన సంక్షేమ పథకాల్లో కోత విధిస్తున్నారని, ఈ సమావేశంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక చర్చ చేయడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పోటు కళావతి, సిపిఐ వైరా నియోజకవర్గ ఇంచార్జి యర్రబాబు, యామాల గోపాలరావు, గారపాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు, పురుగు మందులు అమ్మితే చర్యలు తప్పవు



ప్రజాపక్షం/వైరా: వైరా రైతువేదిక నందు మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్ వైరా మండల ఎరువులు, పురుగు మందుల డీలర్స్‌కి నకిలీ విత్తనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైరా సహాయ వ్యవసాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ, కెవికె శాస్త్రవేత్త పావని, ఫణిశ్రీ పాల్గొని దిశానిర్దేశం చేశారు. డీలర్స్ ఎవరు నకిలీ విత్తనాలను అమ్మకూడదని నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్స్‌కు శాఖాపరంగా చెప్పట్టే చర్యలకు బాధ్యులు అవుతారని తెలిపారు. రైతులకు విత్తనాలు అమ్మినప్పుడు ఆయా డీలర్ ఖచ్చితంగా రైతుకు రసీదు ఇవ్వాలని, గ్రామాల్లో గుడ్డ సంచుల్లో ప్రైవేటు వ్యక్తులు ఎవరైనా విత్తనాలు ఎరువుల అమ్మితే సంబంధిత వ్యవసాయ అధికారికి 8977748709 నెంబర్ సమాచారం ఇవ్వాలని అన్నారు. యూరియాను ఆప్ ద్వారా మాత్రమే అమ్మాలని డీలర్స్‌కి సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్.సైదులు, ఎం.రాజేష్, పి.వెంకటనరసయ్య, వి.కీర్తి, ఒస్టైటీ సీఈవోలు మండల డీలర్స్ కె.మురళి, వై.నగేష్, ఎస్.శ్రీనివాసరెడ్డి, గడిపూడి రామకృష్ణ, కృష్ణ, అప్పారావు, వెంకటేశ్వరరావు, అక్కిశెట్టి రామకృష్ణ, పుల్లారావు,చిన్న కృష్ణ పాల్గొన్నారు.

# ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

మంత్రి పొంగులేటితో కలిసి ధాన్యం కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి ఉత్తమ్



ప్రజాపక్షం/కూసుమంచి: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం పాలేరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఈ సీజన్‌లో రూ 22వేల కోట్లతో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడమే లక్ష్యమని వెల్లడించారు. హమాలీల కొరత ఉన్నప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని, వచ్చే 15 రోజుల పాటు లారీలను కేవలం ధాన్యం రవాణాకే కేటాయించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర్, సీఐ సునీల్ దత్, తదితరులు పాల్గొన్నారు.

## పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



ప్రజాపక్షం/కూసుమంచి: కూసుమంచి మండలంలో అధికార పార్టీలోకి వలసలు ఊపందుకున్నాయి. ముగినేలపల్లి సర్పంచ్ గంగా స్రవంతి తన అనుచర వర్గంతో కలిసి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి సర్పంచ్‌గా గెలుపొందిన గంగా స్రవంతి, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. సర్పంచ్‌తో పాటు ఐదుగురు వార్డు సభ్యులు, గ్రామ ముఖ్య నాయకులు, వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాల వారు మంత్రి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నా రు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలకు తగిన ఏర్పాట్లు

మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాచలంలో జరిగే గోదావరి పుష్కరాలకు దేశ విదేశాల నుండి భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం వసతి గృహాల్లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావుతో కలిసి పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత, రోడ్లు, విద్యుత్, కరకట్ట ప్రాంతాల్లో మొక్కల పెంపకం, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకుని షటర్ల మరమ్మత్తులు, జనరేటర్ల ఏర్పాట్లు ఇప్పటి నుండే చేసుకోవాలని ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పుష్కరాల పనులు విజయవంతం చేయాలని అన్నారు. చెత్త నిర్వహణలో ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని, ఐటిడిఎ పిఓ, సబ్ కలెక్టర్, దేవస్థానం ఇఓ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, టూరిజం, అటవీ అధికారులు త్వరలో సమావేశాన్ని నిర్వహించుకుని గోదావరి పుష్కరాలకు కావాల్సిన ఏర్పాట్లు, కార్యచరణ రచించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పిఓ రాహుల్, సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట, ఖమ్మం సోడా చైర్మన్ పువ్వాడ దుర్గా ప్రసాద్, సర్పంచ్ పూనెం కృష్ణ దొర, దేవస్థానం ఇఓ దామోదర్రావు, తహసీల్దార్ దనియాల వెంకటేశ్వర్లుస, ఆర్అండ్‌బి, వ్యవసాయ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**రామయ్యను దర్శించుకున్న మంత్రి తుమ్మల**

శ్రీ సీతారామ చంద్ర స్వామివారి ఆలయాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దర్శించుకున్నారు. గురువారం ఆలయానికి చేరుకున్న ఆయనకు పూర్ణకుంభం, మేళ తాళాలతో అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గర్భగుడిలోని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం తరుపున వస్త్రాలు, జ్ఞాపికను అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. రూ.350 కోట్లతో ఆలయాభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శ్రీరామ నవమి నాడు శంకుస్థాపన చేశారని, ఆగమ శాస్త్ర ప్రకారం పనులు జరుగుతాయని తెలిపారు. భద్రాచలం పుణ్యక్షేత్రం ప్రపంచ మేటి క్షేత్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

**కోసల గ్రాండ్ హోటల్ ప్రారంభించిన తుమ్మల**

పట్టణంలోని బ్రిడ్జీ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కోసల గ్రాండ్ హోటల్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ మేరకు హోటల్ యజమాని చల్లగుళ్ల నాగేశ్వరరావు కుటుంబసభ్యులతో కలిసి రిబ్బన్ కత్తిరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యాపార అభివృద్ధిలో స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, స్తంబాద్రి అర్బన్ డెవలపెంట్ అథారిటీ చైర్మన్ పువ్వాడ దుర్గాప్రసాద్, భద్రాచలం, సారపాక గ్రామ పంచాయితీ సర్పంచ్‌లు పూనెం కృష్ణ, కిషోర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. గురువారం సంజీవరెడ్డి భవన్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో నూతి సత్యనారాయణ గౌడ్ పాల్గొని ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలు, కార్యకర్తల సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి గురువారం కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమస్యలు తెలుసుకుని సత్వర పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. 49 మంది తమ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు అందించినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో వైరా నియోజక వర్గ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ పుల్లయ్య, కొప్పుల ప్రభావతి రెడ్డి, పమ్మి అశోక్, బానోత్ రామ్మూర్తి నాయక్, షేక్ మస్తాన్, కె. రాజశేఖర్, పాటి నర్సయ్య, బిక్యా నాయక్, తుములూరి లక్ష్మి నర్సింహారావు, దామ స్వరూప, గజ్జి సూర్యనారాయణ, రంగా జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

**కామేపల్లి మండల అధ్యక్షుడిగా రాంబాబు నియామకం**

టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఆమోదంతో కాంగ్రెస్ పార్టీ కామేపల్లి మండల అధ్యక్షునిగా గుజ్జర్లపుడి రాంబాబును నియమిస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. అధ్యక్ష నియామకానికి సహకరించిన మహేష్‌కుమార్ గౌడ్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మంత్రులు, ఎంపిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎఫ్‌సిఐ గోదాము ఎదుట రైతుల ఆందోళన

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఎఫ్‌సిఐ గోదాము ఎదుట మొక్కజొన్న రైతులు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అక్కడి ఖమ్మం–సూర్యాపేట రహదారిపై ట్రాక్టర్లను అడ్డుగా పెట్టి ధర్నా చేశారు. కాంటా పేరుతో ఒక్కో వాహనానికి రూ.300 వందల నుంచి రూ.500వందల వరకు మామూలు వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే హమాలీల పేరుతో ఒక్కో బస్తాపై రూ.6చొప్పున దండుకుంటున్నారని దుయ్యబట్టారు. రెండు రోజుల వ్యవధిలో సుమారు 80 ట్రక్కులు ఆన్‌లోడ్ అయ్యాయని, ఈ లెక్కన వివిధ పేర్లతో దాదాపు పెద్ద ఎత్తున డబ్బులు వసూళు చేసినట్లు మండిపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని రైతులను శాంతపరిచేందుకు చూసినప్పటికి వినలేదు. గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో ఆయన వచ్చి హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.



# ఉద్యోగుల సాధారణ బదిలీలకు సన్నాహాలు

ఇప్పటికే మార్గదర్శకాలు జారీ
సిబ్బంది 30 శాతానికి పైగా బదిలీ అవకాశం



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల్లో గెజిటెడ్, నాన్‌గెజిటెడ్, నాల్గోతరగతి ఉద్యగులు, ఇతర ఉద్యోగుల బదిలీలకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలోని అన్ని శాఖల నుండి ఉద్యోగుల వివరాలు సేకరించే పనిలో పడ్డారు. జిల్లాలో 23 మండలాలు, రెండు రెవెన్యూ డివిజన్లు ఉండగా, మొత్తంగా సుమారు 16,576 మంది అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. కాగా జిల్లా కలెక్టరేట్‌లోని వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు మూడేళ్లకు పై బడే పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర, జోనల్, మల్టీ జోనల్ స్థాయితో పాటు జిల్లా స్థాయిలోనూ బదిలీలు త్వరలో జరగనున్నాయి. దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీలు తప్పక పోనుండటంతో అనుకూలమైన ప్రదేశాల్లో పోస్టింగ్ కోసం ఇప్పటినుండే పైరవీలు మొదలు పెట్టారు. జిల్లా స్థాయి అధికారులు ఎంతమంది బదిలీ కానున్నారు. వారి స్థానాలకు ఎవరు వచ్చే అవకాశం ఉంది అనే దానిపై కలెక్టరేట్ ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. బదిలీల ప్రక్రియలో భాగంగా జిల్లాలోని 40శాఖల్లో పనిచేస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. పలువురు పదోన్నతి పొందగా, మరి కొందరు ఇప్పటికే పదవీ విరమణ పొం దారు. దీంతో ఆయా పోస్టులను ఇంచార్జీలతో నె ట్టుకొస్తున్నారు. బదిలీల్లో భాగంగా అన్నిశాఖల్లోని ఖాళీలను కచ్చితంగా చూపించాల్సి ఉంటుంది. దీంతో క్యాడర్ వారీగా లెక్కలు తీస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న సిబ్బందిలో 30 శాతానికి పైగా తప్పకుండా బదిలీపై వెళ్లాల్సి ఉండటంతో జాబితా సిద్ధమవుతోంది. ఉద్యోగుల బదిలీల మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. బదిలీ ప్రక్రియ పూర్తి చేసేందుకు కసరత్తు మొదలైంది. జనగణనలో భాగంగా మే 11 నుండి జూన్ 9వ వరకు ఇళ్ల జాబితా, జనాభా లెక్కల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, ఇతర రెవెన్యూ అధికారులు, సిబ్బందికి మినహాయింపు దొరికింది. మిగిలిన వారి స్పౌజ్, 2027 మే 31లోపు పదవీ విరమణ పొందేవారు, దివ్యాంగులు, వైద్యం అందే అవకాశం లేని చోట పనిచేస్తున్న వారు, మానసిక దివ్యాంగులైన పిల్లలున్న వారు, వితంతువులు, అనారోగ్యం తో బాధపడుతున్న వారికి ప్రాధాన్యత ఉండనుంది. మే 15 లోగా క్యాడర్ వారీగా ఖాళీల జాబి తా ప్రకటించడం, 16 నుండి 24 లోపు దరఖాస్తులు తీసుకోవడం, 25 నుండి 31వరకు కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీల ఉత్తర్వులు అందజేయాలని ప్రభు త్వ మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఇందు కు అనుగుణంగా శాఖల వారీగా వివరాలు సేకరిస్తున్నా రు.

# 3వ వార్డులో 'షాడో' లీలలు..!

'సతి' పదవిపై పెచ్చు మీరుతున్న 'పతి' పెత్తనం
అధికారిక కార్యక్రమాల్లోనూ వేలు పెడుతున్న వైనం
ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన వ్యవహారం

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని మూడవ వార్డులో షాడో పాలనపై ప్రజల్లో తీవ్ర చర్చసాగుతోంది. సతి పదవిపై పతి పెత్తనం పెరుగుతుండటంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వార్డు పరిధిలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు, అధికారిక సమావేశాలు, ప్రజల వినతులు వంటి అంశాల్లో కూడా సంబంధిత వ్యక్తి అధికంగా జోక్యం చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులకు సూచనలు చేయడం నుంచి ప్రజల సమస్యలపై తానే నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో చర్చకు దారితీస్తోంది. తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలోనూ ఆ షాడో వ్యవహారశైలి ప్రత్యేక చర్చకు కారణమైనట్లు తెలుస్తోంది. అధికారిక కార్యక్రమం జరుగుతున్న సమయంలో అనవసర జోక్యం చేసుకోవడం, అధికారులతో మాట్లాడే తీరు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులను అసహనానికి గురి చేయడం గమనర్హం. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రజలకు జావాబుదారులై వ్యవహరించాల్సిన సమయంలో, కుటుంబ సభ్యుల పెత్తనం పెరగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**అధికారిక కార్యక్రమాల్లో వేలు...**

షాడో వ్యహారం సాక్షిగా అధికారిక కార్యక్రమాల్లోనూ అనవసర జోక్యం పెరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులకు సంబంధించిన సమావేశాలు, అభివృద్ధి పనుల పరిశీలనలు, ప్రజల ఫిర్యాదుల స్వీకరణ వంటి కార్యక్రమాల్లో అధికారికహోదా లేకపోయినా సంబంధిత వ్యక్తి అధికంగా జోక్యం చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మంత్రి పొంగులేటి నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో కూడా అధికారుల పనితీరులో వేలు పెట్టడం, ప్రజాప్రతినిధుల స్థానంలో వ్యవహరించే ప్రయత్నం చేయడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసినట్లు సమాచారం. అధికారులతో నేరుగా సూచనలు చేయడం, కార్యక్రమ నిర్వహణలో అక్కడికి వచ్చిన ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధుల స్థానంలో అనధికార వ్యక్తుల ప్రభావం చూపడం సరైన పద్ధతి కాదని స్థానికులు మండిపడుతున్నారు. అధికారిక కార్యక్రమాలకు గౌరవం దక్కేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది.

**ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశం...**

షాడో వ్యవహారం ప్రస్తుతం ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధుల స్థానంలో కుటుంబ సభ్యులు అధికారిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం సరైన పద్ధతికాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వార్డు సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, అధికారులతో సమన్వయం వంటి అంశాల్లో అనధికార పెత్తనం పెరుగుతుండటంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారిక హోదా లేకపోయినా ప్రతి కార్యక్రమంలోనూ ముందుండే ప్రయత్నం చేయడం, ప్రజాప్రతినిధుల తరుపున నిర్ణయాలు తీసుకుంటున్నట్లుగా వ్యవహరించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లోనూ హాట్‌టాపిక్‌గా మారింది. ఈ వ్యవహారమంతా మంత్రి నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో జరిగిన పరిణామాల తర్వాత మరింత చర్చకు దారితీసినట్లు తెలుస్తోంది. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్నవారే బాధ్యతాయుతంగా వ్యవహరించాలే గానీ, తెరవెనుక వ్యక్తుల వ్యవహారాలు నడపడం మంచిది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. అలాగే పలు వార్డులలో మరి కొందరు సైతం ఇదే తీరు పోకడలు కనబరుస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## 'నీట్' నిర్వాహణకు...
# ఎన్‌టిఏ పునర్వ్యవస్థీకరణ

• లేదా పటిష్ఠమైన, స్వయం ప్రతిపత్తిగల వ్యవస్థ ఏర్పాటు • 'సుప్రీంకోర్టు'లో 'ఫైమా' పిటిషన్

**న్యూఢిల్లీ:** పదే పదే జరుగుతున్న ప్రశ్నా పత్రాల లీకుల ద్వారా 22.7లక్షలకు పైగా విద్యార్థుల ప్రాథమిక హక్కులపై 'ప్రత్యక్ష దాడి' జరుగుతోందని ప్రస్తావిస్తూ, నీట్–యుజి నిర్వహణ కోసం ఎన్‌టిఏను పునర్నిర్మించాలని లేదా దాని స్థానంలో పటిష్ఠమైన, స్వయం ప్రతిపత్తిగల వ్యవస్థను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టును ఒక వైద్య సంస్థ కోరింది. ది ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా), న్యాయవాది తన్వీ దుబే ద్వారా పున: పరీక్షను పర్యవేక్షించడానికి అధికారికంగా ఒక కొత్త సంస్థను ఏర్పాటు చేసేవరకు, ఒక ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీని నియమించేలా ఆదేశించాలని కోరింది. ఇంకా, తదుపరి లీకులు జరగకుండా చూసుకునేందుకు ఈ కమిటీకి అధ్యక్షుడిగా ఒక రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తితో పాటు ఒక సైబర్ సెక్యూరిటీ నిపుణుడు, ఒక ఫోరెన్సిక్ శాస్త్రవేత్త ఉండాలని కూడా కోరింది.వైద్య విద్యా కార్యక్రమాలలో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) మే 3న నిర్వహించిన అండర్ గ్రాడ్యుయేట్ స్థాయి నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్)ను పేపర్ లీకుల ఆరోపణల నేపథ్యంలో మే 12న రద్దు చేశారు. ఈ ఆరోపణలపై ప్రస్తుతం సిబిఐ దర్యాప్తు చేస్తోంది. ఫైమా దాఖలు చేసిన పిటిషన్‌లో ఎన్‌టిఏ, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, సిబిఐలను ప్రతివాదులుగా చేర్చారు. నీట్–యుజి నిర్వహణలో ఎన్‌టిఏ యొక్క పునరావృత, వ్యవస్థాగత, వినాశకరమైన వైఫల్యానికి వ్యతిరేకంగా ఈ గౌరవనీయ న్యాయస్థానం తక్షణమే జోక్యం చేసుకోవాలని ప్రస్తుత రిట్ పిటిషన్ కోరుతోందని పిటిషన్ తెలిపింది. పిటిషన్ ప్రకారం...వాట్సాప్, టెలిగ్రామ్‌లలో ప్రచారం చేయబడిన 'గెస్డ్ పేపర్ల'లో నీట్–యుజి 2026 అసలు ప్రశ్నాపత్రంలోని బయాలజీ, కెమిస్ట్రీ విభాగాలలో ఉన్న ప్రశ్నలతో సరిగ్గా సరిపోలిన 120 ప్రశ్నలు ఉన్నాయని రాజస్థాన్ పోలీస్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఒజి) కనుగొంది. 5జి జామర్లు, జిపిఎస్ ట్రాకింగ్, ఏఐ–మోనిటర్డ్ కెమెరాలతో సహా అత్యాధునిక భద్రతా చర్యలను ఉపయోగిస్తున్నామని ఎన్‌టిఏ వాదనలు చేస్తున్నప్పటికీ , ఈ చర్యలు కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయని పిటిషనర్ ఆరోపించారు. సూచించిన విధంగా ప్రశ్నాపత్రాలను లాక్‌చేయడాన్ని ప్రత్యక్షంగా ఆదేశించడం, కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి)కు మారడం 'గతంలో జరిగిన లీకుల పర్యవసానంగా, భౌతిక కస్టడీ గొలుసు ప్రమాదాలను తొలగించుకోవడానికి' అని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. పేపర్ లీకుపై దర్యాప్తునకు సంబంధించి, గుర్తించిన నెట్‌వర్క్, జరిగిన అరెస్టులు, అభియోగాలు ఎదుర్కొంటున్న వ్యక్తులు, విచారణ పురోగతి వివరాలతో సహా నాలుగు వారాలలోగా సుప్రీంకోర్టుకు స్టేటస్ రిపోర్ట్‌ను దాఖలు చేయాలని సిబిఐని ఆదేశించాలని కూడా పిటిషన్ కోరింది.'అసాధారణతలను పారదర్శకంగా గుర్తించడం' కోసంనీట్–యుజి 2026 కేంద్రాల వారీ ఫలితాలను (అందుబాటులోకి వచ్చిన వెంటనే) తక్షణమే ప్రచురించాలని ఎన్‌టిఏను కోరాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. 'నీట్–యుజి పరీక్ష అనేది అండర్ గ్రాడ్యుయేట్ వైద్యప్రవేశాల కోసం నిర్వహించే ఒక జాతీయ స్థాయి పరీక్ష. ఇది 22.7లక్షలకు పైగా విద్యార్థుల విద్య, వృత్తి భవిష్యత్‌లను నేరుగా ప్రభావితం చేస్తుంది. వ్యవస్థాగత వైఫల్యం పదే పదే చోటు చేసుకోవడం అనేది ఆర్టికల్స్ 14, 21 కింద సమానత్వం,త జీవించే/ జీవనోపాధి హక్కు వంటి ప్రాథమిక హామీలపై 'ప్రత్యక్ష దాడి' అని పిటిషన్ పేర్కొంది. వారు ప్రశ్నాపత్రాలను భౌతికంగా ముద్రించడం, రవాణా కోసం ప్రైవేట్ కొరియర్లను ఉపయోగించడం వంటి ప్రమాదకరమైన పాత పద్ధతులపై ఆధారపడటం కొనసాగిస్తున్నారని, దీనివల్ల అవి లీకేజీలకు గురయ్యే అవకాశం ఉన్నదని పిటిషన్ తెలిపింది. ఇది ఒకసారి జరిగిన సంఘటన కాదని పిటిషనర్, 2024 పేపర్ లీక్‌తో పోలుస్తూ గత తప్పుల నుంచి ఎన్‌టిఏ గుణపాఠం నేర్చుకోవడంలో విఫలమైందని పిటిషనర్ నొక్కిచెప్పారు. స్ట్రాంగ్ రూమ్‌లలోకి అనధికారిక ప్రవేశం, ఈ–రిక్షాలు, ప్రైవేట్ కొరియర్ల ద్వారా అత్యంత సున్నితమైన పత్రాల రవాణాకు సంబంధించి గతంలో న్యాయవ్యవస్థ చేసిన పరిశీలనలను ఆ పిటిషన్‌లలో ప్రస్తావించారు. పరీక్ష రద్దు కావడంతో 22లక్షల మందికి పైగా వైద్య విద్యార్థులు, వారి కుటుంబాలు తదుపరి పరీక్షాతేదీ, అడ్మిట్ కార్డులు, పరీక్ష కేంద్రాలు, కౌన్సిలింగ్ కాల పరిమితి వంటి అంశాలపై ఆందోళన చెందుతున్నారని పిటిషన్ పేర్కొంది.

# అకాల వర్షంతో యుపి అతలాకుతలం

• వర్ష సంబంధిత ఘటనల్లో 111 మంది మృత్యువాత, 72 మందికి గాయాలు
• గాలి దుమారానికి నేలకొరిగిన చెట్లు, • విద్యుత్ స్తంభాలు పలు చోట్ల ఇళ్లు ధ్వంసం, రోడ్ల దిగ్బంధనం

**న్యూఢిల్లీ :** దేశమంతా భానుడి విజృంభణతో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతు ంటే... ఉత్తరప్రదేశ్ మాత్రం అకాల వర్షం తో అతాలకుతలమవుతోంది. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో తీవ్ర గాలి దుమారం, భారీ వర్షం సృష్టించిన పెను బీభత్సానికి మొత్తం 111 మంది ప్రాణాలు కోల్పోయారు. చెట్లు కూలిపోగా, ఇళ్ల ధ్వంసమైనట్లు యుపి రిలీఫ్ కమిషనర్ కార్యాలయం తెలిపింది. బుధవారం సాయంత్రం వాతావరణం అకస్మాత్తుగా మారడంతో చాలా మంది చెట్లు, ఫ్లైఓవర్ల కింద ఆశ్రయం పొందారు. దుమ్ము మేఘాలు రాష్ట్రంలోని చాలా ప్రాంతాలను కమ్మేశాయి. గాలి దుమారానికి హోర్డింగ్‌లు, రేకుల షెడ్లు ధ్వంసమయ్యాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలను కూడా కూల్చివేశాయి. పలు రోడ్లు దిగ్బంధానికి గురికాగా, వాహనాలపై పడడంతో నుజ్జు నుజ్జు అయ్యాయి. దీంతో సహాయక చర్యలు చేపట్టారు. కొందరు శిథిలాల కింద చిక్కుకున్న వారిని తవ్వి రక్షించగా, మరికొందరు పిల్లలతో సహా గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించారు. ఈనెల 13న తుఫానులు, వర్షాలు, వడగళ్ళు, పిడుగులతో కూడిన ప్రతికూల వాతావరణం కారణంగా రాష్ట్రంలో 89 మంది మరణాలు సంభవించాయని, 53 మంది గాయపడినట్లు రిలీఫ్ కమిషనర్ కార్యాలయం వెల్లడించింది. అదే విధంగా 114 పశువులు మృత్యువాత పడ్డాయని, 87 ఇళ్లకు నష్టం వాటిల్లినట్లు నివేదికలు అందాయని చెప్పింది. ఘటనలను పూర్తి సున్నితత్వంతో పరిశీలించాలని, ప్రభావిత కుటుంబాలతో నేరుగా సంప్రదింపులు జరుపుతూ 24 గంటల్లోగా వారికి ఆర్థిక సహాయం అందేలా చూడాలని, అలాగే ఇతర అవసరమైన సహాయాన్ని అందించాలని ముఖ్యమంత్రి అన్ని డివిజనల్ కమిషనర్లు, జిల్లా మేజిస్ట్రేట్‌లను ఆదేశించినట్లు ఎక్స్‌లో పేర్కొంది. ఈ భయంకరమైన తుఫాను వల్ల జరిగిన నష్టాన్ని చూపిస్తున్న వివిధ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. బరేలీలోని బామియానా గ్రామానికి చెందిన ఒక వీడియో ప్రత్యేకంగా నిలిచింది. ఈదురు గాలుల ధాటికి ఒక వ్యక్తి రేకుల కప్పుతో పాటు దాదాపు 50 అడుగుల ఎత్తుకు ఎగిరి ఒక పొలంలో పడిపోవడం వీడియోలో కనిపిస్తోంది. ఆ తుఫాను సమయంలో తనను తాను కాపాడుకోవడానికి ఆ వ్యక్తి ఒక రేకుల షెడ్డును పట్టుకున్నాడు. ప్రయాగ్‌రాజ్ జిల్లా



యంత్రాంగం జారీ చేసిన జాబితా ప్రకారం, తుఫాను, వర్షం కారణంగా హండియా ప్రాంతంలో ఏడుగురు, ఫుల్‌పూర్‌లో నలుగురు, సోరాన్‌లో ముగ్గురు, మేజాలో ఇద్దరు, సదర్‌లో ఒకరు మరణించారు. భదోహీలో, తుఫాను సంబంధిత సంఘటనలలో కనీసం 16 మంది మరణించారు. తుఫాను కారణంగా పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, అనేక ఇళ్లు దెబ్బతిన్నాయని అదనపు జిల్లా మేజిస్ట్రేట్ కున్వర్ వీరేంద్ర కుమార్ మౌర్య తెలిపారు. భదోహీలోని రాంపూర్ వద్ద గంగా ఘాట్‌లోని ఒక తాత్కాలిక వంతెన తుఫాను ధాటికి దెబ్బతినడంతో, పలువురు వ్యక్తులు గంగా నదిలో పడిపోయారు. వారందరినీ సురక్షితంగా రక్షించారు. మిర్జాపూర్‌లోని గౌరా ప్రమాణపూర్ వద్ద కూడా ఒక తాత్కాలిక వంతెన దెబ్బతినడంతో, 20 గ్రామాలతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. జిల్లాలో తుఫాను సంబంధిత ఘటనల్లో తొమ్మిది మంది మరణించగా, 16 మంది గాయపడ్డారని ఫతేపూర్ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ అవినాష్ త్రిపాఠి తెలిపారు. ఖాగా తహసీల్‌లో ఐదుగురు మహిళలతో సహా ఎనిమిది మంది మరణించారు. సదర్ తహసీల్‌లో ఒక ఇంటి గోడ కూలిపోవడంతో ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది,' అని ఆయన పేర్కొన్నారు. ప్రతాప్‌గఢ్‌లో, ఈదురు గాలులు, వర్షం మధ్య గోడలు కూలిపోవడం, సిమెంట్ షెడ్లు కూలిపోవడం, పిడుగులు పడటం వంటి వేర్వేరు ఘటనల్లో నలుగురు వ్యక్తులు మరణించారు.

**24 గంటల్లోగా బాధితులకు సహాయం అందాలి : సిఎం**

అకాల వర్షాలు, ఉరుములు, మెరుపుల వల్ల జరిగిన ప్రాణనష్టం, నష్టాన్ని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పరిగణనలోకి తీసుకున్నారు. 24 గంటల్లోగా బాధితులకు సహాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తుఫాను, వర్షం, మెరుపుల వల్ల జరిగిన నష్టంపై ప్రతి మూడు గంటలకు ఒకసారి సమాచారం పంపాలని, నష్టపరిహార పంపిణీతో సహా సహాయక చర్యలను సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని ముఖ్యమంత్రి అన్ని జిల్లాలను ఆదేశించినట్లు ఒక అధికారిక ప్రకటన తెలిపింది. బారాబంకి, బహ్రాయిచ్, కాన్పూర్ దేహత్, బస్తీ, సంభాల్, హర్దోయ్, ఉన్నావ్ సహా కనీసం 19 జిల్లాల నుండి ప్రాణనష్టం, పశు నష్టం, పంట నష్టం జరిగినట్లు నివేదికలు వెలువడ్డాయి. ప్రతికూల వాతావరణం కారణంగా అనేక ఇళ్లు కూడా దెబ్బతిన్నాయి. అధికారులు అప్రమత్తంగా ఉండాలని యోగి ఆదిత్యనాథ్ ఆదేశించారు. అలాగే, రెవెన్యూ, వ్యవసాయ శాఖలతో పాటు బీమా కంపెనీలను నష్టాన్ని సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రాణనష్టం జరగడం 'అత్యంత విచారకరం' అని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ అభివర్ణించారు. గాయపడిన వారికి తక్షణమే ఉచితంగా సరైన చికిత్స అందించాలని, ఆహారం, తాగునీటి సరఫరాను నిర్ధారించాలని, బాధితులకు తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మృతులకు గౌరవప్రదమైన అంత్యక్రియలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

# సమస్యలు నుంచి దృష్టి మళ్లించేందుకే...

• రాహుల్‌గాంధీ విదేశీ పర్యటనల అంశాన్ని బిజెపి లేవనెత్తడంపై కాంగ్రెస్ మండిపాటు



**న్యూఢిల్లీ:**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హ యాంలో నెలకొన్న ఆర్థిక పతనం సమస్య ల నుండి ప్రజల దృష్టిని మళ్లించడా ని కే రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల విషయాన్ని బిజెపి లేవనెత్తుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. మ ంత్రి పదవిపై తన వాదనను వినిపించేందుకే బిజెపికి చెందిన సంబిత్ పాత్ర రాహుల్‌గాంధీ విదేశీ పర్యటనల విషయాన్ని లేవనెత్తారని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేష్ అన్నారు. మంత్రి పదవి దక్కాలంటే పాత్ర ఇంతకంటే మంచి అంశాలను వెతుక్కోవాలని రమేష్ సూచించారు. కాంగ్రెస్ నాయకుడి ఏటేటా వచ్చే వార్షిక ఆదాయానికి, ఆయన విదేశీ పర్యటనలకు ఖర్చు చేస్తున్న డబ్బుకు మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉందని ఆరోపిస్తూ, గాంధీ విదేశీ పర్యటనల నిధుల మూలాలను వెల్లడించాలని బిజెపి గురువారం డిమాండ్ చేసింది. దీనిపై రమేష్ స్పందిస్తూ, దేశాన్ని పట్టిపీడిస్తున్న ఆర్థిక పతనమే అసలు సమస్య అని, విదేశాంగ విధానంలోని ఎదురుదెబ్బలే అసలైన సమస్యలని, అవే నిజమైన సమస్యలని, వాటి నుంచి దృష్టి మళ్లించేందుకే రాహుల్ విదేశీ పర్యటనలను లెవనెత్తుతున్నారని మండిపడ్డారు. దేశీయంగా, అంతర్జాతీయంగా పూర్తిగా బట్టబయలైన మోదీని 'రాజీపడ్డ ప్రధాని' అని రమేష్ అభివర్ణించారు. తాను 'విశ్వగురువు' అని ఆయన చేస్తున్న వాదనలు పూర్తిగా బట్టబయలయ్యాయని, ఆయన ప్రతిరోజూ చైనాకు లొంగిపోతున్నారని, ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇ దంతా చేస్తున్నారని ఆరోపించారు. గతంలో రా హుల్ గాంధీ విదేశీ పర్యటనల గురించి మాట్లాడాలంటే, మంత్రిగా తనకున్న పలుకుబడిని ప్రదర్శించడానికి పాత్రా మంచి అంశాలను వెతుక్కోవా రమేష్ సూచించారు. ఉద్యోగాలు, రైతులు, మణిపూర్, చైనా వంటి అంశాలపై దేశానికి సమాధానాలు కావాలని మరో కాంగ్రెస్ నాయకుడు మాణికం ఠాగూర్ అన్నారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీజీపై రోజూ దుష్ప్రచారం చేయడం మానేసి, బిజెపి ము ందుగా నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, తగ్గుతున్న వినియోగం, సరిహద్దు వైఫల్యాలు, బలహీనపడుతున్న ఆర్థిక వ్యవస్థపై ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవేళ విదేశీ పర్యటనలు అకస్మాత్తుగా నేరమైతే, గత 10 ఏళ్లుగా ప్రధాని మోదీ, బిజెపి నాయకులందరి విదేశీ పర్యటనలు, ప్రతినిధి బృందాలు, విమాన ఖర్చులు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఖర్చుల పూర్తి వివరాలను కూడా ఆ పార్టీ వెల్లడిస్తుందా? అని ఠాగూర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'వ్యక్తిగత దాడులు విధానపరమైన వైఫల్యాలను దాచలేవు. దేశం ఉద్యోగాలు, రైతులు, మణిపూర్, చైనా, ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన సమాధానాలను కోరుకుంటోంది తప్ప, కృత్రిమంగా సృష్టించిన ఆగ్రహాన్ని కాదు' అని ఆయన అన్నారు.

## సిపిఐ(ఎం) మాజీ ఎంపి సుధాంగ్షు సీల్ కన్నుమూత



**కోల్‌కతా:**సిపిఐ(ఎం) మాజీ ఎంపి సుధాంగ్షు సీల్ (81) కన్నుమూశారు. వృద్ధాప్య అనారోగ్య సమస్యలతో, కోల్‌కతాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మద్ధతుదారులు, అభిమానుల సందర్శనార్థం ఆ యన పార్థివదేహాన్ని సెంట్రల్ కోల్‌కతాలోని పార్టీ కార్యాలయానికి తరలించినట్లు సీనియర్ నేత తెలిపారు. సుదీర్ఘకాలం పా టు చురుకైన నేతగా వ్యవహరించిన సు ధాంగ్షు సీల్ కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిలర్‌గా ఐదుసార్లు ఎన్నిక య్యారు. మేయర్ కౌన్సిల్ సభ్యుడిగా కూడా పదవిని నిర్వహించారు. పార్టీలో అంచెలంచెలుగా ఎదిగిన ఆయన 2001లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో జోరబాగన్ స్థానం నుంచి గెలుపొందారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో కోల్‌కతా నా ర్త్‌వెస్ట్ నియోజకవర్గం నుంచి తృణ ము ల్ కాంగ్రెస్‌కు చెందిన బలమైన నేత సుదీప్ బందోపాధ్యాయపై పోటీచేసి గెలుపొందారు.

# చక్కెర ఎగుమతులపై సెప్టెంబరు 30 వరకు నిషేధం

**న్యూఢిల్లీ :** పంచాదర ఎగుమతులపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు చక్కెర ఎగుమతులంపై నిషేధం అమలులో ఉంటుందని, ఈ చర్య దేశీయ లభ్యతను పెంచడానికి, ధరలను అదుపులో ఉంచడానికి సహాయపడుతుందని పేర్కొంది. అంతకుముందు ఎగుమతులు పరిమిత వర్గం కింద ఉండేవి, దీని ప్రకారం బయటకు పంపే సరుకులకు లైసెన్స్ అవసరమయ్యేది. ముడి చక్కెర, తెల్ల చక్కెర, శుద్ధి చేసిన చక్కెర ఇలా అన్ని రకాల ఎగుమతులపై ఈ నిషేధం వర్తిస్తుంది. ఐరోపా సమాఖ్య, అమెరికాకు కోటా ఒప్పందాల ప్రకారం జరిగే ఎగుమతులకు ఈ ఆంక్షలు ఉండవు. ప్రభుత్వాల మధ్య జరిగే ఒప్పందాలు, ఇప్పటికే ఎగుమతి ప్రక్రియలో ఉన్న కన్సైన్‌మెంట్‌లకు మినహాయింపు ఉంటుందని కేంద్ర వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయ పరిస్థితులు, ఇరాన్ యుద్ధం కారణంగా తలెత్తే అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని,



దేశీయ అవసరాలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. 2025–26 సంవత్సరానికి (అక్టోబర్ నుంచి సెప్టెంబర్ వరకు) ఆహార మంత్రిత్వ శాఖ మొదటగా 15 లక్షల టన్నుల చక్కెర ఎగుమతులకు అనుమతించింది. ఆ తర్వాత అదనంగా 5,00,000 టన్నుల పూల్‌ను తెరవగా, అందులో కేవలం 87,587 టన్నులకు మాత్రమే ఆమోదం లభించింది. ఫలితంగా దాదాపు 16 లక్షల టన్నుల చక్కెర మాత్రమే ఎగుమతికి అనుమతి లభించింది. ఆహార మంత్రిత్వ శాఖ, చక్కెర మిల్లులు మొత్తం 202526 మార్కెటింగ్ సంవత్సరంలో 7.58 లక్షల టన్నుల రవాణాను అంచనా వేశాయి. మహారాష్ట్ర, కర్ణాటకల్లో అధిక ఉత్పత్తి కారణంగా 2025–26 మార్కెటింగ్ సీజన్‌లో ఏప్రిల్ వరకు భారతదేశ చక్కెర ఉత్పత్తి 7.32 శాతం పెరిగి 27.52 మిలియన్ టన్నులకు చేరుకుందని పరిశ్రమల సంస్థ ఐఎస్ఎంఏ వెల్లడించింది.2025–26 మార్కెటింగ్ సీజన్‌లో ఇథనాల్ మళ్లింపు తర్వాత మొత్తం ఉత్పత్తి 29.3 మిలియన్ టన్నులుగా ఉంటుందని అంచనా వేసింది. అంతకుముందు 2024–25లో నమోదైన 26.12 మిలియన్ టన్నులుగా ఉంది. 2022 అక్టోబర్‌లో భారతదేశం చక్కెర ఎగుమతులపై ఆంక్షలు విధించింది.ఆ తర్వాత ఆంక్షలను ఎప్పటికప్పుడు పొడిగిస్తూ వచ్చింది.

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 50 of 2025**
Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., PARKAL Branch**
**... Disputant**
AND
**Mr. DUPPATI NARESH & Others**
**... Opponents**
2. Sri. Motapothula Narender,S/o, Chandra,Age: 35 Yrs, Occu:Conductor, O/o: T.S.R.T.C. Bhupalpally Depot, R/o:H.No:1-201, Sriramulapally, Abbapur, Mulugu.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 49 of 2025**
Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., PARKAL Branch**
**... Disputant**
AND
**Mr. Mamidipelly Aravind & Others**
**... Opponents**
1. Mr. Mamidipelly Aravind, S/o, Anandam, Age: 33 Years, Occ: Private Employee, H.No: 54-06-435, Indramma Colony, Gundlasingaram, Hanamkonda.
3. Mr. Veldandi Narasimha Ramulu, S/o, Ramakoti, Age: 41 Years, Occ: Business, H.No: 4-113, Rangapur, Mogullapally, Bhupalapally.
4. Mr. Avudapuram srinivas, S/o, Shankar Rao, Age: 43 Years, Occ: SGT, O/o.MEO, Kazipet, R/o: H.No: 2-74, Rayapalli, Kaniparthy, Regonda, Jayashanker Bhupalpally.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 118 of 2025**
Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., PARKAL Branch**
**... Disputant**
AND
**Mr. Ponnam Suman & Others**
**... Opponents**
3. Mr. Koyala Kumaraswamy, S/o. Chandraiah, Age: 53 Years, Occ: Artisan Gr-II, O/o. KTTP, Chelpur, H.No:2-136/A, Dharmaraopeta Road, Ghanpur, Bhupalpally.
4. Mr. Nimmati Naresh, S/o.Ilaiah, Age: 33 Years, Occ: Artisan Gr-II, O/o. KTTP, Chelpur, H.No:5-118/A, Baswarajpally, Merapalli, Dharmaraopeta,Bhupalpally.
5. Mr. Sheepathi Srinivas, S/o. Sammaiah, Age: 47 Years, Occ: Artisan Gr-II, O/o. KTTP, Chelpur, H.No: 1-35 Chelpur, Ghanpur, Mulugu, Jayashankar Bhupalpally.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 101 of 2025**
Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED.,KAZIPET- Branch**
**... Disputant**
AND
**Mr. Mohd.Adil & Others**
**... Opponents**
1. Mr. Mohd. Adil, S/o, Ghouse, Age: 32 Years, Occ:Private Employee, H.No: 554/1, Railway Quarters, Shanthi Nagar, Kazipet, Hanamkonda.
3. Mr. Mohammed Abdul Fayaz, S/o, Rajaq, Age: 35 Years, Occ: Sr.Guard (Goods),O/o.Dy.Station Manager, Kazipet Jn, S.C.Rly, H.No: 1-2-260, Rahamath Nagar, Kazipet, Hanamkonda.
4. Mr.Lingam Venkata Ranga Rao, S/o, Sri Rama Krishna, Age: 52 Years, Occ: Sr.Guard (Pass), O/o. Dy.Station Manager, Kazipet Jn, S.C.Rly, H.No: 286/2, Railway Quarters, Shanthi Nagar, Kazipet, Hanamkonda.
5. Mr. Mohd Ghouse, S/o, Akbar, Age: 56 Years, Occ: Sr.Guard (Goods), O/o .Dy.Station Manager, Kazipet Jn, S.C.Rly, H.No: 554/1, Railway Quarters, Shanthi Nagar, Kazipet, Hanamkonda.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M**. Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 84 of 2025**
Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KAZIPET- II Branch**
**... Disputant**
AND
**Mr. Mekala Karuna shankar & Others**
**... Opponents**
2. Mr. Adavala Satish, S/o. Rama Rao, Age: 44 Years,Occ:Police Consatable, Emp Id.2148583, O/o: Warangal, H.N:3-1-100, Dornakal, Mahabubabad.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 62 of 2025**
Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KAZIPET-II Branch**
**... Disputant**
AND
**Mr. Ellandula Vijay& Others**
**... Opponents**
1. Mr. Ellandula Vijay, S/o, Narasimha Swamy, Age: 28 Years, Occ: Private Employee, H.No: 5-70, Chinnapendyal, Chelpur, Janagaon.
2. Mr. Gaddamedi Rajaiah, S/o, Babu, Age: 44 Years, Occ: Track MNTR-III, O/o. SCR, Secundrabad, H.No: 1-24, Chinnapendyal, Chelpur, Janagaon.
3. Mr. Gaddamedi KumaraSwamy, S/o, Komuraiah, Age: 41 Years, Occ: Track MNTR-III, O/o. SCR Secundrabad, H.No: 5-71, Chinnapendyal, Chelpur, Janagaon.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 66 of 2025**
Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KAZIPET- Branch**
**... Disputant**
AND
**RAPOLU JAGADISH & Others**
**... Opponents**
2. Mr. Vallepu Kumar, S/o, Buddaiah, Age: 42 Years, Occ: Business, H.No: 30-2-42/3, Rottebanda, Madikonda, Hanumakonda.
3. Mr. Rapolu Ellaswamy, S/o, Mallaiah, Age: 50 Years, Occ: Business, H.No: 554/1, Chilpur Gutta, Chilpur,Jangaon.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 85 of 2025**
Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KAZIPET- II Branch**
**... Disputant**
AND
**Mr. Ankusu Venkata Swamy & Others**
**... Opponents**
2. Mr. Ankusu Venkata Swamy, S/o. Sammaiah, Age: 55 Years, Occ: Bussiness, H.N: 3-26, Kondaparthy, Hanamkonda.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 70 of 2025**
Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., WARANGAL Branch**
**... Disputant**
AND
**Mr. Ankireddypalli Jaganmohan Reddy& Others**
**... Opponents**
1. Sri. Ankireddypalli Jaganmohan Reddy, S/o. Pedda Obul Reddy, Age: 52 Yrs, Occ: Agriculture, H.No: 3/12-122,123, Chinmayagaripalle, Near Y.S.R. Statue, Settivaripally, Chinnayagaripally, Kurnool.
2. Sri. Vaidyam Rajagopala Charyulu, S/o, Venkateshwara Charyulu, Age: 47 Yrs, Occu: School Assistant, O/o: Z.P. High School, Kurnool, H.No: 87/1246, Revenue Colony, Kurnool, Ph.No: 9492305130, Andhrapradesh.
3. Sri. Kammari Keshavaiah, S/o, Krishnaiah, Age: 56 Yrs, Occ: School Asst. O/o: Z.P. High School, Palakurthy, Kurnool, H.No: 87-215/2, Kamala Nagar, Kurnool, Andhrapradesh.
4. Sri. Nagaraju Prasada Rao, S/o, Nagabhushana Rao, Age:48Yrs, Occ: Jr. Asst. O/o: Divisional Panchayath Officer,Kurnool, H.No:28-1672-A, Vasavi Street, Nune palle, Nandyal, Kurnool, Andhrapradesh.
5. Sri. Paruchuri Seetha Ramanjaneyulu, S/o, Seshaiah., Age: 48 Yrs, Occ: Chainman, O/o: Tahsildhar, Nandikotkur, H.No: 87-1036-2-1, Ganesh Nagar-2, Kurnool, Andhrapradesh.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M**. Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 53 of 2025**
Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., PARKAL Branch**
**... Disputant**
AND
**Mr. Mekala Vijay Kumar & Others**
**... Opponents**
1. Sri. Mekala Vijay Kumar, S/o, Sambaiah, Age: 35 Yrs, Occu: Pvt. Employee, R/o: H.No: 3-115, Kowkonda, Parkal, Hanumakonda.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 52 of 2025**
Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., PARKAL Branch**
**... Disputant**
AND
**Mr. Dommati Prabhakar & Others**
**... Opponents**
1. Sri. Dommati Prabhakar, S/o, Sammaiah, Age: 50 Yrs, Occu: Agriculture, R/o: H.No: 3-22/11, Mallakpet, Parkal, Warangal.
2. Sri. Mutyala Raghupathy, S/o, Ailaiah, Age: 48 Yrs, Occu: S.G.T, R/o: H.No: 2-59, S.C.Colony, Guniparthy, Kamalapur, Hanamkonda.
3. Smt. Dommati Shantha, W/o, Prabhakar, Age: 47 Yrs, Occu: Agriculture, R/o: H.No: 3-22/11, Mallakpet, Parkal, Warangal.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

## ఇజ్రాయెల్ పార్లమెంటు రద్దుకు బిల్లు

### అక్టోబరు 27 లోపు ఎన్నికలు

**జెరూసలెం:** ఇజ్రాయెల్ పార్లమెంటును రద్దు చేసేందుకు నెతన్యాహూ అధికార కూటమిలోని అన్ని పార్టీల ఆమోదంతో ఒక బిల్లును విప్ ఒఫిర్ కాట్జ్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ప్రతిపక్షం కూడా సిద్ధంగా ఉండటంతో ఈ బిల్లును ఆమోదించడం ఇక ఖాయంగా మారింది. ఈ బిల్లు ఆమోదం పొందిన ఐదు నెలలలోపు పార్లమెంటుకు మళ్ళీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. బహుశా అక్టోబరు 27వ తేదీలోపు ఇజ్రాయెల్ పార్లమెంటుకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. దేశంలో నెతన్యాహూపై తీవ్ర వ్యతిరేకత నెలకుని ఉంది. ప్రతిపక్షాలు కూడా ఆయనకు వ్యతిరేకంగా ఒక్కచోట ఏకమై బలమైన కూటమిగా ఆవిర్భవించేందుకు బలహీనతలను వదిలించుకునేందుకు గట్టి కృషి చేస్తున్నాయి. ఈ బిల్లును ఆమోదించిన మూడు నెలలలోపు ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికల తేదీని క్నెసెట్ (ఇజ్రాయెల్ పార్లమెంటు) హౌస్ కమిటీ నిర్ణయిస్తుందని ప్రతిపాదిత బిల్లులో లిఖితపూర్వకంగా ఉంది. యునైటెడ్ టోరా జుడాయిజం, షాస్,న్యూ హోప్, రెలిజియస్ జియోనిజం, ఓట్జ్మా యెహిదుత్‌పార్టీలన్నీ ఈ బిల్లుకు పూర్తి మద్దతు తెలియజేశాయి. అధికార కూటమికంటే ముందుగానే దేశంలో ప్రతిపక్షం కూడా పార్లమెంటును రద్దుచేయాలని దీర్ఘకాలంగా కోరుతోంది. ఈ ప్రతిపాదనకు ప్రతిపక్షాలు కూడా పూర్తి మద్దతు తెలియజేస్తున్నాయి. హారేదీ యెషివా విద్యార్థులను దశాబ్దాలనాటి సైనిక సేవల నుండి మినహాయింపు ఇచ్చేందుకు వీలుగా శాశ్వతచట్టం ఆమోదించడంలో సంకీర్ణ కూటమి విఫలమైనందువల్ల క్నెసెట్‌ను రద్దుచేయాలని పచ్ఛిమితవాద యుటిజె పార్టీ ఎప్పటి నుండో కోరుతున్నది. ఈ పరిస్థితులను ప్రతిపక్షాలు తమకు అనుకూలంగా మలచుకునేందుకు యత్నిస్తున్నాయి.

## సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నా

### కేన్సర్ చికిత్స పొందుతున్నా : నెతన్యాహూ



**టెల్‌అవీవ్:** ఇప్పుడు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని, కేన్సర్ వ్యాధికి చికిత్స తీసుకుంటున్నానని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ టెల్‌అవీవ్ జిల్లా న్యాయస్థానానికి చెప్పారు. ఆయన కేన్సర్ వ్యాధి సహా పలు తీవ్ర వ్యాధులతో బాధపడుతున్నారని, పదవీ బాధ్యతలు కొనసాగించే పరిస్థితిలో లేరని ఇద్దరు జర్నలిస్టులు, ఒక రాజకీయ కార్యకర్త 2024లో చేసిన ఆరోపణలకు వ్యతిరేకంగా పరువునష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా కోర్టుకు హాజరైన నెతన్యాహూ వాద ప్రతివాదనల సందర్భంగా గురువారం కోర్టుకు పైవిధంగా తెలియజేశారు.''నేను పూర్తి ఆరోగ్యంతో ఉన్నా, మరికొందరైతే ఆరోగ్యం అద్భుతంగా ఉందని కూడా చెబుతున్నారు'' అని కోర్టుకు తెలియజేశారు. ఒక రాజకీయ కార్యకర్త గోనెన్ బెన్ ఇట్జాక్ చెప్పినట్టుగా, తాను ఎప్పుడూ పాంక్రియాటిక్ కేన్సర్‌తో బాధపడలేదని, నిజంగా ఈ వ్యాధి వచ్చి ఉంటే ఏనాడో చనిపోయేవాడినని కోర్టుకు చెప్పారు. తాను ప్రోస్టేట్ గ్రంథి వాపుకోసం 2024లో శస్త్రచికిత్స చేయించుకున్నానని ఆ తర్వాత 2025 చివరినాటికి ప్రోస్టేట్ కేన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయిందని ఈ ఏడాది జనవరిలో రేడియేషన్ థెరపీ చేయించుకుని కేన్సర్‌ను పూర్తిగా తొలగించుకున్నానని చెప్పారు. దానికి సంబంధించిన పత్రాలకు కూడా ఆయన కోర్టుకు సమర్పించారు. ఈ ఏడాది చివరిలో ఇజ్రాయెల్ పార్లమెంటుకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఆయన ప్రత్యర్థులు ఇంతకాలం విడిపోయి బలహీనపడ్డారు. ఇప్పుడు విడిపోయిన రాజకీయశక్తులతోపాటు కొత్తపార్టీ కూడా ఒకేతాటిమీదకు వచ్చి బలమైన కూటమిగా ఆయనను ఢీ కొట్టేందుకు, ఎలాగైనా ఓడించేందుకు కృషి చేస్తున్న తరుణంలో ఈ కోర్టు కేసు ప్రాధాన్యత సంతరించుకుంది.

# బ్రిటన్‌లో నాలుగోమంత్రి స్ట్రీటింగ్ రాజీనామా

### దేశానికి దిశానిర్దేశం లేదని స్టార్‌మర్‌కు లేఖ



**లండన్:** బ్రిటన్ ఆరోగ్యశాఖామంత్రి వెస్‌స్ట్రీటింగ్ ముందుగా ప్రకటించిన విధంగానే గురువారం తన పదవికి రాజీనామా చేశారు. దీంతో బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్‌పై వ్యతిరేకతతో ఇప్పటివరకూ రాజీనామాలు చేసిన మంత్రుల సంఖ్య నాలుగుకు పెరిగింది. ''మీ నాయకత్వంపై నాకు విశ్వాసం పోయింది'' అని స్టార్‌మర్‌కు రాసిన ఒక లేఖలో స్ట్రీటింగ్ ప్రకటించారు. ఈ లేఖను ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మనకు ముందుచూపు ఉండాలి, సమస్యలను ముందుచూపుతో పరిష్కరించాలి, కానీ ఈ విషయంలో శూన్యత నెలకుని ఉంది, మనకు దిశానిర్దేశం కావాలి, కానీ సమస్యల పరిష్కారంలో దిశానిర్దేశం లేకుండాపోయింది అని స్టార్‌మర్‌కు రాసిన లేఖలో స్ట్రీటింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. స్టార్‌మర్‌తో ఆయన ఇంకా పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించలేదు, ఐనప్పటికీ, మీరు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో లేబర్‌పార్టీకి నాయకత్వం వహించే అవకాశం లేదని ఆ లేఖలో స్పష్టం చేశారు. బ్రిటన్ పార్లమెంటులో 403 స్థానాలు ఉండగా, అందులో 81 మంది లేబర్‌పార్టీ ఎంపీలు స్టార్‌మర్ రాజీనామా చేయాలని కోరుతున్నారు. బ్రిటన్ రాజు ఛార్లెస్–3 బుధవారం హౌస్ ఆఫ్ లార్డ్స్‌ను ఉద్దేశించి ప్రసంగించినందువల్ల పార్లమెంటు సమావేశాల ప్రారంభం రోజున స్టార్‌మర్‌కు ఎలాంటి ఇబ్బందీ కలిగించకూడదనే ఉద్దేశంతో స్ట్రీటింగ్ తన రాజీనామా నిర్ణయాన్ని ఒకరోజు వాయిదా వేసుకున్నారు. కాబోయే ప్రధానమంత్రి అభ్యర్థిగా ఆయన అందరిముందుకూ వస్తున్నారు. ఆయనను సవాలు చేస్తున్న స్ట్రీటింగ్‌తో హౌస్ ఆఫ్ లార్డ్స్ సమావేశానికి ముందుగా కీర్‌స్టార్‌మర్ టెన్‌డౌనింగ్ స్ట్రీట్‌లో 16 నిమిషాలు సమావేశమైనప్పటికీ స్టార్‌మర్‌కు ప్రయోజనం చేకూరలేదు. ఈ పరిస్థితులమధ్య హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో కీర్‌స్టార్‌మర్ లేబర్‌పార్టీ ఎంపీలకు విజ్ఞప్తి చేస్తూ విభజన రాజకీయాలలో కూరుకుపోవద్దని కోరారు. పార్టీల ఎంపీల ఐక్యతకోసం విజ్ఞప్తి చేశారు. ఇది అధికారంకోసం కుమ్ములాడుకునే సమయం కాదని, ఐక్యతగా ఉండాలని స్టార్‌మర్ మద్దతుదారులు నిన్నటినుండి విజ్ఞప్తులు చేస్తున్నారు.బ్రిటన్ మాజీ ఉప ప్రధానమంత్రి ఏంజెలా రేనర్ గురువారం మాట్లాడుతూ, గడచిన సెప్టెంబరులో తన రాజీనామాకు దారితీసిన పన్నుల సమస్య పరిష్కారానికి అధికారులతో ఒక ఒప్పందానికి వచ్చినట్లు చెప్పారు.

# జిన్‌పింగ్ గొప్ప నాయకుడు

### పలుసార్లు ప్రశంసించిన ట్రంప్



**బీజింగ్:** చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఒక గొప్ప నాయకుడని డోనాల్డ్ ట్రంప్ పదే పదే ప్రశంసించారు. గురువారం బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ద పీపుల్‌లో జరిగిన ముఖాముఖీ మొదటిరోజు సమావేశంలో జిన్‌పింగ్‌పై ట్రంప్ పదే పదే ప్రశంసలు కురిపించారని జిన్హువా వార్తాసంస్థ పేర్కొంది. తనతోపాటు వెంట వచ్చిన అమెరికా వ్యాపార దిగ్గజాలను కూడా జిన్‌పింగ్‌కు పరిచయం చేస్తూ పదే పదే వారి గురించి చెప్పారు. ఈ పర్యటనలో తాను వాణిజ్యానికే ప్రాధాన్యత నిస్తానని ముందుగానే ట్రంప్ ప్రకటించారు. తమ దేశ వ్యాపార ప్రముఖులు చైనాకు రావడం జిన్‌పింగ్ పట్ల ఎంతో గౌరవ సూచకంగా మాత్రమేనని ట్రంప్ చెప్పారు. వారంతా చైనాలో వాణిజ్య, వ్యాపారాలు చేసేందుకు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారని చైనా అధినేతకు తెలియజేశారు. అనేకమంది నాయకులు అమెరికా నుండి వచ్చినాగానీ ఇప్పటివరకూ జరిగిన అతిపెద్ద సమావేశం ఇదే అని ట్రంప్ చెప్పారని జిన్హువా వార్తాసంస్థ పేర్కొంది. ''మీ స్నేహితుడుగా ఉండటం గొప్ప గౌరవంగా ఉంది, అమెరికా–చైనా మధ్య సంబంధాలు మునుపు ఎన్నడూలేనివిధంగా మెరుగుపడబోతున్నాయి'' అని జిన్‌పింగ్‌తో ట్రంప్ అన్నారు.

**కలిసి పనిచేసేందుకు సిద్ధం:చైనా ప్రతినిధి**

సుస్థిర అభివృద్ధికోసం అమెరికాతో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉందని ఆ దేశ వాణిజ్య మంత్రిత్వశాఖ ప్రతినిధి (ఎంఒఎఫ్‌కామ్) హే యోంగ్ కియాన్ గురువారం బీజింగ్ పత్రికాగోష్ఠిలో చెప్పారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో బుధవారం చైనా,అమెరికా ప్రతినిధులమధ్య ఆర్థిక, వాణిజ్య సంప్రదింపులు జరిగాయి. ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య సంబంధాలలో ఆరోగ్యకరమైన, స్థిరమైన భవిష్యత్ ప్రయత్నాలు,ట్రంప్ పర్యటనపై వ్యాఖ్యానించమని కోరినప్పుడు, చైనా ఆర్థికమంత్రి హే లీఫెంగ్,అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ మధ్య ఆర్థిక,వాణిజ్య సంప్రదింపులు విజయవంతంగా ముగిశాయని హే యోంగ్ కియాన్ చెప్పారు. ఇరుదేశాల అధినేతలూ సాధించిన ముఖ్యమైన ఏకాభిప్రాయానికి కట్టుబడి పరస్పర గౌరవం,సమానత్వం,శాంతియుత సహజీవనం, ఉభయతారక ప్రయోజనాలను ఆశించి ఆసక్తి ఉన్న రంగాలలో నిర్మాణాత్మకమైన సహకారాన్ని విస్తృతం చేసుకుంటామని చెప్పారు. సుస్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడానికి అమెరికాతో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉందని చెప్పారు.

# యుఎఇలో నెతన్యాహూ పర్యటించలేదు

### తప్పుడు కథనాలు ప్రోత్సహించవద్దని విజ్ఞప్తి



అబుధాబి:ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ తమ దేశానికి రాలేదని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యుఎఇ) విదేశీమంత్రిత్వశాఖ గురువారం ప్రకటించింది. ఈ వార్త పూర్తిగా నిరాధారమని పేర్కొంది. ఇజ్రాయెల్‌తో తమ సంబంధాలు అందరికీ తెలిసినవేననీ, బాహాటంగా అబ్రహాం ఒప్పంద పరిధిలోనే కొనసాగుతున్నాయని, ఇందులో ఎలాంటి దాపరికం, అనధికార వ్యవహారాలు లేవని స్పష్టం చేసింది. తాము అధికారికంగా ప్రకటిస్తే తప్ప అప్పటివరకూ వచ్చే ఈ విధమైన వార్తలన్నీ నిరాధారమైనవని స్పష్టం చేసింది. మీడియా సంస్థలు వృత్తినైపుణ్యం పాటించాలని, ఖచ్చితత్వాన్ని అనుసరించాలని, ప్రామాణికతలు పాటించాలని, తప్పుతోవ పట్టించే రాజకీయ కథనాలను ప్రోత్సహించడం మానుకోవాలని కోరింది. గల్ఫ్ దేశాలపై ఇరాన్ యుద్ధం చేస్తున్న సమయంలో నెతన్యాహూ రహస్యంగా యుఎఇలో పర్యటించారని ఆ దేశాధ్యక్షుడు,రాజు షేక్ మహ్మద్ బిన్ జాయేద్‌తో సమావేశం జరిపారని నెతన్యాహూ కార్యాలయం స్వయంగా ప్రకటించింది. ఈ పర్యటన రెండు దేశాలమధ్యా సంబంధాలలో ఒక చారిత్రక పురోగతికి దారితీసిందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించడాన్ని యుఎఇ ఖండించింది. యుద్ధ సమయంలో ఒక ఐరన్ డోమ్ బ్యాటరీని అమర్చడానికి దానిని నిర్వహించడానికి యుఎఇకి ఇజ్రాయెల్ సైనికులను పంపిందని అమెరికా ధృవీకరించింది. యుద్ధ సమయంలో సంఘర్షణలపై సమన్వయ చర్యలు తీసుకోవడానికి ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ మొస్సాద్ ప్రధానాధిపతి డేవిడ్ బార్నియా రెండుసార్లు యుఎఇని సందర్శించారని అరబ్ అధికారులతోపాటు ఈ విషయం తెలిసిన ఒక వర్గం ప్రకటించిందని వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక వార్త ప్రచురించింది. ఇరాన్‌కు చెందిన ఒక ప్రధానమైన పెట్రో కెమికల్ కేంద్రంపై దాడి చేయడానికి ఈరెండు దేశాలూ సమన్వయ చర్యలు చేపట్టాయని వార్తలు వెలువడ్డాయి. ఇజ్రాయెల్–యుఎఇ మధ్య 2020లో సంబంధాలను సాధారణీకరించుకున్నాయి. దీంతో ఇరాన్ ప్రభుత్వం యుఎఇపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇజ్రాయెల్‌తో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రహస్య సంబంధాలు పెట్టుకుని కుమ్మక్కు అయ్యిందని ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చి మండిపడ్డారు.

## 680 డ్రోన్లతో రష్యాదాడి : జెలెన్‌స్కీ

### చిన్నారులు సహా ఆరుగురు మృతి

**కీవ్:** రష్యా తీవ్రస్థాయిలో దాడులు చేస్తున్నట్లు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. మూడు రోజులు కాల్పుల విరమణ పూర్తయిన తర్వాత రష్యా భారీస్థాయిలో 680 డ్రోన్లు, 56 క్షిపణులతో దాడులు చేసిందని చెప్పారు. ఈ దాడుల్లో చిన్నారులు సహా ఆరుగురు మరణించారు. తాజాగా రాత్రికి రాత్రే రష్యా చేసిన దాడుల్లో ఒకరు మరణించారు. మరో 33 మంది గాయపడ్డారు. రాజధాని కీవ్ నగరాన్ని లక్ష్యంగా చేసుకుని సామూహిక డ్రోన్ దాడులు చేసినట్లు జెలెన్‌స్కీ చెప్పారు. ఉక్రేన్ వైమానికదళం సమాచారం ప్రకారం, 693 లక్ష్యాలపై దాడులు చేసేందుకు ప్రయత్నం చేయగా, వాటిని కూల్చివేయడమో, పనిచేయకుండా తటస్థీకరించడమో చేశారు. వీటిల్లో 41 క్షిపణులు కూడా ఉన్నాయి. 24 ప్రాంతాలపై 15 క్షిపణులు, 23 డ్రోన్లు దాడులు చేశాయి. చాలా అరుదైన పద్ధతులలో పగటిపూట రష్యా దాడులు చేసిందని అధికారులు ఆరోపించారు.

# వి.డి. సతీషన్

(మొదటి పేజీ తరువాయి)

కెసి వేణుగోపాల్, రమేష్ చెన్నితాల ప్రధాన పోటీదారులుగా ఉన్నారు. ఈనెల 7న తిరువనంతపురంలో జరిగిన కాంగ్రెస్ శాసనసభ పక్షం సమావేశంలో రాష్ట్రంలో సిఎల్‌పి కొత్త నాయకుడిని నియమించేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు అధికారం ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు దాస్‌మున్షి తెలిపారు. అందుకనుగుణంగా, కాంగ్రెస్ అధ్యక్షురాలు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపిలతో సహా అనేక ఇతర నాయకులను కలిసిన ఎఐసిసి పరిశీలకులు, కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులతో విస్తృతంగా చర్చలు జరిపారని ఆమె తెలిపారు. ప్రమాణ స్వీకారం ఎప్పుడు జరుగుతుందని అడగ్గా, తాను కేరళ వెళ్తానని, ఆ తర్వాత దానిపై నిర్ణయం తీసుకుంటామని దాస్‌మున్షి చెప్పారు. పార్టీలో విభేదాలు ఉన్నాయన్న వదంతులను ఆమె తోసిపుచ్చి, అందరూ ఐక్యంగా ఉన్నారని అన్నారు. కాగా, కేరళలోని కాంగ్రెస్ శాసనసభ పక్షం గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు తమను ఆహ్వానించాలని విజ్ఞప్తి చేయనున్నట్లు వర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి భావసారూప్యత గల పార్టీల నాయకులు హాజరయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, గురువారం ఉదయం ఖర్గే యుడిఎఫ్ మిత్రపక్షాలతో మాట్లాడి, కేరళ సిఎల్‌పి నాయకుడి ప్రకటనను గురువారం మధ్యాహ్నం ఢిల్లీలో చేస్తారని వారికి తెలియజేశారని వర్గాలు చెబుతున్నాయి. 4వ తేదీన కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ 140 స్థానాలకు గాను 102 స్థానాలు గెలుచుకుని, మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మెజారిటీ సాధించినప్పటి నుండి తదుపరి కేరళ ముఖ్యమంత్రిపై నిర్ణయం పెండింగ్‌లో ఉంది.

**హామీలు నెరవేర్చేందుకు కృషి చేస్తా : సతీషన్**

తనకు ఇంతటి భారీ బాధ్యత అప్పగించినందుకు పార్టీ అధిష్టానానికి కేరళ కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థి వి.డి. సతీశన్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. 'కేరళ ప్రజలు మాకు ఒక పెద్ద బాధ్యతను అప్పగించారు. వారు 10 ఏళ్ల వామపక్ష పాలనకు ముగింపు పలికి, 140 అసెంబ్లీ స్థానాలకు గాను 102 స్థానాలను గెలిపించి మాకు అధికారాన్ని ఇచ్చారు. కాబట్టి, మేము ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తాము. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, కేరళను మార్చడానికి, ఒక నూతన కేరళను సృష్టించడానికి 'పుదుయుగం' ప్రారంభించడానికి మేమందరం అంకితభావంతో కష్టపడతాము' అని ఆయన నొక్కి చెప్పారు. 'రాజకీయ, ప్రజా సేవ నిర్వచనాన్ని తిరగరాస్తాము' అని ఆయన విలేకరులతో అన్నారు. రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలపడంతో పాటు, సతీషన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్, సీనియర్ నాయకుడు రమేష్ చెన్నితాలకు కూడా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి ముందుకు సాగే క్రమంలో వారిద్దరినీ విశ్వాసంలోకి తీసుకుంటానని సతీసన్ అన్నారు.

**పార్టీ నిర్ణయాన్ని అంగీకరిస్తా : కెసి**

కేరళ ముఖ్యమంత్రిగా వి.డి. సతీసన్‌ను నియమించాలన్న పార్టీ నిర్ణయాన్ని తాను అంగీకరిస్తున్నానని, ఆయనకు, రాష్ట్రంలోని యుడిఎఫ్ ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఇస్తున్నానని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ తెలిపారు. ఈ పదవికి పరిశీలనలో ఉన్న ముగ్గురిలో ఒకరైన వేణుగోపాల్, న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ సతీషన్‌కు మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. పార్టీయే తనకు సర్వస్వం కాబట్టి, కాంగ్రెస్ నిర్ణయం ఏదైనప్పటికీ దానిని అంగీకరిస్తానని తాను మొదటి నుంచీ స్పష్టం చేశానని ఆయన చెప్పారు. 'కాబట్టి, ఇప్పుడు నా వైఖరి ఇదే. పార్టీ హైకమాండ్ నిర్ణయాన్ని నేను వినయంగా అంగీకరించి, దానిని అమలు చేయడానికి కృషి చేస్తాను. నేను విధేయుడైన కాంగ్రెస్ వాడిని. నాకు పార్టీయే సర్వస్వం. పార్టీ పరువు పోగొట్టుకుని నేను ప్రతిష్టను కోరుకోవడం లేదు. పార్టీ జెండా కప్పుకునే మరణించాలనుకుంటున్నాను. కేరళ ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఇస్తాను' అని ఆయన అన్నారు.

# సరికొత్త దృక్పథం

(మొదటి పేజీ తరువాయి)

చైనా తలుపులు బార్లా తెరచే ఉంటాయని చెప్పారు. దీర్ఘకాలంగా దేశ ఆర్థిక సంస్కరణల్లో అమెరికా కంపెనీలు భాగస్వాములుగా ఉన్నాయన్నారు. ఆర్థిక,వ్యవసాయ, ఆరోగ్య, పర్యాటక రంగాలు, ప్రజల మధ్య సంబంధాల్లో కూడా సహకారాన్ని విస్తృతం చేసుకోవాలని ఆకాంక్షించారు. రాజకీయ,దౌత్య,సైనిక రంగాలలో కూడా ఆదాన ప్రదానాలను ఏకాభిప్రాయంకోసం ఉత్తమ సాధనాలుగా ఉపయోగించుకోవాలని కోరారు.

''శత్రువులుగా కాదు, భాగస్వాములుగా ఉందాం'' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు గురువారం మధ్యాహ్నం విందు సమావేశంలో జిన్‌పింగ్ ప్రతిపాదించారు. ట్రంప్ చైనా పర్యటన సందర్భంగా ఇద్దరు ప్రపంచ అగ్రదేశాల నాయకుల మధ్య బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ద పీపుల్‌లో మొదటి విడత చరిత్రాత్మక సమావేశం విజయవంతంగా పూర్తయింది. ఈ సమావేశంలో ద్వైపాక్షిక సంబంధాలతోపాటు తైవాన్ అంశం ప్రధాన చర్చనీయాంశంగా ముందుకు వచ్చింది. ''వ్యూహాత్మక స్థిరత్వంతో కూడిన చైనా–అమెరికా సంబంధాలను నిర్మించేందుకు ఉద్దేశించిన సరికొత్త దృక్పథంపై ట్రంప్‌తో నేను అంగీకరించాను'' అని సమావేశానతరం జీ జిన్‌పింగ్ చెప్పారు. ద్వైపాక్షిక సంబంధాలకు ఈ కొత్త దృక్పథం రాబోయే మూడు సంవత్సరాలకు, ఆ తర్వాత కూడా మార్గదర్శనం చేస్తుందని అన్నారు. ఈ విషయాన్ని ఇరు దేశాల ప్రజలతోపాటు ప్రపంచ దేశాలు కూడా స్వాగతిస్తాయని చెప్పారు. అదేవిధంగా ఇరు దేశాల సంబంధాల్లో తైవాన్ అంశం అతి ముఖ్యమైన సమస్యగా ఉందని ఆయన ఉద్ఘాటించారు. ఈ సమస్యను సరిగ్గా పరిష్కరిస్తే ద్వైపాక్షిక సంబంధాలు మొత్తంగా సుస్థిరంగా కొనసాగుతాయని, లేకపోతే రెండు దేశాలూ ఘర్షణలు,సంఘర్షణలు కూడా ఎదురోవలసి రావచ్చునని జిన్‌పింగ్ హెచ్చరించారు. తైవాన్ సమస్య పరి



ష్కారంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవడానికి తగిన కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మాతృదేశానికి దూరంగా ఉంటున్న స్వయంనిర్ణయాధికార ప్రాంతంగా తైవాన్‌ను చైనా పరిగణిస్తోంది. తైవాన్‌తో ఇతర దేశాలు దౌత్యసంబంధాలు పెట్టుకోవడాన్ని చైనా నిషేధించింది. ఐతే 1979లో ఆధునిక చైనాతో అమెరికా దౌత్య సంబంధాలు ఏర్పాటు చేసుకున్న తర్వాత బీజింగ్ డిమాండ్లకు అనుగుణంగానే ఉంటున్నప్పటికీ, తైవాన్‌కు లాంఛనపూర్వక మద్దతు ఇస్తోంది.ఐతే తైవాన్‌ను చైనాలో ఒక అంతర్భాగమని అమెరికా స్పష్టంగా ఆమోదించలేదు.

ప్రపంచ పరిస్థితులు సంధి దశలో ఉన్న తరుణంలో ట్రంప్ చైనా పర్యటనపట్ల జిన్‌పింగ్ ఆయనకు తన హృదయపూర్వక సంతోషాన్ని తెలియజేశారు. నాయకులు ఇద్దరూ అనేక అంశాలపై పరస్పర అభిప్రాయాలు ఇచ్చిపుచ్చుకున్నారు. శుక్రవారం రెండో రోజు కూడా ట్రంప్–జిన్‌పింగ్ మధ్య రెండో విడత సమావేశం జరుగుతుంది. జీ జిన్‌పింగ్‌తో తనకు అద్భుతమైన సంబంధం ఉందని, చైనా–అమెరికా మధ్య సంబంధాలు ఎన్నడూలేని విధంగా అత్యుత్తమస్థాయికి చేరుకున్నాయని సమావేశంలో ట్రంప్ చెప్పారు. ఈ మేరకు రెండు దేశాల నుండి ప్రకటనలు వెలువడ్డాయి. వాణిజ్య నౌకల రాకపోకల నిమిత్తం హోర్ముజ్ జలసంధిని పునఃప్రారంభించాలని, ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదని అమెరికా–చైనా దేశాల నాయకులు గురువారం మొదటిరోజు చర్చల్లో అంగీకరించారని వైట్‌హౌస్ ప్రకటించింది. అదేవిధంగా హోర్ముజ్ జలసంధిమీద ఆధారపడే రవాణా తగ్గించుకుని అందుకు బదులుగా అమెరికా నుండి చమురు కొనుగోలు చేసేందుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆసక్తి చూపించారని కూడా వైట్‌హౌస్ తన ప్రకటనలో పేర్కొంది. ఐతే ఆ తర్వాత చైనా ప్రభుత్వమీడియా ద్వారా విడుదల చేసిన అధికారిక ప్రకటనలో ఈ విషయంపై ఎలాంటి స్పందనా కనిపించలేదని అసోసియేటెడ్ ప్రెస్ తెలియజేసింది. ప్రపంచవ్యాప్తంగా చమురును అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న దేశం చైనా మాత్రమే. అదీ అత్యధికంగా హోర్ముజ్ జలసంధి ద్వారా ఇరాన్ నుండి పెద్దమొత్తంలో చమురును చైనా కొనుగోలు చేస్తోంది. చైనా కొనుగోలు చేస్తున్న చమురులో నాలుగు శాతం మాత్రమే అమెరికా నుండి దిగుమతి అవుతోంది. ట్రంప్ టారిఫ్‌ల యుద్ధం ప్రకటించిన తర్వాత 2025 మే నెల నుండి అమెరికా నుండి చైనా చమురు దిగుమతులు చేసుకోవడంలేదు. యునెస్కో ప్రపంచవారసత్వ కేంద్రంగా భాసిల్లుతున్న టెంపుల్ ఆఫ్ హెవెన్‌కు ట్రంప్–జిన్‌పింగ్ సందర్శించారు. అక్కడ వారిద్దరూ ఫొటోలకు ఫోజులు ఇచ్చారు. 14వ శతాబ్దంనాటి కన్ఫ్యూసియస్ భవంతులలో ఇది అత్యంత ప్రసిద్ధి చెందింది. టెంపుల్ ఆఫ్ హెవెన్ మందిరం మొత్తం తిరిగి ఆ ప్రాంతాన్ని ఆస్వాదించారు.

ఇదిలా ఉండగా సెప్టెంబరు 24వ తేదీన జిన్‌పింగ్ అమెరికాలో పర్యటిస్తారని ట్రంప్ చెప్పారు. వైట్‌హౌస్‌ను సందర్శించాల్సిందిగా తాను ఆయనను ఆహ్వానించానని చెప్పారు. తన చైనా పర్యటనకకు ప్రతిగా జిన్‌పింగ్‌కు ఈ ఆహ్వానం అందించినట్లు చెప్పారు.

**కొత్త దృక్పథం అమలుకు సిద్ధం:జియాకున్**

చైనా–అమెరికా మధ్య సరికొత్త దృక్పథాన్ని యథాతథ స్ఫూర్తితో అదే దిశలో ఆచరణమార్గంలోకి తీసుకువచ్చేందుకు, కలిసి పనిచేసేందుకు చైనా సిద్ధంగా ఉందని ఆ దేశ విదేశీ వ్యవహారాలమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గుయో జియాకున్ చెప్పారు. స్థిరమైన,పటిష్టమైన,సుస్థిర అభివృద్ధికోసం కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రాబోయే మూడు సంవత్సరాలు ఇందుకు కీలకమైనవన్నారు.

# మద్దతు చెల్లిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ధాన్యం కొనుగోళ్ల కోసం రూ. 22వేల కోట్లు ప్రభుత్వం సిద్ధం చేసిందని ఇప్పటి వరకు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ప్రతియేటా ధాన్యం కొనుగోలుకు రూ. 45వేల కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసేందుకు గోడౌన్ల సామర్థ్యం చాలా తక్కువగా ఉందని గోడౌన్ల సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. తాలు, తరుగు పేరుతో ఇబ్బందులు పెడుతున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల యజమానులు రైతుల వద్ద నుండి అదనపు వసూళ్లు చేస్తే పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కూడా ధాన్యం కొనుగోళ్ల విషయంలో కొంత ఇబ్బంది పెడుతుందని మద్దతు ధర ప్రకటిస్తుంది కానీ నూటికి నూరు శాతం కొనుగోలు చేయడంలో విఫలమవుతుందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కొంత ఖర్చును భరించేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడం వల్లే వరి సాగు గణనీయంగా పెరిగిందని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించి విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందించ లేదు.

**తక్షణ తరలింపుకు చర్యలు తీసుకోండి : కూనంనేని**

కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం, మొక్కజొన్నలను కాంటాలు వేసి తక్షణం తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. సమీక్షా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో పది నుంచి 15 రోజుల పాటు పడిగాపులు కాసినా కొనుగోళ్లు చేయడం లేదని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు.

ఆన్‌లోడింగ్ సమస్య కూడా రైతులను ఇబ్బందులు పెడుతుందని ఆయన తెలిపారు. నిల్వ చేసే గోడౌన్లు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని భవిష్యత్తులో ముందస్తు ప్రణాళికతో గోడౌన్ల నిర్మాణం లేక లీజుకు తీసుకునే ప్రయత్నం చేయాలని కూనంనేని ప్రభుత్వానికి సూచించారు. తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ పరాకాష్టకు చేరిందని క్వింటాకు 10 కేజీలు కోత విధించడం ఎక్కడ లేదన్నారు. మొక్కజొన్నల కొనుగోలు విషయంలో 26 క్వింటాళ్ల నిబంధనను ఎత్తివేయాలని ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి వస్తున్న నేపథ్యంలో 26 క్వింటాళ్ల పరిమితి ఎందుకని ఆయన ప్రశ్నించారు. నగదు చెల్లింపుల్లోనూ జాప్యం చేయవద్దని తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, కొత్తగూడెం కలెక్టర్ అంకిత్, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, కొత్తగూడెం ఎస్‌పి రోహిత్‌రాజ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షోభంలో తల్లడిల్లుతున్నాం..

(మొదటి పేజీ తరువాయి)

చేయడంతో ఎవ్వరూ సాహసించి ముందుకు రావడం లేదు. గడచిన డిసెంబరు తర్వాత రష్యాకు చెందిన అనటోలీ కోలోడ్కిన్ అనే పెద్ద చమురు ట్యాంకర్ మాత్రమే క్యూబాకు ఏప్రిల్ నెలలో ఇంధనం సరఫరా చేయడంతో కొంత ఉపశమనం కలిగింది. ఇప్పుడు ఆ నిల్వలు అడుగంటాయి. క్యూబాలో దాదాపు కోటిమంది జనాభా ఉన్నారు. నాలుగు నెలలుగా దేశంలో భయంకర పరిస్థితులు తాండవిస్తున్నాయి. ప్రజాసేవలన్నీ స్తంభించిపోయాయి. మళ్ళీ విద్యుత్ కోతలు మొదలయ్యాయి.ట్రంప్ విధించిన దిగ్బంధనం చట్టవిరుద్ధమని ఐక్యరాజ్యసమితి ఖండించింది. క్యూబా ప్రజల మానవహక్కులను అమెరికా హరించిందని విమర్శించింది. మరోవైపు క్యూబాను ఈ విధంగా మలమల మాడ్చి లొంగదీసుకోవాలని ట్రంప్ ప్రయత్నం చేస్తున్నారు. ''మా దేశంలో ఇంధనం నిల్వలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి, డీజిలు,పెట్రోలు అస్సలు లేదు, మా దేశం సంక్షోభంతో తల్లడిల్లుతోంది, జాతీయ గ్రిడ్ సంక్లిష్టమైన స్థితిలో ఉంది'' అని మంత్రి లెవీ పేర్కొన్నారు. దేశరాజధాని అంతటా నాటకీయంగా విద్యుత్ కోతలు అమలులో ఉంటున్నాయని, రోజుకు 22 గంటలు విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారని మంత్రి విచారం వ్యక్తం చేశారు. చమురు దిగుమతులపై దిగ్బంధనం వల్ల చెత్త సేకరణ కూడా నిలిచిపోయింది. దీంతో ఎక్కడికక్కడ ఎలుకలు,దోమలు,ఇతర కాలుష్యం పెరిగిపోయింది. దీంతో వ్యాధులు ప్రబలుతాయనే భయాలు సర్వత్రా వ్యాపిస్తున్నాయి. గడచిన రెండు సంవత్సరాలలో క్యూబా 1300 మెగావాట్ల సౌర విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోగలుగుతోందని, ఇదెంతమాత్రం సరిపోదని చెప్పారు. ఇంధన కొరత,అస్థిరత వల్ల గ్రిడ్ సామర్థ్యం కోల్పోతోందని చెప్పా రు.

**మా వల్ల అమెరికాకు ప్రమాదమేంటి?**

అమెరికాకు క్యూబా వల్ల ఏం ప్రమాదం ఉందని ఆ దేశ కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీ ప్రథమ కార్యదర్శి,దేశాధ్యక్షుడు మిగెల్ డయాజ్ కానెల్ బెర్ముడెజ్ ప్రశ్నించారు. క్యూబా వల్ల ముప్పు అనేది అన్నింటికంటే మొదట 'కేవలం ఒక నింద' అనీ, గత చరిత్ర,వర్తమాన వాస్తవాలు దీనినే స్పష్టం చేస్తున్నాయన్నారు. ఇప్పుడు క్యూబాకే అమెరికావల్ల అతిపెద్ద కొత్త ముప్పు ఏర్పడిందన్నారు. తమ ద్వీపానికి అమెరికా 90 మైళ్ళ సమీపంలో ఉన్నాగానీ ఆరు దశాబ్దాలకుపైగా సాగిన క్యూబా విప్లవంలో ఏనాడూ తమ దేశం నుండి ఒక్క దాడి కూడా అమెరికా ఆజతీయ భద్రతకు వ్యతిరేంగా జరగలేదని, అందుకు విరుద్ధంగా అనేక దశాబ్దాలుగా క్యూబా తీవ్రమైన దాడులకు, అణచివేతకు గురవుతోందని ఆయన స్పష్టం చేశారు. అమెరికా నుండి వస్తున్న బెదిరింపులను ధృఢంగా ఎదుర్కొనేందుకు ఇంతకాలంగా క్యూబన్లు కృషి చేస్తున్నారన్నారు. వివిధ రకాల అంతర్జాతీయ నేరాలకు వ్యతిరేకంగా అమెరికా రక్షణకు క్యూబా సహకరించిందని ఆయన గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా అనేక అంతర్జాతీయ సంస్థలు, ప్రభుత్వాలు ఈ వాస్తవాన్ని గుర్తించాయని పేర్కొన్నారు.

# కోహ్లీ నూరు.. కోల్‌కతా బేజారు..

## ఎనిమిదో విజయంతో టాప్ ప్లేస్‌కు ఆర్‌సిబి




**రాయ్‌పూర్:** డిఫెండింగ్ చాంపియన్స్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి) మరోసారి 'టాప్' లేపే ఆటతో దుమ్మురేపింది. బంతితో ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయినా ఛేదనలో మొనగాడు విరాట్ కోహ్లీ (60 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సర్లతో 105 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగిన వేళ.. ఈ సీజన్‌లో ఆ జట్టు ఎనిమిదో విజయంతో పాయింట్ల పట్టికలో మళ్లీ అగ్రస్థానాన్ని దక్కించుకుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో కోలకతా నైట్‌రైడర్స్‌ను ఓడించిన ఆర్‌సిబి.. ప్లేఆఫ్స్‌కు అడుగుదూరంలో నిలిచింది. కెకెఆర్ నిర్దేశించిన 193 పరుగుల లక్ష్యాన్ని 19.1 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' కోహ్లీకి అండగా దేవదత్ పడిక్కల్ (27 బంతుల్లో 39, 7 ఫోర్లు) రాణించాడు. తొలుత అంగ్క్రిష్ రఘువంశీ (46 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 71 ), రింకూ సింగ్ (29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు 49 నాటౌట్) రాణించడంతో కోలకతా నిర్ణీత ఓవర్లలో 192/4 స్కోరు చేసింది. వరుసగా నాలుగు విజయాల తర్వాత కెకెఆర్‌కు ఇది తొలి ఓటమి కాగా ఓవరాల్‌గా ఆరో పరాభవంతో ప్లేఆఫ్స్ అవకాశాలను దాదాపుగా వదులుకుంది.

**కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్...** ఛేదనలో బెథెల్ (15) మరోసారి తేలిగ్గానే వికెట్ సమర్పించుకున్నా గత రెండు మ్యాచ్‌ల్లో డకౌట్ అయిన కోహ్లీ.. ఈసారి రెచ్చిపోయి ఆడాడు. వైభవ్ తొలి ఓవర్లోనే నాలుగు బౌండరీలు బాదిన రన్ మెషీన్.. పడిక్కల్ అండగా చెలరేగి ఆడాడు. 21 పరుగుల వద్ద అతడు ఇచ్చిన క్యాచ్‌ను కవర్స్ వద్ద పావెల్ జారవిడవడంతో ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న కోహ్లీ.. ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. వరుస బౌండరీలతో పరుగుల వేటకు దిగిన పడిక్కల్ సైతం బ్యాట్ ఝుళిపిస్తూ బౌండరీలతో రెచ్చిపోగా పది ఓవర్లలో బెంగళూరు 101/1తో సాఫీగా లక్ష్యం వైపుగా సాగింది. అదే జోరుతో కోహ్లీ.. 32 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. అయితే రెండో స్పెల్లో బంతినందుకున్న కార్తీక్.. పడిక్కల్ను ఆఫ్ కట్టర్‌తో బోల్తా కొట్టించి 59 బంతుల్లోనే 92రన్స్ జోడించిన మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. రజత్ పాటీదార్ (11), టిమ్ డేవిడ్ (2) నిరాశపరిచినా కోహ్లీ మాత్రం రెచ్చిపోయి ఆడాడు. అనుకుల్ ఓవర్లో 4, 6తో 90ల్లోకి వచ్చిన అతడు.. అరోరా 19 ఓవర్లో సింగిల్‌తో మెగా లీగ్‌లో రెండేళ్ల తర్వాత మరో సెంచరీని నమోదు చేశాడు. జితేశ్ (8 నాటౌట్)తో కలిసి లాంఛనాన్ని పూర్తిచేశాడు.

**రఘువంశీ పోరాటం...** నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్‌లో రఘువంశీ ఆటే హైలైట్. ఓపెనర్లు విఫలమైనా పటిష్టమైన బౌలింగ్ లైనప్ కల్గిన బెంగళూరు బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్న అతడు.. మొదట కామెరాన్ గ్రీన్ (24 బంతుల్లో 32), తర్వాత రింకూతో కలిసి కోకలతాను నిలబెట్టాడు. గత మ్యాచ్‌లో సెంచరీతో రెచ్చిపోయిన అలెన్ (18) డఫీ వేసిన రెండో ఓవర్లో 4, 6, 4తో దూకుడు మీదే కనిపించినా ఆ మరుసటి ఓవర్లోనే భువీ బౌలింగ్‌లో కీపర్ జితేశ్‌కు క్యాచ్ ఇవ్వడంతో ఆ జట్టు తొలి వికెట్ కోల్పోయింది. రహానే (19).. మళ్లీ నిరాశపరచడంతో కెకెఆర్ 5 ఓవర్లలో 49/2గా నిలిచింది. ఈ దశలో రఘువంశీ.. గ్రీన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించాడు. కృనాల్ ఓవర్లో 6, 4తో గేర్ మార్చాలని చూసిన గ్రీన్ను రసిఖ్ 13వ ఓవర్లో క్లీన్‌బౌల్ చేయడంతో 68 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. డఫ్ఫీ బౌలింగ్లో సింగిల్‌తో ఈ సీజన్లో నాలుగో అర్ధశతకం సాధించిన రఘువంశీకి రింకూ జతకలవడంతో కెకెఆర్ ఓవర్‌కు పది పరుగులకు తగ్గకుండా రాబట్టి మంచి స్కోరు చేసింది.

## ప్రిక్వార్టర్స్‌కు సింధు, శ్రీకాంత్



**బ్యాంకాక్ :** థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో రెండో రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్, లక్ష్యసేన్ వంటి టాప్ షట్లర్లు తొలి రౌండ్ విఘ్నాలను అధిగమించి ప్రీక్వార్టర్స్‌కు చేరగా ఆయుష్ శెట్టి, హైదరాబాదీ మన్నెపల్లి తరుణ్, తన్వి శర్మ మొదటి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలిరౌండ్‌లో డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ సింధు.. 21–19, 21–12తో టుంగ్ సియుటాంగ్‌ను చిత్తుచేసింది. మరో మ్యాచ్‌లో మాళవిక బన్సోద్.. 13–21, 26–24, 21–13తో వెన్ యు జాంగ్ (కెనడా)ను ఓడించగా దేవిక.. 21–19, 13–21, 21–15తో జపాన్ షట్లర్ నట్సుకి నిదైరను ఇంటికి పంపించింది. ఉన్నతి హుడా, తన్వి శర్మ ఓటమిపాలయ్యారు. మెన్స్ సింగిల్స్‌లో శ్రీకాంత్.. 21–14, 21–15తో లో కీన్ యూ(సింగపూర్)ను ఓడించాడు. లక్ష్యసేన్ 21–16, 21–17తో జేసన్ (సింగపూర్)ను మట్టికరిపించాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల ద్వయం 9–21, 15–21తో క్రిస్టియన్సెన్-అలెగ్జాండ్ర (డెన్మార్క్) చేతిలో ఓడి ఇంటిదారి పట్టింది.

## జ్ఞానేశ్వరికి రెండు పతకాలు




**అహ్మదాబాద్:** ఆసియా వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత లిఫ్టర్ జ్ఞానేశ్వరి యాదవ్ సత్తాచాటింది. బుధవారం జరిగిన మహిళల 53 కిలోల విభాగంలో రెండు పతకాలు సాధించడమే గాక తన పేరిటే ఉన్న జాతీయ రికార్డునూ తిరగరాసింది. స్నాచ్లో 88 కిలోలు ఎత్తి రజతం సాధించిన ఆమె.. గతంలో తానే నెలకొల్పిన (87 కిలోలు) రికార్డును అధిగమించింది. ఇక క్లీన్ అండ్ జెర్క్లో 106 కిలోలు ఎత్తిన ఆమె.. ఓవరాల్గా (194 కిలోలు) కాంస్యం సాధించింది.

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

### తెలంగాణా ప్రాంతంలో ప్రవహిస్తున్న నదులలో ముఖ్యమైనది?

- పీష్వా రెండో బాజీరావు సైన్య సహకార ఒప్పందంపై ఎప్పుడు సంతకం చేశాడు?
  1802
- ప్రస్తుతం సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య ఎంత?
  1+30
- వేములవాడ చాళుక్యుల మొదటి రాజధాని ?
  బోధన్
- ప్రపంచ అటవీ దినోత్సవాన్ని ఏ రోజున నిర్వహిస్తారు?
  మార్చి 21
- వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ ఎన్ని పంటలకు కనీస మద్దతు ధరలు సిఫారసు చేస్తుంది?
  23
- తెలంగాణ రాష్ట్రంలోని శాసనమండలిలో స్థానిక సంస్థల నియోజక వర్గాల కోటాలో ఎన్ని స్థానాలను పెంచుతూ 2015, సెప్టెంబరు 22న కేంద్ర హోం మంత్రిత్వశాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.
  3
- వాయవ్య రాష్ట్రంలో ప్రాంతీయ భాషల ద్వారా విద్యాబోధనను ప్రోత్సహించినవారు ఎవరు?
  జేమ్స్ థామ్సన్
- 'అమోఘ' ఒక ......
  యుద్ధ ట్యాంక్ విధ్వంసక క్షిపణి (ఏటీఎం)
- బుద్ధుడు తన తొలి బోధన చేసిన ప్రదేశమేది?
  సారనాథ్
- కటక సామర్థ్యానికి ప్రమాణాలు ఏవి?
  డయాపర్లు
- 'మధుర విజయం' రచయిత ఎవరు?
  గంగాదేవి
- ఏ సంవత్సరాన్ని 'అంతర్జాతీయ వైకల్య సంవత్సరం'గా గుర్తించారు?
  1981
- అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఏ రోజున నిర్వహిస్తారు?
  సెప్టెంబరు 8
- కలకత్తాలో హిందూ కళాశాలను ఎప్పుడు స్థాపించారు?
  1817
- వాతావరణంలో ఆమ్లజని శాతం ఎంత?
  21%
- రాష్ట్ర గవర్నరును ఎవరు నియమిస్తారు?
  రాష్ట్రపతి
- సామాజిక మినహాయింపు లక్ష్యం ఏమిటి?
  పెత్తనం, అధికారం, ప్రయోజనాలు
- కింది ఏ దేశంలో సాధారణంగా భూకంపాలు సంభవించవు?
  ఆస్ట్రేలియా
- కిందివాటిలో భిన్నంగా ఉన్న విటమిన్ ఏది?
  విటమిన్ ఎ
- మానవ అక్రమ రవాణాపై అధ్యయనం జరిపిన కమిటీ ఏది?
  వర్మ కమిటీ
- 2015 సంవత్సరానికి తెలంగాణ లోని ఏ గ్రామానికి 'సాక్షర భారత్' అవార్డు లభించింది?
  అంకిరెడ్డి గూడెం
- సంస్కృత కళాశాలల బలోపేతాన్ని వ్యతిరేకించినవారు ఎవరు?
  రాజారామమోహన్ రాయ్
- కింది వాటిలో ప్రపంచంలో సహజ వనరులు ఎక్కువ ఉన్న దేశమేది?
  బ్రెజిల్, అర్జెంటీనా, భారతదేశం
- సింగరేణి కాలరీస్ ఈ ఏడాది లాభాల్లో ఎంత శాతం వాటాను ఆ సంస్థ కార్మికులకు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది?
  21%




- అంతర్జాతీయ సునామీ హెచ్చరిక కేంద్రం ఎక్కడ ఉంది?
  హోనలూలు
- స్పష్ట దృష్టి కనిష్ట దూరం విలువ ఎంత?
  25 సెం.మీ.
- హంటర్ కమిషన్ ను ఎవరి కాలంలో నియమించారు?
  రిప్పన్
- వేములవాడను పూర్వం ఏమని పిలిచేవారు?
  లేంబులవాడ
- బాలికల పాఠశాలల ఏర్పాటుకు కృషిచేసిన వారు ఎవరు?
  బెత్యూన్
- గవర్నర్ నియమితులవ్వాలంటే ఎన్నేళ్ల



వయసు నిండి ఉండాలి?
  35
- అతి పెద్ద గుడ్లు పెట్టే జంతువు?
  ఆస్ట్రిచ్
- రెటీనాను, మెదడుతో కలిపేది
  దృక్ నాడి
- రిఫ్రిజిరేటర్ల వల్ల.....గాలిలోకి వదలబడును.
  క్లోరోఫ్లోరో మీథేన్
- సుప్రీంకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి జస్టిస్ జ్ఞానసుధామిశ్రా కాగా, రెండవ] మహిళా న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసినది.
  జస్టిస్ రంజనా దేశాయ్
- పరిశ్రమలకు పావలావడ్డీ పథకం ఎప్పుడు ప్రారంభించబడింది?
  2008
- చేపల ఆహారంగా దేనిని వాడవచ్చు?
  ఆయిల్ కేక్
- తెలంగాణా ప్రాంతంలో ప్రవహిస్తున్న నదులలో ముఖ్యమైనది?
  మంజీర
- మెదడును కప్పి ఉండే వెలుపలి, మధ్యపొరల మధ్య ఉండే ద్రవం
  మస్తిష్క మేరుద్రవం
- 'చేయూత' పథకం దేనికి సంబంధించినది?
  వికలాంగులకు ఉపాధి కల్పించడం
- చెరకును పండించుటలో ప్రథమస్థానంలో వున్న రాష్ట్రం
  ఉత్తరప్రదేశ్
- చైనీయులకు తెలియనిది
  సున్న సంకేతం
- వియత్నాంతో యుద్ధ సమయంలో అమెరికా అక్కడి అడవులను నాశనం చేయడానికి ఏ రసాయనాన్ని ఉపయోగించింది?
  ఏజెంట్ ఆరెంజ్
- భారతదేశంలో విద్యాభివృద్ధికి లక్ష రూపాయిలు కేటాయించిన చట్టమేది?
  1813 చార్టర్ చట్టం

## నిబంధనలు పూర్తిగా ఎత్తివేసి

# ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు చేయాలి

రైతు సంఘం నేత బాగం డిమాండ్




**ప్రజాపక్షం/ఖమ్మం :** ధాన్యం, మొక్కజొన్నను తాత్సరం చేయకుండా పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని, కొనుగోళ్లలో నిబంధనలు ఎత్తివేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. రోజుల తరబడి కల్లాల వద్ద రైతులు పడిగాపులు కాసిన కొనుగోలు చేసే పరిస్థితి లేదని రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని, రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు పిలుపునిచ్చారు. ధాన్యం, మొక్కజొన్నల కొనుగోళ్లపై మంత్రులు సమీక్ష నిర్వహిస్తున్న నేపథ్యంలో రైతు సంఘం ఆందోళనకు పిలుపునిచ్చింది. దీనితో పోలీసులు కలెక్టరేట్ వద్ద ఆందోళనకు అనుమతి ఇవ్వకపోగా రైతుసంఘం నాయకులను అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. పెద్దసంఖ్యలో రైతులు కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనను ఉద్దేశించి హే మంతరావు మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో నిల్వ చేయడానికి అవకాశం లేకుండాపోయిందని, దీంతో పాటే గోనె సంచులు, ఇతరత్రా సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా గోడౌన్లను ఎంపిక చేసి సిద్ధం చేయడంలో అధికారులు వైఫల్యం కారణంగానే రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే రైతులు ప్రైవేటు వ్యాపారులకు కొంత మేర మొక్కజొన్నలు విక్రయించారని, మిగిలింది కొనుగోలు చేయడానికి సైతం ప్రభుత్వం సంసిద్ధంగా లేకపోవడం విచారకరమన్నారు. ఎకరాకు మొక్కజొన్నల కొనుగోలు విషయంలో 26 క్వింటాళ్ల నిబంధనను తక్షణం ఎత్తివేయాలని ఆయన డి మాండ్ చేశారు. మొక్కజొన్నలు కొనుగోలు చేసి రెండుమాసాలు గడిచినా ఇంతవరకు రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదన్నారు. మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని, ధాన్యం ఎగుమతి విషయంలో లారీల యజమానులు రైతుల నుంచి ఒక్కోబస్తాకు రూ.20నుంచి రూ.80ల వరకు వసూలు చేస్తున్నారని, తక్షణం అదనపు వసూళ్లను నిలిపివేయాలని, మిల్లర్లు కోతల పేరుతో జరుగుపున్న మోసాలను అరికట్టాలని హేమంతరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, సిపిఐ, రైతు సంఘాల నేతలు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా, ఏపూరి రవీంద్రబాబు, పగడాల మల్లేష్, పావులూరి మల్లికార్జున్, కూచిపూడి రవి, ఏనుగు గాంధీ, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పుచ్చకాయల సుధాకర్, వరదా నర్సింహారావు, దొబ్బల వెంగళరావు, బాగం మాధవరావు, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ పాల్గొన్నారు.

## ఐకెపి సెంటర్ల నుంచి కొనుగోలు చేసిన

# ధాన్యాన్ని తక్షణమే తరలించాలి

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ఐకెపి సెంటర్లలో కొనుగోళ్లు జరిగి నిల్వ ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే మిల్లులకు తరలించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. గురువారం యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సత్యంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ ఐకెపి సెంటర్ల లో కొనుగోలు చేసిన ధాన్యం కుప్పలు తెప్పలుగా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. ధాన్యం నిల్వ ఉండటం వల్ల తరుగుదల పెరగడమే కాకుండా, అకాల వర్షాలు కురిస్తే రైతులు కోలుకోలేని విధంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైస్‌మిల్లుల యాజమాన్యాలు ధాన్యం దిగుమతి చేసుకోవడంలో తీవ్ర జాప్యం చేస్తున్నాయి. దీనివల్ల రైతులు సెంటర్ల వద్దే పడిగాపులు కాస్తూ ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మిల్లు ల్లో జరుగుతున్న ఆలస్యాన్ని నివారించి, ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రభుత్వం నామినేటెడ్ పాలక మండళ్లను ఏర్పాటు చేయాలని చూడటం సరికాదని, ఎన్నికలు జరిపి రైతులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కొల్లూరి రాజయ్య, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి బండి జంగమ్మ, రైతు సంఘం మండల కార్యదర్శి పేరబోయిన బంగారి, నాయకులు బబ్బూరి శ్రీధర్, పేరబోయిన పెంటయ్య, కోకల రవీందర్, గుండు వెంకటేష్, తుమ్మల ఇస్తారీ, ముక్కెరల పెంటయ్యస్వామి పాల్గొన్నారు.

**భువనగిరి రూరల్ :** హమాలీల కొరత తీర్చి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. భువనగిరి పట్టణంలోని బొమ్మాయిపల్లిలో ఐకెపి కేంద్రాన్ని రైతుసంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఒకే కాంట ఉండటంతో ధాన్యం కుప్పలు నెలరోజులుగా ఉన్నాయని, ఆరుగాలం కష్టపడిన రైతులకు ప్రయోజనం దక్కాలంటే ధాన్యం కొనుగోలు చేయాలని, మిల్లులలో దిగుబడి వేగవంతం చేయాలని పశ్య పద్మ డిమాండ్ చేశారు. అనంతరం బొమ్మాయిపల్లి కొనుగోలు కేంద్రంలో నెలకొన్న సమస్యలపై కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొల్లూరి రాజయ్య, ఉపాధ్యక్షులు జక్క దయాకర్‌రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, శాఖ కార్యదర్శి చింతల పెంటయ్య, నాయకులు ఏదునూరి శంకర్, రైతులు గజ్జి రమేష్, పర్వత శేఖర్, మమత, కడారి హేమలత పాల్గొన్నారు.

## పరపతి సంఘాలకు ఎన్నికలు జరపాల్సిందే

సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గురువారం రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ ఆర్‌డిఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, నామినేటెడ్ పద్ధతి సరైంది కాదని అన్నారు. వ్యవసాయం మీద ఆధారపడి రైతులు నూటికి నూరుశాతం మంది ఉన్నారని, వారికి అందుబాటులో ఉండేలా గ్రామీణ బ్యాంకు కృషి చేస్తుందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రభుత్వం నామినేటెడ్ పాలక మండళ్లను ఏర్పాటు చేయాలని చూడటం సరికాదని, ఎన్నికలు జరిపి రైతులకు మేలు చేయాలని బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు, రైతు సంఘం పట్టణ కార్యదర్శి మామిడి వెంకయ్య, కౌన్సిలర్ చెనగాని సైదులు, ఇందిరాల వెంకటేశ్వర్లు, కుడితోట్టి స్వామి, బంటు శ్రీనివాస్, బత్తిని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ భద్రత లేని మధ్యాహ్న భోజన వంట కార్మికులు

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఉద్యోగ భద్రత లేక మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళనకు గురవుతున్నారని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కార్యాలయం కొమురయ్య భవన్‌లో కొరిమి సుగుణ అధ్యక్షతన జరిగిన మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ద్వితీయ మహాసభలో జంపాల రవీందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సెంట్రలైజ్డ్ కిచ్చెన్ విధానం పేరుతోని వంట కార్మికుల ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నదని ఆరోపించారు. మహాసభలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా మాదాటి పద్మ, కొరిమి సుగుణను ఎన్నుకున్నారు. సభలో రంగు వేణు కుమార్, స్వర్ణలత, పరుమాండ్ల పద్మ, పి.రాజేశ్వరి, రాధ, రమ, ప్రమీల, తిరుమల, జయ, సుగుణ, స్వాతి, విజయ, రాజేశ్వరి, విజయ, పుష్ప, మల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.




## సిపిఐలో పలువురు చేరిక




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రఘునాథపాలెం మండలానికి చెందిన పలువురు సిపిఐలో చేరారు. గురువారం బైపాస్ రోడ్డులోని సిపిఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కెసిఆర్ కాలనీ, చిమ్మపుడి గ్రామాలకు చెందిన నాదెండ్ల పుల్లయ్య, కుంచం నాగరాజు, గుండ్లం అశోక్ తదితరులు సిపిఐలో చేరారు. పార్టీలో చేరిన వారికి సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డిలు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ సిపిఐ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాటాలు నిర్వహించాలన్నారు. పార్టీలో చేరిన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చింతల రమేష్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఎఐవైఎఫ్ నాయకులు ఇంద్రసేన తదితరులు పాల్గొన్నారు.

## భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలని..

# వరంగల్‌లో ఎఐవైఎఫ్ నిరసన

**ప్రజాపక్షం/వరంగల్ :** కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలని గురువారం ఎఐవైఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించి, దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ బాలిక పై జరిగిన అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు సాయి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులు అత్యంత ఆందోళనకరమన్నారు. రాజకీయ అండదండలు ఉన్నా లేకపోయినా నేరస్తులపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్, జగదీష్, మతీన్ కాకా, రమేష్, లక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు.



## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన 64 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల చెక్కులను ప్రభుత్వవిప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 'రాష్ట్ర ప్రభుత్వం పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లల వివాహానికి ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోంది. ఒక్కో లబ్ధిదారునికి రూ.1,00,116 ఆర్థిక సహాయం అర్హులైన ప్రతి కుటుంబానికి అందిస్తుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల గడపగడపకు చేరేలా కృషి చేస్తున్నాం'అని పేర్కొన్నారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లి భారం కాకూడదనే ఈ పథకం తీసుకొచ్చాం. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే డబ్బు జమ చేస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిగిరెడ్డి మల్లారెడ్డి, భిక్షం రెడ్డి, ఎంపీడీఓ, తహశీల్దార్ వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అర్హులయిన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** అర్హులయిన అందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం ఆయన కొండమల్లేపల్లి పట్టణంలో అంగన్‌వాడీ భవన నిర్మాణంకు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణ పనులకు, ఇందిరమ్మ ఇళ్లుకు ప్రజా ప్రతినిధులతో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం ఎంఎల్ఏ మాట్లాడుతూ ప్రజా పాలనలో అర్హులయిన అందరికి ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు. దేవరకొండ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని అన్నారు. ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేస్తామని, ఏ ఒక్క రైతుకు కూడా ఇబ్బంది కలుగకుండా చివరి గింజ వరకు కొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి, వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, నాయిని మాధవ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి, ఇంచార్జి డిపివో శంకర్‌నాయక్, తహశీల్దార్ నరేందర్, ఎంపిడివో స్వర్ణలత, ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు తదితరులుతదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ తనిఖీలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలోని శివాజీనగర్,రామగిరి,హైదరాబాద్ రోడ్, ఎన్‌జీ కళాశాల పరిసరాల్లో బుధవారం ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు,అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.వీధి వ్యాపారులు,టీ దుకాణాలు,ఫుడ్ కార్టు, బేకరీలు,హోటళ్లను తనిఖీ చేసిన అధికారులు వంట నూనెలను టీపీసీ మీటర్‌తో పరీక్షించారు.టీ పొడి,పాలు,మిరప పొడి,పసుపు,తాగునీటి నమూనాలను కూడా పరీక్షించారు.ఆహార తయారీ,నిల్వ,విక్రయాల్లో పరిశుభ్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు.వ్యాపారులు గ్లౌజులు,హెడ్ క్యాప్స్ వాడి,చేతులు శుభ్రం చేసుకుని ఆహార పదార్థాలను మూతపెట్టి ఉంచాలని చెప్పారు.వాడిన వంట నూనెలను పూర్తిగా తొలగించి కొత్త నూనెలను వాడాలని,టీపీసీ శాతం 25 మించకూడదని తెలిపారు. వాడిన నూనెలను రూకో పథకం కింద నమోదైన అగ్రిగేటర్లకే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఎన్. శివశంకర్ రెడ్డి, ఎం.వెంకటపతి, డ్రైవర్ పి. వంశీ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



**ప్రజాపక్షం/మోతె:** మండల కేంద్రానికి చెందిన చర్లపల్లి చరణ్ (22), దోసపాటి కళ్యాణ్ (23) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సీలేరులో బైక్‌పై వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయాలు కావడంతో చరణ్ ఘటనా స్థలంలో మృతి చెందగా, కళ్యాణ్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వివరించారు.

## కిష్టాపురంలో తల్లి, కుమారుడు మృతి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కిష్టాపురం గ్రామ సమీపంలోని రహదారిపై గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దామరచర్ల మండలం సాత్‌తండాకు చెందిన మాలోతు సుజాత(40)కు కంటి పరీక్షల నిమిత్తం కుమారుడు మాలోతు చంటి గురువారం ఉదయం మిర్యాలగూడకు ద్విచక్ర వాహనంపై వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం తిరిగి వారి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మార్గమధ్యలో మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామ శివారులోని అన్నపూర్ణ రైస్ మిల్లు వద్ద మధ్యాహ్నం 12.15గంటలకు వెళ్లేసరికి నార్కట్‌పల్లి అద్దంకి రహదారిపై మిర్యాలగూడ వైపు నుంచి దామరచర్ల వైపుకు వెళ్తున్న డీసీఎం డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడిపి మోటార్ సైకిల్‌పై వెళ్తున్న సుజాత, చంటిలను వెనుక నుంచి ఢీకొట్టగా ఇద్దరు కింద పపోగా వారి నుంచి డీసీఎం వాహనం వెళ్లిపోవడంతో మాలోతు సుజాత తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందగా చంటికి తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం 1.45గంటలకు మృతిచెందాడు. ఈ మేరకు మాలోతు రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా సంఘటన స్థలాన్ని సీఐ ప్రసాద్, ఎస్ఐ లక్ష్మయ్య పరిశీలించారు.

# ధాన్యం సేకరణలో లారీ కాంట్రాక్టర్లు ''ఇబ్బంది పెడితే సహించం''

అన్ని రకాల వాహనాలతో కొనుగోళ్ల వేగవంతం : మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి
ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ధాన్యం సేకరణపై ప్రత్యేక సమీక్ష
లారీలు, హమాలీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ చర్యలు
రైస్ మిల్లులను తనిఖీ చేసిన మంత్రులు



**ప్రజాపక్షం/నల్లగొండ :** ధాన్యం సేకరణలో ట్రాన్స్‌పోర్ట్ లారీ కాంట్రాక్టర్లు ఇబ్బందులు సృష్టిస్తే సహించేది లేదని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు.రబీ ధాన్యం సేకరణను వేగవంతం చేసేందుకు అవసరమైతే అన్ని రకాల వాహనాలను వినియోగించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. హమాలీల కొరతను అధిగమించేందుకు స్థానిక కూలీలను వినియోగించుకోవాలన్నారు.గురువారం ఉమ్మడి నల్లగొండ జిల్లా ధాన్యం సేకరణపై నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,అధికారులు హాజరయ్యారు.ఈసందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే పది రోజులపాటు ధాన్యం సేకరణపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. లారీలు, హమాలీల సమస్యలను ప్రభుత్వం అధిగమిస్తోందని, జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలు,సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కొనుగోళ్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగేలా చూడాలని తెలిపారు.శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ నాగార్జునసాగర్,మిర్యాలగూడ ప్రాంతాల్లో సన్నధాన్యం అధికంగా వస్తుండటంతో అక్కడ సమస్యలు తక్కువగా ఉన్నాయని,నల్లగొండ,నకిరేకల్,దేవరకొండ,తుంగతుర్తి ప్రాంతాల్లో ధాన్యం ఎక్కువగా రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ అత్యవసర సేవలు మినహా ఇతర శాఖల అధికారులను కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద నియమించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ఎక్కువ లారీలు అవసరమైన కేంద్రాలను గుర్తించి అక్కడికి అదనపు వాహనాలు పంపాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం లారీల వినియోగంపై ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించగా,తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఈసారి దిగుబడులు పెరిగినందున రైతులు ఆన్‌లైన్‌లో 100 బస్తాల వరకు బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ దేవరకొండ నియోజకవర్గంలో మిల్లులు ఇప్పటికే ధాన్యంతో నిండిపోయాయని, కొత్త ధాన్యానికి నిల్వ సౌకర్యాలు కల్పించాలని సూచించారు.అంతకు ముందు మంత్రులు నల్లగొండ సమీపంలోని బాలాజీ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసి ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలి.

**గ్రేడ్ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం:** ఉమ్మడి నల్లగొండ జిల్లా ధాన్యం సేకరణ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని కోరారు.మిల్లర్లు గ్రేడ్ తగ్గిందనే కారణాలతో రైతుల ధాన్యాన్ని తిరస్కరించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి ధాన్యం నిల్వ ఉండడంతో వర్షాలకు తడిసి రంగు మారుతున్నదని, దీనివల్ల రైతులకు మరింత ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు.లారీల కొరత, హమాలీల సమస్య కారణంగా ధాన్యం మిల్లులకు తరలింపులో జాప్యం జరుగుతోందని,రైతులు రాత్రింబవళ్లు కొనుగోలు కేంద్రాల వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ధాన్యం అమ్మకానికి వచ్చిన రైతులు తినడానికి, పడుకోవడానికి సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ధాన్యం తేమ శాతం, గ్రేడ్ పేరుతో కోతలు విధించకుండా ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని,ప్రతి కొనుగోలు కేంద్రంలో అధికారులు అందుబాటులో ఉండి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## క్రీడల్లో యువత రాణించాలి : ప్రభుత్వ విప్ వేముల వీరేశం




**ప్రజాపక్షం/నకిరేకల్:** యువత క్రీడల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ క్రికెట్ శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో చౌగోని శ్రీనివాస్, యాసారపు వెంకన్న, మతీన్, ప్రజాప్రతినిధులు, క్రీడా నిర్వాహకులు పాల్గొన్నారు.

## జనాభా గణన, గృహ జాబితాకు సహకరించాలి

కలెక్టర్ బి.చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న జనాభా గణన, గృహ జాబితా కార్యక్రమానికి నగర ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, నగర మేయర్ బుర్రి చైతన్యశ్రీనివాస్ రెడ్డి సూచించారు. జనాభా గణన,గృహ జాబితా స్వీకరణలో భాగంగా మున్సిపల్ సిబ్బంది గురువారం నల్లగొండలోని మేయర్, జిల్లా కలెక్టర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి నివాసాలకు వెళ్లి గృహ జాబితా ఎన్యుమరేషన్ ప్రక్రియను నిర్వహించారు.ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వీయ గణన చేయని కుటుంబాలు ఇంటింటికి వచ్చే ఎన్యుమరేటర్లకు పూర్తి వివరాలు అందించాలని సూచించారు.ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను నమోదు చేసి ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారని తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలు లేకుండా అధికారులకు సహకరించాలని కోరారు. జనాభా గణన ఆధారంగా భవిష్యత్ ప్రభుత్వ సంక్షేమ, మౌలిక వసతులు అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికలు రూపొందించబడతాయని తెలిపారు.ప్రతి ఒక్కరు జనాభా గణన, గృహ జాబితా సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నగర ప్రజలు జనాభా గణన ప్రక్రియకు సహకరించి ఇంటింటికి వచ్చే ఎన్యుమరేటర్లకు సరైన వివరాలు అందించాలని కోరారు. స్వీయ గణన పూర్తి చేసిన కుటుంబాలకు హెచ్ అక్షరంతో ప్రారంభమయ్యే 11 అంకెల గుర్తింపు సంఖ్య లభిస్తుందని,ఆ సంఖ్యను తప్పని సరిగా ఎన్యుమరేటర్లకు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ బి.శరత్ చంద్ర,అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణవేణి, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఆఫీసర్ రెహమాన్, సంబంధిత ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పాలక మండళ్ల నియామకం 'ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం'




**ప్రజాపక్షం/గరిడేపల్లి:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా తమ పార్టీ కార్యకర్తలు పాలకవర్గ సభ్యులుగా నామినేటెడ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నామినేటెడ్ పాలకవర్గాలను ప్రభుత్వం నియమించడానికి వ్యతిరేకంగా రైతు సంఘం రాష్ట్ర కమిటి పిలుపు మేరకు మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ శ్రవంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పడిన నాటి నుండి ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలను నిర్వహించి, ఎన్నికైన పాలక మండలి సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి త్రిపురం సుధాకర్‌రెడ్డి, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఎడ్ల అంజన్‌రెడ్డి, పోకల ఆంజనేయులు, అంబటి వెంకటరెడ్డి, ఎడవల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఆత్మహత్య కేసును ఛేదించిన టూటౌన్ పోలీసులు




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణ పరిధిలో ని పానగల్‌కు చెందిన వాంకుడోత్ తార అనే ట్రాన్స్‌జెండర్ ఆత్మహ త్య ఘటనకు సంబంధించి నల్లగొండ టూ టౌన్ పోలీసులు వేగంగా స్పందించి కీలక నిందితులను గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ వై సైదులు మాట్లాడుతూ ఈ కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ధరావత్ పాండు నాయక్, గుగులోత్ సురేష్ అనే ఇద్దరు వ్యక్తులు ట్రాన్స్‌జెండర్ తారను మానసికంగా వేధింపులకు గురిచేసినట్లు విచారణలో వెలుగులోకి వచ్చిందని తెలిపారు. వారి వేధింపుల కారణంగానే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి న టూ టౌన్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని తెలిపారు.ఈ ఆపరేషన్‌లో టూటౌన్ సిబ్బంది చురుకుగా పాల్గొని కేసును వేగంగా ఛేదించడం అభినందనీయం అని ప్రజల భద్రత, బాధితులకు న్యాయం కల్పించడం కోసం టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎల్లప్పుడూ అప్రమత్తంగా పనిచేస్తుందని తెలిపారు.

## రూ.1.20లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ పట్టణంలోని 3వ వార్డులో ఎన్‌హెచ్ 167 నుండి గాజీనగర్ బిటి రోడ్డు వరకు నగరాభివృద్ధి నిధుల నుండి రూ. 1.20లక్షలతో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం పట్టణంలోని బాష్పక సుమలత విజయ్ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ఇంటి యజమానికి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అభివృద్ధి పనులకు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, సిసి రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం లేకుండా అధికారులు పరిశీలించాలని, లోపం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు శక్తవంచనలేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఆడబిడ్డలు ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తే ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరుస్తుందని మహిళ సాధికారత పెరిగితే తెలంగాణ ప్రగతి మరింత వేగంగా పరుగులు తీస్తుందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్టర్ తప్పనిసరి

**ప్రజాపక్షం/నడిగూడెం:** సిరిపురం రైతు వేదికలో క్లస్టర్ పరిధిలోని రైతులందరూ తప్పని సరిగా ఈనెల 30 లోపు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎఈవో రేణుక సూచించారు. ఫార్మర్ రిజిస్టర్ చేయడం ద్వారా ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక పథకాలను పొందవచ్చని అన్నారు. ఫార్మర్ రిజిస్టేషన్ చేయకపోతే యూరియా బుకింగ్, పిఎం కిషాన్, రైతు భరోసా, పంటల భీమా వంటి ప్రభుత్వ పథకాలను రైతులకు వర్తించవని అన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయకపోతే యూరియా బుకింగ్, పిఎం కిసాన్, రైతు భరోసా, పంటల బీమా వంటి ప్రభుత్వ పథకాలు రైతులకు వర్తించవని అన్నారు.

# సూర్యాపేట మున్సిపాలిటీలో రెవెన్యూ లీలలు...!

అధికారులు దృష్టిసారిస్తే
రూ.2కోట్ల పైనే పెరిగే అవకాశం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సూర్యాపేట మున్సిపాలిటిలో రెవెన్యూ విభాగంలో పనిచేసే ఉద్యోగులు ఇంటి పన్నుల విధింపుల్లో తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. దీంతో మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండిపడుతుంది. ఉన్నతాధికారులు, పాలకవర్గం దీనిపై దృష్టిసారిస్తే మున్సిపాలిటికి రూ.2కోట్లకు పైగా ఆస్తి పన్ను పెరిగే అవకాశాలు ఉన్నాయని బహిరంగంగానే వినిపిస్తున్న మాట.

సూర్యాపేట మున్సిపాలిటి రెవెన్యూ విభాగంలో ఒక రెవెన్యూ అధికారితోపాటు నలుగురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, 20 మంది బిల్ కలెక్టర్లు పన్ను వసూళ్లు, నూతన ఇంటి నెంబర్ల కేటాయింపు, పేరుమార్పిడి లాంటి పనులను నిర్వర్తిస్తున్నారు. మున్సిపాలిటి పరిధిలో మొత్తం 36 వేలకు పైగా నివాస గృహాలు ఉన్నాయి. ఇందులో వాణిజ్య, వ్యాపార సముదాయాలు 6వేలకు పైగా ఉండగా వీటి ద్వారా ప్రతి సంవత్సరం ఆస్థి పన్ను రూపంలో రూ.18 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుంది. 2021 వరకు మున్సిపాలిటీకి ఆస్థి పన్ను ద్వారా మొత్తం రూ.6 కోట్లకు పైగా ఆదాయం మాత్రమే రాగా, నాటి ప్రభుత్వం భువన్ యాప్‌ను అమల్లోకి తెచ్చి రెండు దఫాలుగా సర్వే చేయించడంతో పన్ను ద్వారా ఆదాయం రూ.12 కోట్లకు చేరింది. అనంతరం పట్టణంలో భవన నిర్మాణాలు పెరుగుదలతో ఆదాయం క్రమేణా రూ.18 కోట్లకు పెరిగింది.

భవన నిర్మాణం పూర్తికాగానే దానికి ఇంటి నెంబర్ కేటాయించాల్సి ఉంటుంది. ఈ నెంబర్ కేటాయించిన వెంటనే దానికి సంబంధించిన పన్నులు కూడా నిర్ణయించాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా భవనం కొలతల ప్రకారం దీనిని ఖరారు చేయాల్సిన అధికారులు భవన యజమానులతో బేరసారాలాడుతూ పన్నులను తక్కువగా వేస్తూ మున్సిపాలిటీకి రావల్సిన ఆదాయాన్ని గండికొడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా సూర్యాపేట ఈద్గా రోడ్డులో ఓ ప్రముఖ పారిశ్రామిక వేత్త పాత మిల్లు భవనాన్ని కూల్చివేసి దాని స్థానంలో సెల్లార్‌తోపాటు నాలుగు అంతస్తులలో భవనాన్ని నిర్మించారు. ఈ నిర్మాణం పూర్తి అయిన తరువాత ఓ ప్రముఖ బ్రాండెడ్ రెడిమేడ్ షోరూమ్‌కు అద్దెకు ఇచ్చారు. ఇది గత దసరా పండుగ రోజున ప్రారంభం కూడా అయ్యింది. దాదాపు 8 నెలల అవుతున్నా పన్ను వేసిన దాఖలాలు లేవు. దీనికి పాత ఇంటి నంబర్ ఉండడంతో దానినే కొనసాగిస్తున్న పరిస్థితి. దీనికి సంవత్సరానికి కేవలం రూ.45వేల 603లు మాత్రమే ట్యాక్స్ ఉంది. పాత భవనాన్ని కూల్చివేశామని దానికి ఉన్న ట్యాక్స్‌ను రద్దు చేయాలని సదరు యజమాని మున్సిపాలిటీకి దరఖాస్తు చేసుకోగా 2023–24, 2024–25 సంబంధించిన ట్యాక్స్‌ను రద్దు చేశారు. అయితే రూ.1,35,412 లు బాకీ పడి ఉన్నట్లుగా డిమాండ్ నోటీసులో చూ పుతున్నా మొత్తాన్ని వసూలు చేయలేదు. సామాన్యులు పన్నులు చెల్లించకుంటే ఇండ్లను జప్తు చేసే మున్సిపల్ అధికారులు వీరిపట్ల ఉదాసీన వైఖరిని అవలంభిస్తున్నారు. పాత దానిని తొలగించి నూతనంగా నిర్మించిన ఈ షోరూం భవనానికి ఉద్యోగులు కొలతలు తీసుకొని పన్ను విధిస్తే మున్సిపాలిటికి ఏడాదికి రూ.5 లక్షలకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని అదే విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు చెబుతున్నారు. 38వ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ గండూరి రమేష్ దీనిని వెలుగులోకి తెచ్చారు. దీంతో రెవెన్యూ విభాగం ఉద్యోగుల అవినీతి బాగోతం బట్టబయలైంది. ఇదిలాఉండగా సూర్యాపేట మున్సిపాలిటిలోని జనగాం క్రాస్ రోడ్డులో, గాంధీనగర్, కృష్ణాకాలనీలలో ఉన్న ఫంక్షన్ హాల్స్‌తోపాటు ఇతర ఫంక్షన్ హాల్స్‌కు, అనేక ప్రైవేటు విద్య, వైద్య సముదాయాల భవనాలకు కూడా రెవెన్యూ ఉద్యోగులు నామమాత్రపు పన్ను వేయటంతో మున్సిపాల్ ఆదాయానికి గండి పడుతున్నది ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకపోతే గతంలో నూతనంగా ఇండ్ల నిర్మాణాలు చేసుకొన్న కొందరు కింద నిర్మాణం చేసుకొని పైన స్లాబ్ వేసి వదిలి వేసిన వారు, రెండు అంతస్తులు నిర్మించిన తరువాత అదనంగా పన్నులు పెంచాల్సి ఉన్నా నేటికి పాత పన్నులు మాత్రమే వసూలు చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు,పాలకవర్గం దృష్టిసారిస్తే రూ.2కోట్ల పైనే పెరిగే అవకాశం:** ఉన్నతాధికారులు, మున్సిపాల్ పాలకవర్గం దీనిపై దృష్టిసారిస్తే ఉద్యోగుల అవినీతికి అడ్డుగట్ట పడడంతోపాటు అదనంగా మున్సిపాలిటీకి ఆస్తిపన్ను రూపంలో మరో రూ.2 కోట్లు ఆదాయం పెరిగే అవకాశం ఉందని మున్సిపల్ అధికారులే స్వయంగా చెబుతున్న పరిస్థితి.

**విచారణ చేపడుతాం : రెవెన్యూ అధికారిణి కళ్యాణి**
రెవెన్యూ విభాగంలో ఉద్యోగులపై వస్తున్న అవినీతి, అక్రమాల ఆరోపణలపై విచారణ చేపడుతామని సూర్యాపేట మున్సిపల్ రెవెన్యూ అధికారిణి కళ్యాణి చెప్పారు. రెవెన్యూ విభాగంలో అవినీతి లీలలపై ఆమెను వివరణ కోరగా పై విధంగా స్పందించారు. ప్రజల నుండి ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించి ప్రభుత్వ ఆదాయం పెరుగుదలకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈద్గా రోడ్డులోని రెడిమేడ్ షోరూమ్‌కు నూతనంగా ఆస్తి పన్ను ఖరారు చేయడం పని ఒత్తిడితో ఆలస్యం జరిగిందని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో ఆస్తి పన్ను ఖరారు చేస్తామని చెప్పారు.

## అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

### పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** స్టేషన్ అధికారులు అంకితభావంతో పని చేస్తూ ప్రజల అభిమానాన్ని పొందాలని వరంగల్ సిపి సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీతిసింగ్ ఆదేశాల మేరకు హసన్ పర్తి, కాజీపేట పోలీస్ స్టేషన్ల నూతన ఇన్స్ స్పెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన ఇన్స్పెక్టర్లు మహేందర్, శ్యాంసుందర్ గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను సిపి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల మొక్కను అందజేశారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నిజాయితీతో విధులు నిర్వహిస్తూ, బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ, పోలీస్ స్టేషన్లో న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని బాధితులకు కలిగించాలని పోలీస్ కమిషనర్ నూతన ఇన్స్ స్పెక్టర్ల కు దిశా నిర్దేశం చేశారు.

## ప్రైవేట్ పాఠశాలలకు.. దీటుగా నాణ్యమైన విద్య

### కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాక్షం/దుగ్గొండి :** ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని మల్లంపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని, బడిబాట ర్యాలీ, ఇంటింటి ప్రచారం గురువారం నిర్వహించారు.విద్యార్థులకు సమతుల పౌష్టికాహారం, అవసరమైన మౌలిక వసతులు, అర్హత కలిగిన ఉపాధ్యాయుల ద్వారా ఉత్తమ బోధన అందుతున్నందున ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. మల్లంపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదివిన విద్యార్థిని కావ్యశ్రీ ఎస్సెస్సీ పరీక్షల్లో 566 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానం, జడ్పీ పాఠశాలల విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించడం అభినందనీయమన్నారు. పాల్గొన్న పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, ఆర్జేడి సత్యనారాయణ రెడ్డి, డిఇవో రంగయ్య నాయుడు , దుగ్గొండి తాసిల్దార్ సమ్మక్క, ఎంపీడీవో, సిఎంఓ డాక్టర్ శ్రీనివాస్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, జడ్పిహెచ్ఎస్ మల్లంపల్లి ప్రధానోపాధ్యాయురాలు అజ్మీర భార్గవి, సంబంధిత అధికారులు గ్రామ ప్రజలు పిల్లలు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోళ్లపై పర్యవేక్షణ

### రైతులకు భరోసా ఇచ్చిన గూడూరు సిఐ వినయ్‌కుమార్



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను గురువారం గూడూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ వినయ్ కుమార్ ఎస్ఐ రాజకుమార్ పరిశీలించారు. జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు కేంద్రాలను సందర్శించిన అధికారులు రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద భారీగా నిల్వ ఉన్న మొక్కజొన్నను త్వరితగతిన తరలించేందుకు చర్యలు చేపడుతున్నామని సిఐ వినయ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం లారీల కొరత కారణంగా కొంత ఆలస్యం జరిగినప్పటి రాబోయే రెండు మూడు రోజుల్లో అదనపు లారీలను ఏర్పాటు చేసి నిల్వధాన్యాన్ని పూర్తిస్థాయిలో తరలించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులు ఆందోళనకు గురికాకుండా సహనంతో ఉండాలని ప్రభుత్వం మరియు సంబంధిత శాఖలు సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా పోలీసు శాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని తెలిపారు.రైతులు తమకు ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని అధికారుల హామీ ఇచ్చారు.

## 5 ఇంక్లైన్ గని –1 సిమ్‌లో మ్యాన్ రైడింగ్ ప్రారంభించాలి

### ఎఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఆసిఫ్ పాషా

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి ఏరియాలోని 5 ఇంక్లైన్ గని 1 సిమ్ లో మ్యాన్ రైడింగ్ వెంటనే ప్రారంభించాల సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఆసిఫ్ పాషా డిమాండ్ చేశారు. కెటికె 5 ఇంక్లైన్ గనిలో పిట్ సెక్రటరీ వి.రాజేందర్ అధ్యక్షతన గని మేనేజర్ ఎం.రమేష్ ఎఐటీయూసీ నాయకులు ఆసిఫ్ పాషా కార్మిక సమస్యల పరిష్కారం కోరుతూ మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ పాషా మాట్లాడుతూ, గనిలోని 1S/SS2 డిస్ట్రిక్ట్‌కు వెళ్లే మ్యాన్ రైడింగ్ పొడిగింపు అనివార్య కారణాల వల్ల నిలిపివేయడంతో కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కావున వెంటనే మ్యాన్ రైడింగ్ పనులను ప్రారంభించి కార్మికులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే కాలపరిమితి ముగిసిన ఎల్ఈడి క్యాప్ లాంప్‌లను ల్యాంప్ రూమ్ నుండి తొలగించి, కొత్త క్యాప్ లాంప్‌లను కార్మికులకు అందించాలని కోరారు.అదేవిధంగా కోల్ డ్రిల్ బిట్స్, స్టోన్ డ్రిల్ బిట్స్, డ్రిల్ రాడ్స్, బ్రాడీస్ క్లాత్, బోల్డర్ డ్రిల్ బిట్స్ తదితర సామగ్రి కొరతను తొలగించి కార్మికులు ఇబ్బందులు లేకుండా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గని మేనేజర్‌కు మెమొరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఆర్గనైజ్ సెక్రటరీ గోవిందుల తిరుపతి, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ నారాయణ మూర్తి, ఆస్టెంట్ పిట్ సెక్రటరీ నాగేంద్ర బాబు, టెంపుల్ కమిటీ చైర్మన్ బుద్దిరపు రాయమల్లు, మైన్స్ కమిటీ మెంబెర్స్ అఖిల్, సమ్మిరెడ్డి, రమేష్, రాజు, రాజేష్, వంశీ, కొండల్, సాయితేజ, సాయికృష్ణ , దిలీప్, సునీల్ తదితర నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



# ప్రతి సమస్యనూ క్షేత్రస్థాయిలో పరిష్కరిస్తాం

### ప్రజాదర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన
### మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:** ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన ప్రతి సమస్య దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని, గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించడానికి స్థానిక గ్రామాలకే జిల్లా యంత్రాంగం కదిలి వస్తుందని, ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని, కన్నాయిగూడెం మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో 10 గ్రామాల ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కన్నాయిగూడెం మం డలం లక్ష్మీపురం, గ్రామంలోని నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం మైదానంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో తుపాకులగూడెం, లక్ష్మి పురం, రాజన్నపేట, గ్రామాల ప్రజల నుంచి, ముప్పనపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో ముప్పనపల్లి, బుట్టాయిగూడెం, ఐలాపురం, చింతగూడెం, సర్వాయి, కంతనపల్లి, ఏటూరు గ్రామాల ప్రజల నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఐటిడిఏ, పిఓ, లెనిన్ వత్సల్ టోప్పో, తో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం గ్రామంలో 20 లక్షల అంచనా విలువతో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని, సిఆర్ఆర్ ప్లెయిన్ నిధులతో 60 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయిన్స్ లను, ముప్పనపల్లి గ్రామంలో బోరుగూడెం నుండి ఎస్టి, కాలనీ వరకు ఎస్‌టి, ఎస్‌డి, ఎఫ్ 145.00 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు, సిఆర్ఆర్‌ప్లెయిన్ నిధులతో 115.00 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన అంతర్గత సిసి, రోడ్లు, డ్రెయిన్స్ లను మంత్రి అనసూయ సీతక్క, ఐటిడిఏ, పిఓ లెనిన్ వత్సల్ టోప్పో తో కలిసి ప్రారంభించి, నూతన అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భాల్లో మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రజల సమస్యలను వారి చెంతనే పరిష్కరించాలనే లక్ష్యంతో కన్నాయిగూడెం మండలంలో రెండు ప్రధాన కేంద్రాల్లో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. ముప్పనపల్లి, దేవాదుల లక్ష్మి పురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా 10 గ్రామాల సర్పంచ్ లు ఆయా గ్రామాలకు కావలసిన అభివృద్ధి పనులు స్థానిక సమస్యలను వివరించడం జరిగిందని, గ్రామస్తుల నుంచి నేరుగా వారి సమస్యలను తెలుసుకుంటూ దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడం కోసం జిల్లా కేంద్రానికి దూరంగా, వెనుకబడిన ప్రాంతంగా ఉన్న కన్నాయిగూడెం మండల ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బంది లేకుండా అధికారులే నేరుగా గ్రామాలకు తరలివచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. స్థానిక సర్పంచులు, ప్రజల నుంచి నేరుగా గ్రీవెన్స్ స్వీకరించి, సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కార మార్గాలను సూచించడం జరుగుతుందని, ఇతర సమస్యలు, సాంకేతిక ఇబ్బందులు ఉన్న సమస్యలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు జోడెద్దుల వలె కలిసి పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డిఓ వెంకటేష్, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తహసిల్దార్, సయ్యద్ సర్వర్, యంపిడిఓ, సజిదా బేగం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## త్వరితగతిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

### కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే గృహ నిర్మాణాలను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా, జూన్ 2న నిర్వహించనున్న మాస్ గృహప్రవేశాలు, ఇల్లు మంజూరై నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారుల అంశాలపై గృహ నిర్మాణ శాఖ, మున్సిపల్, ఎంపీడీవోలు తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎటువంటి ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జూన్ 2న మాస్ ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశాలు నిర్వహించాల్సి ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథకం నిధులను త్వరితగతిన మంజూరు చేయాలని డిఆర్డీఓకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, గృహ నిర్మాణ శాఖ డిఈ శ్రీకాంత్, ఎంపీడీఓలు, గృహ నిర్మాణ శాఖ ఏఈలు డీఈలు పాల్గొన్నారు.

# వైద్య రంగానికి సర్కార్ పెద్దపీట

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** విద్య రంగానికి ప్ర భుత్వం పెద్దపీట వేస్తుందని భూపాలపల్లి ఎ మ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించి న హెల్త్ క్యూబ్ డయాగ్నస్టిక్ డివైసెస్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలకు నాణ్యమైన, తక్షణ వైద్య సేవ లు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు. జిల్లా వ్యా ప్తంగా ప్రజలకు త్వరితగతిన వైద్య పరీక్షలు మి ర్వహణకు 50 హెల్త్ క్యూబ్ దయాగ్నస్టిక్ డివైసెస్ కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కిట్ల ద్వారా 16 రకాల వైద్య పరీక్షలు నిర్వహించవచ్చని అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తక్ష ణ రోగ నిర్ధారణ పరీక్షలు చేసి సమయానికి చికిత్స అందించడానికి ఈ పరికరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీడీఎల్ పరిశ్రమ సిఎస్ఆర్ నిధుల ద్వారా ఈ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సిఎస్ఆర్ నిధులతో ప్రధాన ఆసుపత్రిలో వెంటిలేటర్లు, ఎంఆర్ఐ, సిటీ స్కాన్, సాంకేతిక నిపుణులు ఏర్పాటు వంటి ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం 203 పోస్టులను మంజూరు చేయించగా, రూ.14 కోట్ల వ్యయంతో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పల్లె దవాఖానాల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువవుతాయని, అసంపూర్తి భవనాలను త్వరితగతిన పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. సిఎస్ఆర్, డిఎంఎఫ్‌టిఎస్‌డిఎఫ్ నిధులను వైద్య రంగ అభివృద్ధికి వినియోగిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఆరోగ్యంగా ఉం డేలా వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేసి మం చి పేరు తెచ్చుకోవాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి సబ్ సెంటర్‌లో వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కిట్ల ద్వారా 16 రకాల వైద్య పరీక్షలను అక్కడికక్కడే నిర్వహించవచ్చని అన్నారు. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి పరీక్షల కోసం నమూనాలను జిల్లా కేంద్రం లోని టి హబ్ కు పంపించాల్సి వచ్చేదని, ఇప్పుడు అక్కడే పరీక్షలు చేసి వెంటనే చికిత్స అందించే అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

## తెలంగాణ పర్యాటక మొబైల్ మ్యూజియం షురూ..

### కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్




**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పర్యాటక మొబైల్ మ్యూజియాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం ప్రారంభించారు.హనుమకొండ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ మొబైల్ మ్యూజియం మూడు రోజుల పాటు ప్రజలకు అందుబాటులో ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన ఛాయాచిత్రాలు, ప్రత్యేక ప్రదర్శనలు ఈ మ్యూజియంలో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.పర్యాటక ప్రాంతాల విశేషాలు, సందర్శనకు సంబంధించిన సమాచారం, పర్యాటకులకు అవసరమైన బ్రోచర్లు, సమాచార పుస్తకాలను కూడా మ్యూజియంలో అందుబాటులో ఉంచారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, పర్యాటక రంగాన్ని మరింతగా ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ మొబైల్ మ్యూజియాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

## అండర్ బ్రిడ్జి సమీపంలో చేపల వ్యర్థాలు




**ప్రజాపక్షం/నెక్కొండః** నెక్కొండ అండర్ బ్రిడ్జి ప్రాంతంలో చేపల వ్యర్థాల దుర్గంధానికి చెక్ నెక్కొండ అండర్ బ్రిడ్జి సమీపంలో చేపల వ్యర్థాలు పడేయడంతో తీవ్ర దుర్గందం వ్యాపిస్తూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే అంశంపై ప్రజాపక్షంలో వార్త ప్రచురితమైన వెంటనే గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి దయ్యాల సదానందంల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని చేపల వ్యర్థాలను తొలగించి, పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్ ఫౌడర్ చల్లించి శుభ్రత చర్యలు చేపట్టారు. సమస్యలపై వార్తలను ప్రచురిస్తూ స్పందన తీసుకువస్తున్న ప్రజాపక్షం పాత్రను స్థానికులు అభినందించారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి : కలెక్టర్

**ప్రజాపక్షం /జనగామ :** ఇందిరమ్మ ఇళ్ల ని ర్మాణం వేగంగా పూర్తి చేయాలని జనగామ జి ల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అధికారులతో గురువారం సమీక్ష నిర్వయించారు. జిల్లాలో మండలాల వారిగా మం జూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ప్రారంభం కానీ, మార్క్ చేయని ఇళ్ల సమాచారం వెంటనే ఇవ్వాలన్నారు. పతి స్టేజీలో పురోగతి కనిపించాలన, ఇందులకు సంబందిచి ఎఈలు కలెక్ట ర్‌కు ఇందిరమ్మ లక్ష్యాలను వివరించారు. జిల్లాకు 5656 ఇళ్లు మంజూరు కాగా 2500 ఇళ్లు సాబ్ స్థాయికి వచ్చాయన్నారు. ఇసుక ఇబ్బంది ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి మాతృనాయక్, డిఈలు, ఎఈలు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా వరద పరిస్థితులు ఎదుర్కోవాలి

### కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ప్రజాపక్షం/ములుగుః** జిల్లాలో అధిక వర్షపాతం వలన సంభవించే వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఫారెస్ట్ అధికారి వికాస్ మీనాతో కలిసి వరదల నిర్వహణకు నిర్వహించనున్న టాప్ ఎక్సర్సైజ్, మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమాలపై కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశపు గదిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సంభవించే వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలు సహాయక చర్యలు, సమన్వయ విధానాలపై విస్తృతంగా సంబంధిత శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం రోజున నిర్వహించనున్న టాప్ ఎక్సర్‌సైజ్, 18వ తేదీ సోమవారం రోజున నిర్వహించనున్న మాక్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమాలకు వివేకానంద కాలనీ, కృష్ణన్ కాలనీ, పల్సాబ్‌పల్లి, ములుగు ప్రాంతాలను ఎంపిక చేయడం జరిగిందని, వరదల సమయంలో చేపట్టాల్సిన ఎవాక్యుయేషన్ చర్యలు సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్స్, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానం, అత్యవసర పరిస్థితుల్లో వివిధ శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్లు ఆర్‌డివో అధికారులు, పాల్గొన్నారు.

# బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలి

### సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితుడు బండి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి పట్టణంలోని స్థానిక రావి నారాయణరెడ్డి భవన్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు. ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై పోక్సో చట్టం కింద కేసు నమోదైనప్పటికీ ఇప్పటివరకు పోలీసులు అరెస్ట్ చేయకపోవడం తీవ్ర అనుమానాలకు తావిస్తోందని అన్నారు. సాధారణ ప్రజల విషయంలో వేగంగా స్పందించే పోలీస్ వ్యవస్థ, అధికార పార్టీ నాయకుల కుటుంబ సభ్యుల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. రాజ్యాంగం ప్రకారం చట్టం అందరికీ సమానమని, అధికారంలో ఉన్నవారికోసం ప్రత్యేక నిబంధనలు ఉండవని తెలిపారు. బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, పోలీస్ శాఖపై ఉందన్నారు. పోక్సో వంటి తీవ్రమైన కేసుల్లో ఆలస్యం చేయడం వల్ల ప్రజల్లో చట్టంపై నమ్మకం తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా మహిళలు, బాలికల రక్షణ విషయంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి విడనాడాలని, వెంటనే బండి భగీరథను అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసు విషయంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా పారదర్శకంగా విచారణ జరపాలని కోరారు. సిపిఐ పార్టీ ఎప్పటికీ బాధితుల పక్షాన నిలబడుతుందని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ప్రవీణ్ తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ నాయకులు నేరెళ్ల జోసెఫ్, పోచంపల్లి మహేష్,గోలి లావణ్య, ఎండి సా బిర్, గోనెల తిరుపతి, ఐలీ శరత్, పల్లెల రజిత, పెద్దమంలో సంధ్య, వాసం రజిత, పోతుగంటి స్వప్న, మట్టి నాగమణి, మెంద్రపు సుభద్ర తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## అక్రమ పశువుల రవాణాపై.. పోలీసుల కఠిన నిఘా

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** మండలంలో అక్రమ పశువుల రవాణాను అరికట్టేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకే ఐపీఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ రవీందర్ సూచనలతో మండలంలోని కీలక ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పసర సిఐ దయాకర్ పర్యవేక్షణలో ఎస్ఐ తాజుద్దీన్ ఆధ్వర్యంలో సోమలగడ్డ క్రాస్ వద్ద ప్రత్యేక చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి వాహనాలపై విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. చెక్‌పోస్ట్ వద్ద 24 గంటల పాటు నిఘా కొనసాగిస్తూ అనుమానాస్పద వాహనాలను ఆపి తనిఖీలు చేస్తున్నారు. మూగ జీవులను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పశువులను కబేళాలకు తరలించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనుమానాస్పద సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు కోరారు.



ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
శుక్రవారం
15-05-2026
www.prajapaksham.in

రుత్విక్‌ను హీరోగా పరిచయం చేస్తూ వృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత కె. నిహారిక దాసరి చిత్రం 'రాజా ది రాజా'. అనిల్ బోయిడపు ఈ చిత్రానికి దర్శకుడు. విజనరీ డైరెక్టర్ నాగ్‌అశ్విన్ తాజాగా ఈ చిత్ర టీజర్‌ను లాంచ్ చేశారు.

రీల్

# 'రాజా ది రాజా' టీజర్ రిలీజ్ చేసిన నాగ్ అశ్విన్



రుత్విక్‌ను హీరోగా పరిచయం చేస్తూ వృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత కె. నిహారిక దాసరి చిత్రం 'రాజా ది రాజా'. అనిల్ బోయిడపు ఈ చిత్రానికి దర్శకుడు. విజనరీ డైరెక్టర్ నాగ్ అశ్విన్ తాజాగా ఈ చిత్ర టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నాగ్ అశ్విన్ మాట్లాడుతూ రిత్విక్, నిహారిక ఫ్యామిలీ ఫ్రెండ్స్. రిత్విక్ జర్నీని నేను దగ్గరగా చూశాను. చాలా డెడికేషన్‌తో వర్క్ చేశాడు. నిహారిక ఈ సిని మాను చాలా గ్రాండ్‌గా నిర్మించారు. ఇది జస్ట్ బిగినింగ్ మాత్రమే. టీమ్ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్ అని అన్నారు. డైరెక్టర్ హను రాఘవపూడి మాట్లాడుతూ ఈ సినిమాలో ఒక పాట చూశాను. చాలా బాగుంది. రిత్విక్‌లో చాలా మంచి క్రేజ్ ఉంది. తనకి ఆల్ ది వెరీ బెస్ట్. 'శంకరాభరణం' నా ఫేవరెట్ ఫిలిం. మంజు భార్గవిని ఈరోజు స్టేజ్ కలవడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. హీరో రుత్విక్ మాట్లాడుతూ 'రాజా ది రాజా' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతున్నాను. ఈ సినిమాను నిర్మించిన మా అక్కకి, మా డైరెక్టర్‌కు, టెక్నీషియన్స్‌కు, నటీనటులందరికీ థాంక్యూ. మీరందరూ మమ్మల్ని బ్లెస్ చేయాలని కోరుకుంటున్నాను. 'రాజా ది రాజా' జర్నీ చాలా మెమొరబుల్. ప్రతి దశలో నాకు ఎంతో సపోర్ట్ చేశారు. ప్రేక్షకులు సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను. త్వరలోనే సినిమా మీ ముందుకు వస్తుంది. డైరెక్టర్ అనిల్ చాలా డెడికేషన్‌తో సినిమా చేశారు. మంజు భార్గవితో స్క్రీన్ షేర్ చేసుకోవడం గౌరవంగా భావిస్తున్నాను అని తెలిపారు. నిర్మాత నిహారిక దాసరి మాట్లాడుతూ రిత్విక్లో చాలా ప్రతిభ ఉంది. నాకు ఈ సినిమా అవకాశం ఇచ్చిన మా నిర్మాత నిహారికకి, హీరో రిత్విక్‌కి చాలా థాంక్స్. నిహారిక ఎక్కడా రాజీ పడకుండా మాకు ఫుల్ సపోర్ట్ ఇచ్చారు. రిత్విక్ కి సినిమా, యాక్టింగ్ అంటే చాలా ప్యాషన్. ఈ సినిమా కోసం ఆయన చాలా హార్డ్ వర్క్ చేశారు. ఆద్య పాత్రకు ఆమె పర్ఫెక్ట్ ఛాయిస్ అని చెప్పారు. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకులు నాగ్ అశ్విన్, హను రాఘవపూడి, వివేక్ ఆత్రేయ, మేకర్స్‌ని ర్మాత రవి, సంగీత దర్శకుడు మార్క్ కె రాబిన్, హీరోయిన్ విశాఖ ధీమన్ పాల్గొన్నారు.

## 'రోజా రాణి' పాత్ర చూసి అమ్మోరు సినిమా గుర్తొచ్చింది

### దర్శకుడు రేలంగి నరసింహా రావు



సంధ్య ఫిలిం బ్యానర్‌పై రాంప్రసాద్ గురజాడ, అంజలి రామవతు, శ్రీకాంత్ పెరుమండ్ల యస్. చంద్ర కళ, చందా రోజా రాణి, బివి సుబ్బారెడ్డి నటీనటులుగా నాటక రంగంలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ వండర్ బుక్ ఆఫ్ వరల్ రికార్డ్ గ్రహీత, నంది గరుడ వంటి అవార్డులు పొందిన టి.రాము దర్శకత్వంలో నిర్మాత చందా లక్ష్మి నారాయణ నిర్మించిన సోషియో ఫాంటసీ చిత్రం గాలి. ఈ చిత్రం విడుదలై ఇరవై అయిదు రోజులుగా విజయవంతంగా ప్రదర్శించబడుతున్న సందర్భంగా చిత్ర యూనిట్ సక్సెస్ మీట్ ఫిలిం ఛాంబర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు పాల్గొన్నారు. నిర్మాత సాయి వెంకట్ తదితరులు బళ్లెం వేణుమాధవ్, రచయిత్రి జంద్యాల సుబ్బలక్ష్మి, డా. అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ గాలి చిత్రంలో అమ్మవారి పాత్ర నాకు నా మనసుకు హత్తుకుంది. ఈమె పాత్ర చూసిన తర్వాత మా మిత్రుడు కోడి రామకృష్ణ తీసిన అమ్మోరు సినిమా గుర్తుకు వచ్చింది. ఇందులో నటించిన రోజా రాణి అంత అద్భుతంగా నటించింది. అలాగే ఇందులో నటించిన వారందరూ కూడా చాలా బాగా నటించారు. నేను చాలా సినిమాలు తీశాను అప్పుడు అన్ని వంద రోజులు ఆడేవి. ఇప్పట్లో ఈ సినిమా ఇరవై అయిదు రోజులుగా విజయవంతంగా ప్రదర్శించబడడంలో ఎటువంటి సందేహం లేదు ఎందుకంటే సినిమా చాలా బాగుంది. ఇంకా ఈ సినిమా యాభై రోజుల ఫంక్షన్ కూడా జరుపుకోవాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఇలాంటి మంచి సినిమా తీసిన దర్శక నిర్మాతలకు నా అభినందనలు తెలుపుకుంటున్నాను. ఇలాంటి మంచి సినిమాలు తీయాలని రావాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.

### శ్రీ అమ్మ భగవాన్ బోధనలతో

## ఏదైనా సాధ్యమే



ఆధ్యాత్మికతను, మానవ సంబంధాలను మేళవిస్తూ శ్రీ ఆది లక్ష్మి పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న సరికొత్త చిత్రం 'ఏదైనా సాధ్యమే'. ఈ సినిమాకు 'దైవం తోడుంటే' అనేది ఉపశీర్షిక. ఈ చిత్ర టైటిల్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్లోని ఫిల్మ్ ఛాంబర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు మద్దూరి రాజా, నిర్మాత అనిల్ మునగనూరి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎన్.సుబ్రహ్మణ్యం, చిత్ర బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కథ, మాటలు, సాహిత్యాన్ని అందిస్తూ నిర్మిస్తున్న అనిల్ కుమార్ మునగనూరి మాట్లాడుతూ.. దేశానికి యువత ఎంతో ముఖ్యం. కానీ చాలా మంది నిరాశ లో, డిప్రెషన్‌లో కూరుకు పోతున్నారు. ఒక వ్యక్తికి జీవితంలో భగవంతుడి బంధం ఉన్నట్లయితే ఎలాంటి అద్భుతాలు జరుగుతాయో, అసాధ్యాలు సుసాధ్యాలుగా మారుతాయి అనేది ఈ చిత్రం ద్వారా చెప్పదలుచుకున్నాము. ఆధ్యాత్మిక బోధనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతుంది. తమ ఇష్టదైవంతో అనుసంధానమైతే అద్భుతాలు జరుగుతాయి అని చెప్పారు. ఈ చిత్రానికి రమేష్ సినిమాటోగ్రఫీని, ఫణీంద్ర ఎడిటింగ్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

## 'మంగా మంగా' పాటను ఆవిష్కరించిన అనిల్ రావిపూడి



శ్రీనివాస మంగాపురం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోగా పరిచయమవుతున్న హీరో జయకృష్ణ ఘట్టమనేని. సూపర్ స్టార్ కృష్ణ మనవడిగా, మహేష్ బాబు అన్న కొడుకుగా భారీ అంచనాల మధ్య ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్న ఆయన ఆ అంచనాలకు తగ్గట్టుగానే శ్రీనివాస్ మంగాపురంలో నటిస్తున్నారు. 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' వంటి విభిన్న చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'శ్రీనివాస మంగాపురం' వైలెంట్ రొమాంటిక్ డ్రామాగా రూపొందుతోంది. ఈ చిత్రంతో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. ఇప్పటికే విడుదలైన తొలి సింగిల్ 'అలెల్లే అలెల్లే' కేవలం రెండు వారాల్లోనే 4.6 మిలియన్ వ్యూస్ సాధించి ట్రెండింగ్ హిట్గా నిలిచింది. తాజాగా డైరెక్టర్ అనిల్ రావిపూడి ఈ సినిమా సెకండ్ సింగిల్ 'మంగా మంగా' సాంగ్‌ను విడుదల చేశారు. దర్శకుడు అజయ్ భూపతి విజన్‌కు తగ్గట్టుగా ఈ పాట యూత్‌ఫుల్ ఎనర్జీతో సినిమాకి మరింత కలర్ తీసుకొచ్చింది. ఈ పాటలో జయకృష్ణ, రాషాను ఇష్టపడి& తిరుపతిలోనే ఉండిపోవాలని కోరుకుంటూ, తనని జీవిత భాగస్వామిగా అంగీకరించమని సరదాగా ఆటపట్టించే విధంగా కనిపించారు. నేషనల్ అవార్డ్ విన్నింగ్ కంపోజర్ జివి ప్రకాశ్ కుమార్ ఈ పాటకు అద్భుతమైన ట్యూన్ అందించారు. ఎల్. వి. రేవంత్ అద్భుతంగా ఆలపించిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ అందించిన లిరిక్స్ మరింత ఫ్లేవర్ జోడించాయి.పెయిర్‌ను చాలా చార్మింగ్‌గా ప్రెజెంట్ చేసింది. ఈ చిత్రానికి జయకృష్ణ గుమ్మడి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, మాధవ్ కుమార్ గుళ్లపల్లి ఎడిటింగ్ నిర్వహిస్తున్నారు. నిర్మాత అశ్వినీ దత్ సమర్పణలో, జెమినీ కిరణ్ తన 'చందమామ కథలు' బ్యానర్‌పై ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు.

## రెండుగా చీలిన నిర్మాతలు

ఎస్.వి.సి వర్సెస్ మైత్రి
పర్సంటేజా? రెంటలా?



తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఉన్న బడా నిర్మాతలు రెండు వర్గాలుగా చీలిపోయారు. తెలంగాణ ఎగ్జిబీటర్స్, ప్రొడ్యూసర్స్ మీడియా ముందుకు వస్తే వీరికి పోటీగా మైత్రి మూవీస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థల నిర్మాతలు మీడియా ముందుకు వచ్చారు. దీంతో బడా నిర్మాతలు రెండుగా చీలిపోయారని స్పష్టమవుతోంది. ఎస్.వి.సి వర్గం ఒకటి, మైత్రి మూవీస్ వర్గం మరొకటిగా చీలిపోయారనే విషయం తేటతెల్లమైంది. ఎస్.వి.సి వర్గంలో ఏషియన్ ఫిలిమ్స్, మైత్రి మూవీస్ కు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ జత కలిసింది. ఎస్ వీ సి కు, మైత్రికి మధ్య గత రెండేళ్లుగా అంతర్గత వ్యాపార యుద్ధం నడుస్తోంది. ఇప్పుడు ఇది బయటపడిందనే వాదన బలంగా వినిపిస్తోంది. తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్‌లో దిల్ రాజు సోదరుడు శిరీష్ రెడ్డి, ఏషియన్ ఫిలిమ్స్ సునీల్ నారంగ్, తెలంగాణ ఫిలిం ఛాంబర్ కార్యదర్శి అనుపమ్ రెడ్డి, తెలంగాణ ఛాంబర్ మాజీ అధ్యక్షుడు, థియేటర్ అధినేత విజయేందర్ రెడ్డి, నిర్మాత చదలవాడ శ్రీనివాస్ రావు తదితరులు ఉన్నారు. అయితే మైత్రి వర్గంలో సితార, సాహు గారపాటి తప్ప పెద్దగా ఎవరూ కనిపించడం లేదు. సింగిల్ థియేటర్‌లు నైజంలో మూత పడే పరిస్థితికి వచ్చాయి కాబట్టి సినిమాలను పర్సంటేజ్ విధానంలో నడిపించాలని తెలంగాణ పంపిణి దారుల సంఘం డిమాండ్ చేస్తోంది. గత కొన్నేళ్లుగా ఈ సమస్య పెండింగ్ లో ఉంది కాబట్టి కనీసం ఇప్పుడైనా పరిష్కార మార్గం చూపించాలని పంపిణి దారులు అంటున్నారు. అయితే రామ్ చరణ్ నటించిన పెద్ది సినిమా విడుదలకు ముందు ఈ సమస్య ఎందుకు గుర్తుకొచ్చిందని మైత్రి , సితార సంస్థల నిర్మాతలు రవి శంకర్, సూర్యదేవర నాగ వంశీ తెలంగాణ పంపిణీదారులపై ఎదురుదాడికి దిగారు. మైత్రి, సితార నిర్మాతలు ఎస్ వి.సి, ఏషియన్ ఫిలిమ్స్ నిర్మాతలపై, పంపిణీ దారులపై వ్యక్తిగత విమర్శలు కూడా చేసిన పరిస్థితి నెలకొంది. ఎస్.వి.సిని ఉద్దేశించి ఫిలింనగర్‌లో విగ్రహాలు కట్టిస్తామని మైత్రి రవి శంకర్ వెటకారంగా మాట్లాడటంతో రెండు వర్గాల మధ్య ఉన్న విభేదాలకు తార స్థాయికి చేరాయని చెప్పుకోవచ్చు. చిన్న నిర్మాతల నుంచి మొదలుకొని తమ్మారెడ్డి భరద్వాజ వరకు పర్సంటేజ్ విధానానికే అంగీకరిస్తుంటే, మైత్రి, సితార వంటి కొంతమదని నిర్మాతలు మాత్రమే పర్సంటేజ్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. రెంటల్ విధానం కావాలని మైత్రి, సితార వాదిస్తుంటే, పర్సంటేజ్ విధానం అమలు చేయాల్సిందేనని తెలంగాణ పంపిణి దారుల సంఘం డిమాండ్ చేస్తోంది. ఈ రెండు విధానాలతో ఇప్పుడు పరిశ్రమలో నిర్మాతల మధ్య అనారోగ్యకరమైన పరిస్థితి నెలకొంది. పర్సంటేజ్ విధానం అమలు చెయ్యకపోది ఇరవై మూడు థియేటర్‌లను సిటీలో మూసి వేయాల్సిన పరిస్థితి నెలకొందని ఇప్పటికే కొందరు థియేటర్ యజమానులు ఫిలిం ఛాంబర్ కు లేఖ ఇచ్చారు. సింగిల్ థియేటర్‌లను కాపాడాలని తెలంగాణ పంపిణీదారులు వేడుకుంటున్నారు. మరి ఈ సమస్య త్వరగా పరిష్కారం అవుతుందా ? లేక చిరంజీవి వరకు వెళ్లి 'పెద్ది' విడుదల సమయంలో అయినా పరిష్కారం జరుగుతుందా? ఈ సమస్య పరిష్కారం కోసం చిరంజీవి, తమ్మారెడ్డి భరద్వాజ లాంటి పెద్దలు నడుం బిగిస్తారా? వేచిచూడాల్సిందే.

# మద్దతు ధరలు సాగు వ్యయాలకు సరిపోవు ధరలు

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు రైతులను మరింత నిరాశకు గురి చేసిందనివ్యవసాయ, మా శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ స్పష్టంగా సూచించినట్లుగా, సంపూర్ణ ఉత్పత్తి వ్యయం (సి2)పై కనీసం 50 శాతం లాభం కలిపి మద్దతు ధరను నిర్ణయించాలి అనే మూల సూత్రాన్ని కేంద్ర ప్రభుత్వం మరోసారి తుంగలో తొక్కిందని ఆయన మండిపడ్డారు. వరికి కేంద్రం ప్రకటించిన ఎంఎస్‌పి పేరుకు మాత్రమే పెంపు అని అన్నారు. సాధారణ వరికి క్వింటాల్‌కు రూ2,441గా నిర్ణయించగా గత ఏడాదితో పోలిస్తే కేవలం ఇది కేవలం రూ.72 ( 3శాతం) మాత్రమే పెంచారని మంత్రి తెలిపారు. ఎరువులు, కూలీ రెట్లు, విత్తనాలు, డీజిల్, విద్యుత్ ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో ఈ పెంపు రైతులకు ఏవిధంగా మేలు చేస్తుందో కేంద్ర ప్రభుత్వ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు వెన్నెముకతో దేశ ఆర్థిక వ్యవస్థ నడుస్తుంటే, ఆ రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన కేంద్రం ఖరీఫ్ సీజన్‌కు అన్ని పంటలకు నామ మాత్రమే మద్దతు ధరలను ప్రకటించి తీవ్ర అన్యాయం చేసిందని మంత్రి పేర్కొన్నారు. మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.2,410గా నిర్ణయించగా ఇది కేవలం రూ.10 (0.4 శాతం) మాత్రమేనని, రైతులకు పదిరూపాయలు ఇచ్చి వందల రూపాయల ప్రచారం చేసుకోవడం కేంద్ర ప్రభుత్వానికి అలవాటైపోయింది అని మంత్రి ఘాటుగా విమర్శించారు. కంది పప్పు క్వింటాల్‌కు రూ.8,450గా నిర్ణయించి రూ.450 పెంచినప్పటికీ, పప్పు ధాన్యాల సాగులో పెరుగుతున్న పెట్టుబడి వ్యయాలు, తెగుళ్ల ముప్పు, మార్కెట్ అనిశ్చితి దృష్ట్యా ఇది ఎంత మాత్రం సరిపోదన్నారు. తగిన పెంపు కాదని మంత్రి అభిప్రాయపడ్డారు.పత్తికి సంబంధించి క్వింటాల్‌కు రూ.8,267గా నిర్ణయించి .రూ.557 పెంచినప్పటికీ, పత్తి సాగులో ఎకరాకు అయ్యే భారీ పెట్టుబడి, కూలీల కొరత, పురుగుమందుల వ్యయం, దిగుబడి అనిశ్చితి నేపథ్యంలో రైతులకు ఇది సరిపోదన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని పంటలకు మంత్రి తెలిపారు.కేంద్ర ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధరలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, ఆ ధరలకే ఆయా పంటలను కేంద్ర ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసేలా తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

## కెటిఆర్‌కు సమన్లు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ కార్ రేస్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై నమోదైంది. 2023 ఫిబ్రవరిలో హుస్సేన్ సాగర్ తీరంలో తొలి ఫార్ములా ఈ రేస్ నిర్వహించగా, 2024లో రెండో రేస్ నిర్వహణ కోసం హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఎ) నుంచి సుమారు రూ.55 కోట్ల నిధులు ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థకు బదిలీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ చెల్లింపులు కేబినెట్ అనుమతి లేకుండా జరిగాయని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ కేసులో ఇప్పటికే ఎసిబి ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. కెటిఆర్‌ను ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ అవినీతి నిరోధక చట్టం, నిధుల దుర్వినియోగం, అధికార దుర్వినియోగం తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంపొందించడానికి, ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో పెట్టుబడులు ఆకర్షించడానికి మాత్రమే ఫార్ములా ఈ రేస్ నిర్వహించామని, ఇందులో ఎలాంటి అవినీతి జరగలేదని ఆయన గతంలో స్పష్టం చేశారు. అవసరమైతే ఎన్ని సార్లు అయినా విచారణకు హాజరవుతానని కూడా ప్రకటించారు. ఈ కేసు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారగా, రానున్న రోజుల్లో విచారణ మరింత వేగం పుంజుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## 30 నుంచి షురూ

(మొదటి పేజీ తరువాయి)

హర్యానా, చండీగఢ్, తెలంగాణ, పంజాబ్, కర్ణాటక, మేఘాలయ, మహారాష్ట్ర, జార్ఖండ్, నాగాలాండ్, త్రిపుర, దాద్రా అండ్ నగర్ హవేలీ, డామన్ అండ్ డయ్యూ కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి. ఈ 3వ దశలో 3.94 లక్షల మందికి పైగా బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఒలు) 36.73 కోట్ల మంది ఓటర్ల వద్దకు ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరిస్తారని ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. గత రెండు దశలలో 6.3 లక్షలకు పైగా బిఎల్ఒలు, 9.2 లక్షల బిఎల్ఎల మద్దతుతో 59 కోట్లకు పైగా ఓటర్లను కవర్ చేసినట్లు కూడా ఇసిఐ పేర్కొంది. ఈ ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతానికి శిక్షణ, గణన, ముసాయిదా ప్రచురణ, వాదనలు , అభ్యంతరాలు, తుది జాబితా ప్రచురణతో సహా పలు దశలుగా రూపొందించారు. 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల తుది ఓటర్ల జాబితాలు ఈ సంవత్సరం వేర్వేరు తేదీలలో ప్రచురించబడతాయి. సెప్టెంబర్ 6న ఒడిశా, సిక్కిం, మిజోరం, మణిపూర్‌లతో ప్రారంభమై, డిసెంబర్ 23న త్రిపురతో ఈ ప్రక్రియ ముగుస్తుంది.ఢిల్లీతో పాటు కర్ణాటక, మేఘాలయ, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల తుది ఓటర్ల జాబితాలు అక్టోబర్ 7న విడుదల కానున్నాయి. ఇప్పటికే బిహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, గోవా, అండమాన్ అండ్ నికోబార్ దీవులు, లక్షద్వీప్‌లలో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ పూర్తయింది. అసోంలో కూడా ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణను నిర్వహించారు.

## హైకోర్టులో నేడు తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

చేయకుండా రక్షణ కల్పించాలని కోరుతూ భగీరథ్ వేసిన పిటిషన్ తరఫు సీనియర్ లాయర్ నిరంజన్ రెడ్డి వాదనలు పూర్తి చేశారు. పిటిషనర్‌పై కేసును రద్దు చేయాలని తాము కోరడం లేదని, దర్యాప్తునకు పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, అరెస్టు చేయకుండా పిటిషనర్‌కు రక్షణ కల్పించాలని మాత్రమే కోరుతున్నామని చెప్పారు. ఎఫ్ఐఆర్‌లో తొలుత నమోదు చేసిన సెక్షన్లు ఏడేళ్లలోపు శిక్షకు సంబంధించినవేనని, అనంతరం కొత్త సెక్షన్లు చేర్చి కేసును తీవ్రతరం చేశారని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన అర్నేష్ కుమార్ తీర్పు ప్రకారం ఏడేళ్లలోపు శిక్ష ఉన్న కేసుల్లో అరెస్టు చేయరాదని గుర్తుచేశారు. బాధితురాలి వయసుపై కూడా అనేక సందేహాలు ఉన్నాయన్నారు. ఒక బెర్త్ డాక్యుమెంట్‌లో 2008గా, మరో పత్రంలో 2010గా నమోదు ఉందన్నారు. అలాగే 2021లో నిర్మల్‌లో నమోదైన డ్రైవింగ్ కేసులో బాధితురాలి వయసు 15 ఏళ్లుగా నమోదు చేశారని, దీని ప్రకారం ఆమె వయసు 19–20 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. ఆమె మేజర్ అయ్యే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఒకవేళ ఆమె మైనర్ అయినప్పటికీ, సంఘటన జరిగినట్లు చెబుతున్న తేదీ నుంచి నాలుగు నెలల తర్వాత మాత్రమే ఫిర్యాదు చేయడాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదులో భగీరథ్, బాధితురాలు రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లు ప్రస్తావించారని చెప్పారు. గత ఏడాది జూన్‌లో పరిచయం ప్రారంభమై, డిసెంబర్ చివర్లో విభేదాలు వచ్చినట్లు ఫిర్యాదులో ఉందన్నారు. అయితే జనవరి 1న సంఘటన జరిగిందని చెబుతూ మే 8 వరకు ఫిర్యాదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందని వాదించారు. కేసు తీవ్రతను తగ్గించి చూపడం లేదని, కానీ నిందితుడి హక్కులను కూడా కోర్టు రక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. కేసు మెరిట్స్‌లోకి వెళ్లకుండా, అరెస్టు నుంచి మాత్రమే రక్షణ కోరుతున్నామని స్పష్టం చేశారు. దర్యాప్తుకు హాజరైన వెంటనే పోలీసులు కస్టడీలోకి తీసుకునే అవకాశముందని, అందువల్ల మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోర్టును అభ్యర్థించారు.విచారణ సందర్భంగా న్యాయమూర్తి, తొలుత నమోదు చేసిన సెక్షన్లలో తర్వాత మార్పులు ఎందుకు చేశారో పోలీసులను ప్రశ్నించారు. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్ రావు స్పందిస్తూ, బాధితురాలి 161 స్టేట్‌మెంట్ నమోదు చేసిన తర్వాతే కొత్త సెక్షన్లు చేర్చామని తెలిపారు.

**ఇరుపక్షాలపై అసహనం**

విచారణ సందర్భంగా ఇరువర్గాల న్యాయవాదుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బాధితురాలి తరఫు న్యాయవాది ''నేరస్తుడు'', ''జైలుకు వెళ్లాల్సిందే'' అని వ్యాఖ్యానించడంపై పిటిషనర్ తరఫు న్యాయవాది నిరంజన్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆరోపణలు నిరూపితం కాకముందే నేరస్తుడిగా పేర్కొనడం చట్ట విరుద్ధమని అన్నారు. ఇప్పటికే కేంద్ర మంత్రి, పిటిషనర్ ఫొటోలతో పోస్టర్లు వెలిశాయని, విచారణ పూర్తికాకముందే నేరస్తుడిగా ముద్ర వేయడం సరికాదన్నారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుని, ఇరుపక్షాలు సంయమనం పాటించాలని సూచించారు. వ్యక్తిగత ఆరోపణలు కొనసాగితే కేసును మరో న్యాయమూర్తికి బదిలీ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. న్యాయవాదులు తమ కక్షిదారుల తరఫున మాత్రమే వాదనలు వినిపించాలని, వ్యక్తిగత స్థాయికి తీసుకెళ్లవద్దని సూచించారు. అదేవిధంగా బాధితురాలి వయసుకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని పోలీసులను ఆదేశించారు. 2021లో నమోదైన డ్రైవింగ్ కేసులో బాధితురాలి వయసు 15 ఏళ్లుగా నమోదు చేశారా లేదా అన్న అంశంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అలాగే బాధితురాలి జనన తేదీపై కూడా పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

## నిర్భయ ఘటన

(మొదటి పేజీ తరువాయి)

చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బస్సులో కర్టెన్లు ఉండటంతో బయటివారికి లోపల ఏమి జరుగుతోందో కనిపించలేదని పోలీసులు తెలిపారు. రాత్రి సుమారు 2 గంటల సమయంలో నిందితులు గాయాలపాలైన మహిళను బస్సు నుంచి బయటకు తోసేసి అక్కడి నుంచి పరారైనట్లు బాధితురాలు తెలిపింది. అనంతరం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా రాణిబాగ్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్ 64(1) (అత్యాచారం), 70(1) (సామూహిక అత్యాచారం), 3(5) (ఉమ్మడి ఉద్దేశం) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఉమేశ్, రాజేంద్రగా గుర్తించిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్లు వెల్లడించాయి.

## నియంతృత్వ నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీనిచ్చారు.

**నీట్ రద్దు పెద్ద నోట్ల రద్దు వంటిదే**

నీట్ రద్దు దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన పెద్ద నోట్ల రద్దు వంటిదేనని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్య పూరితమైన ఈ నిర్ణయం దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని చెప్పారు. తీవ్ర ఒత్తిడిలో సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోదీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కల్లలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, కొంత మంది తల్లిదండ్రులు నగలు అమ్మి తమ పిల్లలను నీట్ పరీక్షకు సన్నద్ధం చేయించారని, వారి ఆశలన్నీ గల్లంతవడం బాధాకరమన్నారు. 2019 నుండి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయినా, ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని సిఎం గుర్తు చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాలే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. గుజరాత్ రాష్ట్రంలోనే 14 పేపర్లు లీక్ అయ్యాయన్నారు. కేంద్ర, రాష్ట్ర పరీక్షలలో 93 పేపర్ లీక్ ఘటనలు ప్రధాని నరేంద్ర మోదీ 2014 మే నెలలో అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశంలోని ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు బహిర్గతమయ్యాయని సిఎం పేర్కొన్నారు. కాంగ్రెస్ విడుదల చేసిన 'ది పేపర్ లీక్ డెకేడ్' శ్వేతపత్రం ప్రకారం, కేంద్ర, రాష్ట్ర పరీక్షలలో 93 పేపర్ లీక్ ఘటనలు జరిగాయని ఈ సందర్భంగా సిఎం ప్రస్తావించారు. వీటివల్ల సుమారు 2 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని చెప్పారు. 2024లో కేవలం ఎనిమిది వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు రద్దయ్యాయని తెలిపారు. నీట్ యూజి (24 లక్షల మంది అభ్యర్థులు), యుజిసి నెట్ (9 లక్షలు), సిఎస్ఐఆర్‌నెట్, నీట్‌పిజి రద్దు అయినట్టు గుర్తు చేశారు. 2024లో ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష (16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది అభ్యర్థులు) కూడా కొన్ని రోజుల్లోనే రద్దైందని, ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన లీక్‌లు జరిగాయన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర బిజెపి పాలిత రాష్ట్రాలు కూడా ఈ కుంభకోణాల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (తప్పుడు మార్గాల నివారణ) చట్టం'ను ఆమోదించినప్పటికీ, పెద్ద కుంభకోణాలు వెలుగు చూసిన తర్వాత, 2024 జూన్ వరకు దాని నోటిఫికేషన్‌ను కేంద్రం ఆలస్యం చేసిందన్నారు.

## రైతులకు మోసం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర మంత్రివర్గం పూర్తిగా అశాస్త్రీయంగా నామ మాత్రం పెంచుతూ నిర్ణయం తీసుకుని రైతులను మరింత అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. బిజెపి పాలకుల మోసపూరిత నిర్ణయాలను అర్థం చేసుకుని సి2+50 శాతం ఆధారంగా మద్దతు ధరలు సాధించుకునేంత వరకు రైతాంగం సంఘటిత పోరాటాలకు సంసిద్ధం కావాలని కోరారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వరి ధాన్యానికి డాక్టర్ స్వామినాథన్ కమిషన్ ప్రతి పాదనల (సి2+50 శాతం) ప్రకారం క్వింటాల్‌కు రూ.3,662 కేటాయించాల్సి ఉండగా గత ఏడాది కంటే కేవలం రూ.72 లను మాత్రమే పెంచి క్వింటాల్‌కు రూ.2,441 ప్రకటించామని గొప్పగా చెప్పుకోవడం కేంద్ర పాలకుల దివాళాకోరుతనానికి నిదర్శమన్నారు. జొన్న పంటకు క్వింటాకు రూ.6035లతో పాటు ఇతర పంటలన్నింటికీ కూడా రైతు పెట్టిన పెట్టుబడికి 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధరలు ప్రకటించాల్సి ఉండగా ఆ దిశగా కనీస ఆలోచన కూడా చేయకపోవడం అన్యాయమన్నారు. ఖరీఫ్ పంటలకు అవసరమైన ఎరువుల సరఫరాకు సంబంధించి కేంద్ర మంత్రివర్గంలో కనీసం చర్చించలేదని, పైగా ఎరువులతో వచ్చిన షిప్పును ట్రంపుకు భయపడి వెనక్కి పంపిన ఘనత మన దేశ ప్రధానిదని అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సంవత్సర కాలం పాటు సాగిన రైతు ఉద్యమానికి ఇచ్చిన హామీ సి2+50 శాతం మద్దతు ధరలు పెంచడానికి గడిచిన నాలుగు ఏళ్లుగా ఎలాంటి చర్య తీసుకోకపోగా ప్రతి సంవత్సరం రైతులను మభ్యపెట్టడానికి అతి నామమాత్రంగా మద్దతు ధరలు పెంచామని ప్రకటించి చేతులు దులుపుకోవడం బిజెపి పాలకులకు పరిపాటిగా మారిందని విమర్శించారు. ప్రధానమంత్రి స్వయంగా ఇచ్చిన హామీ ఎప్పుడు నెరవేరుస్తారో నిలదీయటానికి రైతులు సమాయత్తం కావాలని విజ్ఞప్తి చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com